తెలుగు దినపత్రిక
https://aksharagalam.com
# అక్షరగళం
ప్రతి అక్షరం ప్రజల కోసం

పేజీలు: 8 | వెల: 3 | సంపుటి:3 | సంచిక: 157

శనివారం 08, నవంబర్ 2025

॥ ఎడిటర్: దయాకర్ రెడ్డి ॥

## రేవంత్ రెడ్డి ఒక బ్లాక్ మెయిలర్!

- సమాచార హక్కు చట్టం ఉపయోగించి రియల్ ఎస్టేట్, వ్యాపారవేత్తలను బ్లాక్ మెయిల్ చేశాడు
- నలుగురు రేవంత్ బ్రదర్స్ మాత్రమే హ్యాపీగా ఉన్నారు
- మీట్ ద ప్రెస్‌లో మాజీ మంత్రి హరీష్ రావు

5లో





**ప్రైవేట్ కళాశాల యాజమాన్యాలతో భట్టి, మంత్రి కోమటిరెడ్డి**

## చర్చలు విజయవంతం

- నిరసన కార్యక్రమాలు అన్ని రద్దు చేసుకున్నట్టు ప్రైవేటు కళాశాల యాజమాన్యాల సంఘం ప్రకటన
- 600 కోట్లు మూడు నాలుగు రోజుల్లో విడుదల చేస్తాం
- మరో 300 కోట్లు ప్రణాళిక బద్ధంగా త్వరలోనే క్లియర్ చేస్తాం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

హైదరాబాద్,నవంబరు7 (అక్షర గళం): కళాశాల యాజమాన్యాలు బకాయిలకు సంబంధించి 1,500 కోట్లు అడిగారు. ఇప్పటికే 600 కోట్లు విడుదల చేశారు. మరో 600 కోట్లు మూడు నాలుగు రోజుల్లో విడుదల చేస్తాం. మరో 300 కోట్లు ప్రణాళిక బద్ధంగా త్వరలోనే క్లియర్ చేస్తాం. ఫీజు రీయింబర్స్ మెంట్‌కు సంబంధించి ఒక కమిటీ వేయాలని కళాశాలల యాజమాన్యాలు అడిగాయి.గత చర్చల్లో అడిగాయి కమిటీని వేసాం. త్వరితగతిన కమిటీ నివేదిక వచ్చేలా విజ్ఞప్తి చేస్తాం. ఏ రకమైన సంస్కరణలు అవసరమో చర్చిస్తాం ఆ కమిటీలో అధికారులతో పాటు యాజమాన్యాల ప్రతినిధులకు అవకాశం కల్పిస్తాం. రాష్ట్రంలో ప్రైవేటు కళాశాలలకు సంబంధించిన ఫీజు రియం బర్స్మెంట్అంశానికి సంబంధించి కళాశాలల యాజ మాన్యాలతో శుక్రవారం ప్రజా భవన్లో యూని యన్ నాయకుల అందరితో కూర్చొని మాట్లాడటం జరిగిందనీ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. ప్రైవేటు యాజమాన్యాలకు గతంలో చెప్పినట్టుగా 1200 కోట్లకు సంబంధించి 600 కోట్లు ఇప్పటికే విడుదల చేశాం. ఈ నెలలో మరో 600 కోట్లు విడుదల చేస్తాం. అదనంగా అడుగు తున్న 300 కోట్లకు సంబంధించి ప్రణాళికా బద్ధంగా పరిష్కారం చూపే దిశలో యాక్షన్ ప్లాన్ ప్రకటిస్తామని యాజమాన్యాల సంఘానికి చెప్పడం జరిగింది.

మా ప్రకటనతో సానుకూలంగా స్పందించి ఆలోచించి అర్థం చేసుకొని ఈనెల మూడో తారీకు నుంచి కొనసాగుతున్న కళాశాలల బంద్ ను విరమించుకుంటున్నట్లు ఫాతి సంఘం సభ్యులు ప్రకటించారు అందుకు సంతోషిస్తున్నామని డిప్యూటీ సీఎం తెలిపారు. ఈనెల 8వ తేదీన అనుకున్న అధ్యాపకుల యాక్షన్ ప్లాన్, ఈనెల 15న అనుకున్న విద్యార్థులతో కార్యక్రమాన్ని విరమించుకుంటున్నట్టు అసోసియేషన్ సభ్యులు ప్రకటించారని డిప్యూటీ సీఎం తెలిపారు.

కళాశాలల ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలకు సంబంధించి ప్రతినెల ఎంతో కొంత తప్పనిసరిగా విడుదల చేస్తామని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. కళాశాలల సమస్యల పరిష్కారానికి ఒక కమిటీ వేయాలని ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్దామని గతంలో కళాశాలల యాజమాన్యాలు కోరాయి. వారి కోరిక మేరకు రాష్ట్ర ప్రభుత్వం మిగతా.. 2లో

# హైదరాబాద్ అభివృద్ధిని అడ్డుకుంటున్న 'బ్యాడ్ బ్రదర్స్'!

- మూసీ ప్రక్షాళన ఎందుకు అడ్డుకుంటున్నావ్ కిషన్ రెడ్డి?
- ఎందుకు కేటీఆర్‌కు లొంగిపోయావ్?
- 44 చెరువులను బీఆర్ఎస్ కబ్జా చేసింది
- హైడ్రాపై విషమెందుకు చిమ్ముతున్నారు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూటిప్రశ్న



హైదరాబాద్,నవంబరు7 (అక్షర గళం):జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజలకు ఒకటే సూచన చేయదలచుకున్నా.. 2004 నుంచి 2014 వరకు పదేళ్లు రాష్ట్రంలో, కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉంది. 2014 నుంచి 2023 వరకు రాష్ట్రంలో బీఆర్ఎస్, కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉంది.. కాంగ్రెస్, బీఆర్ఎస్ అభివృద్ధిని పోల్చి చూసి ఓటు వేయండని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఓటర్లను కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్‌లో అంతర్జాతీయ ఎయిర్ పోర్ట్, మెట్రో, నాలెడ్జ్ సెంటర్స్, ఐటీ, ఫార్మా ఇలా అన్ని రంగాల అభివృద్ధికి కాంగ్రెస్ బీజం వేసిందని తెలిపారు. ఇంకా, ఆయన ఏమన్నారంటే... ఐటీఐఆర్ హైదరాబాద్ రాకుండా చేసింది బీఆర్ఎస్, బీజేపీ కాదా? కాంగ్రెస్ తీసుకున్న ప్రణాళికలతోనే హైదరాబాద్ ఆదాయం పెరిగింది. వరదల్లో హైదరాబాద్ మునిగిపోతే కిషన్ రెడ్డి కేంద్రం నుంచి చిల్లిగవ్వ తీసుకురాలేదు. సచివాలయంలో ఆలయం కూల్చేస్తే కిషన్ రెడ్డి స్పందించలేదు. కాళేశ్వరం కట్టి లక్ష కోట్లు గోదావరిపాలు చేశారు. ప్రగతి భవన్ కేసీఆర్ కు, ఆయన కుటుంబానికి మాత్రమే ఉపయోగపడింది.

కొడుకు కోసం వాస్తు సరిద్దడానికి ఉన్న సచివాలయాన్ని కూల్చి కొత్తది కట్టిండ్రు. సచివాలయం నిర్మిస్తే ఎవరికైనా ఉద్యోగాలు వచ్చాయా? ఎవరికైనా పని కొచ్చిందా. పేద ప్రజలకు ఆ సచివాలయంతో ఏమైనా ప్రయోజనం ఒనగూరిందా? ఫోన్ ట్యాపింగ్ కోసం కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేసుకున్నారు. సద్దాం హుస్సేన్ లా ప్రాణభయంతో తనను తాను కాపాడేందుకు ప్రగతి భవన్ లో బుల్లెట్ ప్రూఫ్ బాత్రూమ్ లు కట్టుకుండు.

8 లక్షల 11 వేల కోట్ల అప్పుతో మాకు రాష్ట్రాన్ని అప్పగించారు. ఆనాడు కాంగ్రెస్ ఏర్పాటు చేసిన విద్యా సంస్థలే మనకు అంతర్జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చాయి. కాంగ్రెస్ ఇచ్చిన ఐటీఐఆర్ ను రద్దు చేయడం తప్ప వీళ్లు ఒక్క అదనపు ఎయిర్ పోర్టునైనా తెచ్చారా... పదేళ్లలో మెట్రోను ఒక కిలోమీటరైనా విస్తరించారా? నగర విస్తరణతో పాటు మెట్రో విస్తరణ ఎందుకుచేయలేదు?

కాంగ్రెస్ మొదలు పెట్టిన సాగునీటి ప్రాజక్టులను పదేళ్లలో ఎందుకు పూర్తి చేయలేదు? పదేళ్లలో 20 లక్షల కోట్ల బడ్జెట్‌ను ఏం చేశారో సమాధానం చెప్పాలి? కాంగ్రెస్ నిర్మించిన ఔటర్ రింగ్ రోడ్డును కూడా అమ్ముకున్నారు.

పదేళ్ల కోసం కొత్త ప్రణాళికలు రచిస్తున్నాం... తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ తయారు చేసుకుంటున్నాం. హైదరాబాద్ నగర ప్రజల కోసం పరితపించిన పీజేఆర్, శశిధర్ రెడ్డిని హైదరాబాద్ బ్రదర్స్ అనేవారు. ఇప్పుడు కిషన్ రెడ్డి, కేటీఆర్ ను బ్యాడ్ బ్రదర్స్ అంటున్నారు. మెట్రో, గోదావరి జలాలు, ఎలివేటెడ్ కారిడార్లు, ఫ్యూచర్ సిటీని బ్యాడ్ బ్రదర్స్ అడ్డుకుంటున్నారు. మేం వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్ పోర్టు లకు అనుమతులు తీసుకొచ్చాం. మరిన్ని ఎయిర్ పోర్టులకు అనుమతులు తెచ్చే ప్రయత్నం చేస్తున్నాం. డ్రై పోర్టు ఏర్పాటు కోసం గ్రీన్ ఫీల్డ్ హైవేను నిర్మించేందుకు అనుమతులు తెచ్చుకున్నాం. ఎలీ లిల్లీ లాంటి కంపెనీ 1 బిలియన్ డాలర్స్ ఫార్మాలో పెట్టుబడులు పెడుతోంది. రెండేళ్లలో ఒక ఏడాది ఎన్నిక కోడ్‌తో అభివృద్ధి జరగలేదు..

మిగిలిన ఏడాదిలో 3 లక్షల కోట్లు పెట్టుబడులు తెచ్చాం. వేలాది కోట్లు తెచ్చి నగర మిగతా.. 2లో

## వందేమాతరంతో ఆత్మవిశ్వాసం

- అది భవిష్యత్‌కు సరికొత్త భరోసా
- వందేమాతరం 150వ స్మారకోత్సవంలో ప్రధాని మోదీ

హైదరాబాద్,నవంబరు7(అక్షర గళం): వందేమాతరం శబ్దం విన్నంతనే మనలో ఆత్మవిశ్వాసాన్ని నింపుతుందని ప్రధాని మోదీ అన్నారు. భవిష్యత్తుకు సరికొత్త భరోసా ఇస్తుందన్నారు. శుక్రవారం దిల్లీలోని ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియంలో వందే మాతరం 150వ స్మారకోత్సవంలో పాల్గొన్న ప్రధాని మోదీ మాట్లాడారు.



స్వాతంత్ర్య ఉద్యమంలో కోట్ల మంది భారతీయుల్లో స్ఫూర్తి నింపిన వందేమాతరం గేయానికి శుక్రవారంతో 150 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా ఏడాది పొడవునా కార్యక్రమాలు నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ గేయాన్ని మిగతా.. 2లో

## ప్రైవేట్ విద్యాసంస్థల తాట తీస్తా..

- విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటారా
- బంద్ పెట్టి బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేస్తానంటే ఎలా
- విద్యార్థుల అకడమిక్ ఇయర్ లాస్‌కు ఎవరు బాధ్యులు
- ఫీజులు ఇష్టానుసారం పెంచి రియింబర్స్‌మెంట్‌పై ఒత్తిడి
- రాజకీయ పార్టీల ఉచ్చులో పడి బెదిరిస్తే ఊరుకునేది లేదు
- ప్రైవేట్ విద్యాసంస్థల తీరుపై సిఎం రేవంత్ ఘాటు హెచ్చరికలు



హైదరాబాద్, (అక్షర గళం): ప్రైవేటు విద్యాసంస్థల నిర్వాహకులు తమాషా చేస్తే తాటతీస్తానని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటే ఊరుకునేది లేదని వార్నింగ్ ఇచ్చారు. విద్య అనేది సేవ.. వ్యాపారం కాదని స్పష్టం చేశారు. ప్రైవేట్ విద్యాసంస్థలు సేవ చేయడం లేదు.. వ్యాపారం చేస్తున్నాయని సీరియస్ అయ్యారు. శుక్ర వారం గాంధీభవన్ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. విద్యార్థులకు నష్టం కలిగిస్తే ఉపేక్షించబోమని హెచ్చరించారు. ఫీజు రీయంబర్స్‌మెంట్‌పై మిగతా.. 2లో

## గోపీనాథ్ ఆస్తులపై సీఎం రేవంత్ రెడ్డి, మాజీ మంత్రి కేటీఆర్ మధ్య గొడవలు

- ఆ ఆస్తులు పంచుకునేందుకు కుట్రలు
- ఆస్తి పంపకాల్లో ఇద్దరి మధ్య తేడాలు
- గోపీనాథ్ మరణం వెనుక మిస్టరీ ఉందని ఆయన తల్లే చెబుతోంది
- అయినా విచారణ జరపకపోవడానికి కారణం ఇదే..
- సీఎంకు చిత్తశుద్ధి ఉంటే సమగ్ర విచారణ జరపాల్సిందే
- జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ఎన్నికల కమిషన్, పోలీసు అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించడం లేదు
- కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు కొమ్ముకాస్తున్నారు... సిగ్గు చేటు
- తెలంగాణలో అధికార, ప్రతిపక్ష పార్టీలు కలిసి పనిచేస్తున్నాయి
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కమార్ సంచలన ఆరోపణలు



హైదరాబాద్,నవంబరు7 (అక్షర గళం): జూబ్లీహిల్స్ దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆస్తులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ మంత్రి కేటీఆర్ కన్నేశారని, ఆ ఆస్తి పంపకాల్లో ఇద్దరి మధ్య ఇటీవల గొడవలు వచ్చాయని, గోపీనాథ్ మరణం మిస్టరీ అని స్వయానా ఆయన తల్లే ఆరోపించిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కమార్ సంచలన ఆరోపణలు చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో విలేఖర్లతో మాట్లాడారు. ఈ సంఘటనపై ముఖ్యమంత్రిసహా కాంగ్రెస్ నేతలెవరూ స్పందించకపోవడానికి కారణం ఇదేనని చెప్పారు. సీఎంకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే గోపీనాథ్ మరణంతోపాటు ఆస్తిపాస్తులపై సమగ్ర విచారణ జరిపించి వాస్తవాలు నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు.జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ఎన్నికల కమిషన్, పోలీసు అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించడం లేదు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు కొమ్ముకాస్తున్నారు...సిగ్గు చేటు. తెలంగాణలో అధికార, ప్రతిపక్ష పార్టీలు కలిసి పని చేస్తున్నాయి. కూడబలుక్కునే ఒకరికొకరు తిట్టుకుంటున్నారు. మేం ప్రచార సభలకు అనుమతి కోసం దరఖాస్తు చేస్తే జాప్యం చేస్తూ చివరి నిమిషంలో రద్దు చేస్తున్నారు. ఈరోజు మీనాక్షిపురం(రహమత్ నగర్)లో సాయంత్రం సభకు పర్మిషన్ ఇవ్వాలని మిగతా.. 2లో

### ఫీజు రీ యింబర్స్‌మెంట్ పథకాన్ని కొనసాగిస్తారా? ఎత్తి వేస్తారా?

- విద్యార్థులు, అధ్యాపకులు, కాలేజీ యాజమాన్యాల ఆందోళనకు బీజేపీ మద్దతు
- రేవంత్‌కు బండి సూటిప్రశ్న

హైదరాబాద్,నవంబరు7 (అక్షర గళం): ఫీజు రీ యింబర్స్‌మెంట్ బకాయిలు అడిగితే బ్లాక్ మెయిల్ చేస్తారా? అసెంబ్లీ సాక్షిగా ప్రతినెల రూ.500 కోట్ల చొప్పున ఫీజు రీ యింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లిస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట ఇచ్చింది నిజం కాదా? ఆ బకాయిలు చెల్లిస్తామని టోకెన్లు ఇచ్చి మోసం చేసింది నిజం కాదా? అని సీఎం రేవంత్ రెడ్డి తీరుపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఫైర్ మిగతా.. 2లో



## రేవంత్‌కి దమ్ముంటే 24 నెలల తన పాలన చూపించి ఓట్లు అడగాలి

- కాంగ్రెస్ పార్టీకి స్వర్గీయ ఎన్టీ రామారావు పేరును ఎత్తే నైతిక అర్హత లేదు
- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో రేవంత్ రెడ్డి ఓటమి అంగీకరించాడు
- అందుకే జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక తన పాలనకు రెఫరండం కాదు అన్నాడు
- రెండు సంవత్సరాల్లో జరిగిన అరాచకాన్ని అంతకుముందు 10 సంవత్సరాల
- బిఆర్ఎస్ పాలనలోని వికాసాన్ని చూసి ఓటు వేయాలని కేటీఆర్ విజ్ఞప్తి
- హైడ్రా గురించి గొప్పగా చెబుతున్న రేవంత్ రెడ్డికి దమ్ముంటే మంత్రుల అక్రమ నిర్మాణాలను తొలగించాలి
- రెండు సంవత్సరాల అరాచకాన్ని అవినీతిని తరిమికొట్టాలంటే జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌ను ఓడించాలని కేటీఆర్ పిలుపు

హైదరాబాద్,నవంబరు7 (అక్షర గళం): రేవంత్ రెడ్డికి దమ్ముంటే తన 24 నెలల పరిపాలన చూపించి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ప్రజల తీర్పుకోరాలని మిగతా.. 2లో



## ప్రధాని మోదీ గొప్ప వ్యక్తి, నా మిత్రుడు

- 2026లో భారత్‌లో పర్యటిస్తా
- వాణిజ్య సంబంధాలను పటిష్టం చేస్తా
- డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ,నవంబర్7(అక్షర గళం): అమెరికా– భారత్ మధ్య టారిఫ్ ఉద్రిక్తతలు నెలకొన్న వేళ ప్రధాని నరేంద్ర మోదీని ఉద్దేశించి అగ్రరాజ్యం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోదీ గొప్ప వ్యక్తి, తన మిత్రుడు అంటూ కొనియాడారు. అలాగే, ఇరు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలను పటిష్టం చేసే ప్రయత్నాల్లో భాగంగా, మిగతా.. 2లో

## శబరిమలకు ప్రత్యేక రైళ్లు..

హైదరాబాద్,నవంబర్7(అక్షర గళం): అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం శబరిమలకు ప్రత్యేక రైళ్లను దక్షిణ మధ్య రైల్వే ఏర్పాటు చేసింది. శుక్రవారం నుంచి (నవంబర్ 7) జనవరి వరకు 60 ప్రత్యేక రైళ్లను



తిప్పనుంది. చర్లపల్లి, మచిలీపట్నం, నర్సాపూర్ నుంచి శబరిమల సమీప స్టేషన్ల వరకు నడుపుతుంది. శుక్రవారం నుంచి ఈ రైళ్లకు సంబంధించిన టికెట్లు రిజర్వేషన్ చేసుకునే అవకాశం ఉంది. చర్లపల్లి నుంచి కొల్లాం (రైలు నంబర్ 07107)– నవంబర్ 17, 24 తేదీల్లో, డిసెంబర్ మిగతా.. 2లో

## డయబిటిస్, ఒబెసిటీ ఉన్నా వీసా తిరస్కరణ

- తాజాగా ప్రతిపాదనలు తెస్తున్న ఆమెరికా
- అంతర్జాతీయ మీడియా కథనాలు

వాషింగ్టన్,నవంబర్7(అక్షర గళం): అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వలస దారులపై,వారికిచ్చే వీసాలపై కఠిన నిబంధనలు అమలు చేస్తోన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో నిబంధనను తీసుకొచ్చారు. డయాబెటిస్, ఒబెసిటీ వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారికి వీసాలను తిరస్కరించాలనే



కొత్త నిబంధనలను రూపొందించారు. ఈ మేరకు అమెరికా ఎంబసీలు, కాన్సులర్ కార్యాలయాలకు అగ్రరాజ్య విదేశాంగ శాఖ తాజాగా మార్గదర్శకాలు జారీ చేసినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. సాధారణంగా అమెరికా వీసా కోసం దరఖాస్తు చేసుకునే వారి ఆరోగ్య స్థితిని ఇమిగ్రేషన్ అధికారులు పరిశీలిస్తారు. టీబీ వంటి అంటు వ్యాధులు ఉన్నాయో లేదో మిగతా.. 2లో

# గోపీనాథ్ ఆస్తులపై సీఎం రేవంత్ రెడ్డి, మాజీ మంత్రి కేటీఆర్ మధ్య గొడవలు

(మొదటి పేజీ తరువాయి)

ఈనెల 4న దరఖాస్తు చేసుకున్నాం.

నిన్నటిదాకా దీనిపై స్పందించలేదు. కానీ పొద్దున ఫోన్ చేసి అనుమతి ఇవ్వడం లేదని, వేరేచోట పెట్టుకోవాలని చెబుతున్నారు. మేం ఎక్కడ సభ పెట్టుకోవాలో కూడా వాళ్లే మాకు చెబుతున్నరంటే ఏమనాలి?. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు మాత్రం ఎక్కడ అడిగితే అక్కడ మీటింగ్ కు అనుమతి ఇస్తున్నారు. చివరి నిమిషంలో ఎక్కడైనా అనుమతి ఇచ్చినా కండీషన్లు పెడుతున్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు డీజేలు పెట్టుకోవడానికి, హంగామా చేయడానికి మాత్రం అనుమతి ఇస్తారు. ఇదేం ద్వంద్వ వైఖరి?. బీజేపీ సభలకు అనుమతిస్తే... ఒక వర్గం ఓట్లు రావనే భయం కాంగ్రెస్, బీఆర్ఎస్ లకు పట్టుకుంది. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండు సీట్లను బీజేపీ గెలుచుకుంది. జూబ్లిహిల్స్ లో బీజేపీ గెలవకూడదనే కుట్రతోనే మా సభలకు అనుమతి ఇవ్వడం లేదు. దొంగ సర్వేల పేరుతో బీజేపీ పోటీలో లేదంటూ తప్పుడు ప్రచారం చేయిస్తున్నారు.

ప్రజల ఆలోచన మాత్రం కాంగ్రెస్, బీఆర్ఎస్ లకు గుణపాఠం చెప్పాలని ఎదురు చూస్తున్నాయి. ఈ విషయం తెలిసే కాంగ్రెస్ పార్టీ ముస్లింల మెప్పు పొందేందుకు యత్నిస్తోంది. జూబ్లిహిల్స్ ఎన్నికల్లో బీజేపీ వర్సెస్ ఐఎంసీ(ఇండియన్ ముస్లిం కాంగ్రెస్) మధ్యే పోటీ. భారతీయ జనతా పార్టీ వర్సెస్ ఇండియన్ ముస్లిం కాంగ్రెస్ మధ్యే పోటీ. కాంగ్రెస్ కు ముస్లిం ఓట్లు కోసం మాత్రమే యత్నిస్తోంది. హిందువులంతా తమ సత్తా ఏమిటో కాంగ్రెస్ కు రుచి చెప్పాలని కోరుతున్నా. బీఆర్ఎస్ పరిస్థితి ఆగమ్య గోచరంగా మారింది.

ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ ముందే చేతులెత్తేసింది. జూబ్లిహిల్స్ ప్రజలారా... అభివృద్ధి కావాలా? అరాచక కావాలా? తేల్చుకోండి. కాంగ్రెస్ గెలిస్తే మజ్లిస్ గెలిచినట్లే...అరాచకాలు, అక్రమాలకు తావిచ్చినట్లే. సీఎం రేవంత్ రెడ్డి ఓట్ల కోసం దిగజారి మాట్లాడు తున్నరు. కాంగ్రెస్ అంటేనే ముస్లింలు అని చెబుతున్నారు.

దేశ జవాన్లను అవమానించేలా, హేళన చేసేలా మాట్లాడారు. మాగంటి గోపీనాథ్ మరణం విషయంలో ఆయన తల్లిని మానసిక క్షోభకు గురిచేశారు. కన్న కొడుకును కూడా కొడుకు గోపీనాథ్ ముఖం చూడనీయకుండా చేయడంపై అనేక అనుమానాలు న్నయి. నా కొడుకు మరణం ఒక మిస్టరీ అని స్వయానా గోపీనాథ్ తల్లే చెబుతోంది. అసలు గోపీనాథ్ చనిపోయింది ఎప్పుడు? ముందే చనిపోయారని చెబుతున్నారు.... ఎవరి కోసమే ఆపారని చెబుతున్నారు. గోపీనాథ్ మరణంపై సమగ్ర విచారణ జరపాలి. గోపీనాథ్ కుటుంబ సభ్యులు, ఆసుపత్రి యాజమాన్యం స్టేట్ మెంట్లను రికార్డు చేయాలి. తన తండ్రిని చూడటానికి రావొద్దంటూ బీఆర్ఎస్ నేత మాజీ మంత్రి పువ్వాడ అజయ్ బెదిరించినట్టు గోపీనాథ్ కొడుకే ఆరోపించారు. అయినా సీఎం రేవంత్ రెడ్డి గుండె మాత్రం కరగడం లేదు... స్పందించడం లేదు. ఎందుకంటే గోపీనాథ్ ఆస్తులపై సీఎం రేవంత్ రెడ్డి, మాజీ మంత్రి ట్విట్టర్ టిల్లు మధ్య పంపకాల యవ్వారం ఉంది. అందుకే కేసీఆర్ కుటుంబంపై ఉన్న కేసులపై విచారణ జరగడం లేదు. అరెస్టు చేయడం లేదు.

గోపీనాథ్ ఆస్తిపాస్తుల పంపకాల్లో కేటీఆర్, రేవంత్ మధ్య గొడవలు స్టార్ట్ అయ్యాయి. వీటికోసమే వీరిద్దరి మధ్య పగలు, పట్టింపులు ఎక్కువయ్యాయి. గోపీనాథ్ చనిపోయాక ఆయన ఆస్తులను వీళ్లద్దరూ పంచుకున్నారు. దమ్ముంటే గోపీనాథ్ ఆస్తులెన్ని? అవన్నీ ఎటుపోయాయో చెప్పే దమ్ముందా? గోపీనాథ్ మరణం, ఆస్తుల వ్యవహారంపై విచారణ జరిపించే దమ్ము రేవంత్ రెడ్డికి ఉందా?. గోపీనాథ్ మరణంపై స్వయానా తల్లి ఆరోపణలపై ఇంతవరకు కాంగ్రెస్ ఎందుకు స్పందించడం లేదు?.

సీఎంకు నిజంగా సంబంధం లేదని భావిస్తే... తక్షణమే గోపీనాథ్ మరణం, ఆస్తిపాస్తులపై సమగ్ర విచారణ జరిపించాలి. గోపీనాథ్ మరణం వెనుక ఏం జరిగిందో.. ఆయన ఎప్పుడు చనిపోయారు? ఎవరికి ఆలస్యంగా ఆయన చనిపోయినట్లు ఆసుపత్రి యాజమాన్యం ప్రకటన చేసిందో విచారణ జరపాల్సిందే. ఎక్కడైనా ఆస్తుల పంపకాలపై కుటుంబ సభ్యులు కొట్లాడుకోవడం చూశాం. ఇక్కడ మాత్రం గోపీనాథ్ ఆస్తులపై సీఎం రేవంత్, ట్విట్టర్ టిల్లు కొట్లాడుకోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది.

గోపీనాథ్ మరణంపై ఆయన అనుచరులకు, బీఆర్ఎస్ క్యాడర్ కు కూడా అనేక అనుమానాలున్నాయి. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో గోపీనాథ్ అనుచరులెవరూ ప్రచారం కూడా చేయడం లేదు. ప్రజలకు వాస్తవాలు అర్థమయ్యాయి. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పరిస్థితులు మారిపోయాయి.

బీజేపీ గెలుపు తథ్యం. సర్వే నివేదికల పేరుతో కాంగ్రెస్, బీఆర్ఎస్ చేస్తున్న కుట్రలు ప్రజలకు అర్థమయ్యాయి. హర్యానా ఎన్నికలుసహా అనేక ఎన్నికల్లో బీజేపీ ఓడిపోతుందని సర్వేలు ప్రచారం చేశాయి. ఫలితాలు అందుకు భిన్నంగా వచ్చిన విషయాన్ని గుర్తుంచుకోవాలి. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ గెలిస్తే... చైన్ స్నాచర్లకు, గంజాయి విక్రేతలకు, సంఘ విద్రోహ శక్తులకు అడ్డాగా మారబోతోంది.

## ఫీజు రీ యింబర్స్‌మెంట్ పథకాన్ని కొనసాగిస్తారా? ఎత్తి వేస్తారా?

(మొదటి పేజీ తరువాయి)

అయ్యారు. సంజయ్ కుమార్ ఇంకా ఏమన్నారంటే..

ఆనాటి నుండి నేటి వరకు ఒక్క రూపాయి కూడా బకాయి చెల్లించకుండా కాలేజీ యాజమాన్యాలను మోసం చేస్తోంది నిజం కాదా? రాష్ట్రం పూర్తిగా అప్పుల ఊబిలో కూరుకుపోతే... మరి టోకెన్లు ఎందుకు ఇచ్చినట్లు? అసెంబ్లీ సాక్షిగా ఎందుకు హామీ ఇచ్చినట్లు? చట్టసభలో ఇచ్చిన హామీకే విలువ లేకుంటే ఇక అసెంబ్లీకి విలువ ఏముంది?

అసెంబ్లీ ఎన్నికలకు ముందే తెలంగాణ రూ.7 లక్షల కోట్ల అప్పుల్లో ఉందని రేవంత్ రెడ్డే చెప్పారు కదా?

ఇప్పుడు అందుకు భిన్నంగా మాట్లాడుతూ ప్రజలను తప్పుదోవ పట్టించడం దుర్మార్గం. ఫీజు రీ యింబర్స్‌మెంట్ చెల్లించకపోతే కాలేజీలు ఎట్లా నడవాలి? అధ్యాపకులకు జీతాలివ్వకపోతే విద్యార్థులకు చదవు చెప్పేదెవరు?

కాలేజీ యాజమాన్యాలపై సీఎంకు ఉన్న కోపంతో విద్యార్థుల జీవితాలను బలి చేయాలనుకుంటున్నారా?

ఆ పథకాన్ని ఎత్తేసేందుకు కాంగ్రెస్ కుట్ర చేస్తోంది. చట్టం పేరుతో బెదిరింపులకు పాల్పడితే పాలన నడవదనే విషయాన్ని సీఎం గుర్తుంచుకోవాలి. తక్షణమే ఫీజు రీ యింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించి చట్టం గురించి మాట్లాడితే మంచిది. అసలు ఫీజు రీ యింబర్స్‌మెంట్ పథకాన్ని కొనసాగిస్తారా? ఎత్తి వేస్తారా? ప్రజలకు స్పష్టం చేయండి. ఫీజు రీ యింబర్స్ మెంట్ బకాయిలు చెల్లించేదాకా విద్యార్థులు, అధ్యాపకులు, కాలేజీ యాజమాన్యాలు చేసే ఆందోళన కార్యక్రమాలకు బీజేపీ మద్దతు కొనసాగుతోంది.

# ప్రధాని మోదీ గొప్ప వ్యక్తి, నా మిత్రుడు

(మొదటి పేజీ తరువాయి)

వచ్చే ఏడాది తాను భారత్‌ను సందర్శించే అవకాశం ఉందని ట్రంప్ ప్రకటించారు. వైట్‌హౌస్‌లో ట్రంప్ విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా భారత్‌తో వాణిజ్య చర్చలపై విలేకరులు ప్రశ్నలు అడిగారు. ఈ క్రమంలో మోదీతో తన చర్చలు అద్భుతంగా కొనసాగుతున్నాయని ట్రంప్ సమాధానం చెప్పారు. ప్రధాని మోదీ రష్యా నుంచి ఇంధన కొనుగోలును చాలా వరకు ఆపేశారు. ఆయన నాకు మిత్రుడు, మేము మాట్లాడుతుంటాం. మోదీ గొప్ప వ్యక్తి. ఆయన నాకు మిత్రుడు, ఆయన నన్ను అక్కడికి రావాలని ఆహ్వానించారు. నేను తప్పకుండా వెళతాను. పర్యటనను ఖరారు చేస్తామని అన్నారు. తాను భారత్‌కు వెళతానని ట్రంప్ చెప్పిన నేపథ్యంలో వచ్చే ఏడాది వెళ్లే అవకాశం ఉందా? అని విలేకరులు అడిగారు. దీనికి ట్రంప్ బదులిస్తూ 'అవును, వచ్చే ఏడాది ఉండొచ్చు' అని సమాధానం చెప్పారు. వాస్తవానికి భారత్‌లో జరగాల్సిన క్వాడ్ మీటింగ్‌కు ట్రంప్ రావాల్సి ఉంది. అయితే ట్రంప్ ఇకపై క్వాడ్ సమ్మిట్ కోసం భారత్‌కి రాకపోవచ్చని అన్నారు. ఈ ఏడాది ఆగస్టులో ఒక వ్యాసంలో పేర్కొంది. భారత్‌తో వాణిజ్య సుంకాల (టారిఫ్) వివాదాల నేపథ్యంలో ఆ ప్రయాణాన్ని వాయిదా వేసినట్లు ఆ రిపోర్ట్ తెలియజేసింది. అయితే ట్రంప్ తాజాగా చేసిన వ్యాఖ్యలు రెండు దేశాల మధ్య సంబంధాలు మళ్లీ సానుకూల దిశలో సాగుతున్నాయనే సంకేతంగా భావించవచ్చు. ప్రస్తుతం భారత్ – అమెరికా మధ్య వాణిజ్య చర్చలు కీలక దశలో ఉన్నాయి. ఈ క్రమంలో ట్రంప్ నుంచి ఇలాంటి కామెంట్స్ రావడం ప్రాధాన్యత సంతరించుకొన్నది. రష్యా చమురును భారత కొనుగోలు చేస్తున్న నేపథ్యంలో అమెరికా అదనంగా 25 శాతం సుంకాలని విధించిన విషయం తెలిసిందే. ఉక్రెయిన్‌తో యుద్ధం నేపథ్యంలో రష్యాను ఆర్థికంగా ఒంటరి చేయాలని భారత్‌పై ట్రంప్ అదనపు సుంకాలను విధించారు. అయితే, తాజాగా భారత్ రష్యా నుంచి ఇంధన కొనుగోళ్లను తగ్గించుకోవాలని నిర్ణయించినట్లు ఇటీవల ట్రంప్ స్వయంగా ప్రకటించారు. అంతేకాకుండా, ఆగిపోయిన వాణిజ్య చర్చలు కూడా ఫలప్రదంగా సాగుతున్నట్లు వెల్లడించారు. దీపావళి రోజు కూడా మోదీకి కాల్ చేసి ట్రంప్ శుభాకాంక్షలు చెప్పారు. ఈ సందర్భంగా ఇరువురు నేతలు రష్యా చమురు కొనుగోలు, వాణిజ్యంపై చర్చించినట్లు ట్రంప్ మరోసారి పునరుద్ఘాటించారు. వైట్‌హౌస్ ప్రెస్ సెక్రెటరీ కరోలిన్ లీవిట్ కూడా దీనిపై క్లారిటీ ఇచ్చారు. అధ్యక్షుడు ట్రంప్ భారత్-అమెరికా సంబంధాలపై సానుకూలంగా ఉన్నారని, వైట్‌హౌస్‌లో జరిగిన దీపావళి వేడుకల సందర్భంగా ప్రధాని మోదీతో నేరుగా మాట్లాడారని ధృవీకరించారు. అయితే రష్యా నుంచి భారత్ ఇంధన కొనుగోళ్లను తగ్గించుకుంటుందన్న ట్రంప్ వ్యాఖ్యలపై భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ఈ నెల ప్రారంభంలో స్పందించింది. తమ దేశం ఇంధన విధాన నిర్ణయాలు జాతీయ ప్రయోజనాలు, వినియోగదారుల సంక్షేమం ఆధారంగా మాత్రమే ఉంటాయని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు.

### ప్రైవేట్ కళాశాల యాజమాన్యాలతో భట్టి, మంత్రి కోమటిరెడ్డి

# చర్చలు విజయవంతం

(మొదటి పేజీ తరువాయి)

ఒక కమిటీని ఏర్పాటు చేసింది, ఫీజు బకాయిలు, కళాశాలల సమస్యలకు సంబంధించి ఎలాంటి సంస్కరణలు అవసరమో అధ్యయనం చేసి త్వరితగతిన నివేదిక ఇవ్వాలని కమిటీని విజ్ఞప్తి చేస్తామని డిప్యూటీ సీఎం తెలిపారు.

ఎనిమిదో తారీకు టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ తో హైదరాబాదులో సమావేశం అనుకున్నాం ప్రభుత్వంతో చర్చించిన తదుపరి శనివారం లెక్చరర్ల ప్రదర్శనను రద్దు చేసుకుంటున్నామని పాతి సెక్రెటరీ జనరల్ రవికుమార్ తెలిపారు. మాలో పొరపాటు మూలంగా కోర్టుకు వెళ్లడం జరిగింది ఎన్నికల కోడ్ నేపథ్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టవద్దని కోర్టు తెలిపిందని రవికుమార్ వివరించారు. విద్యార్థులను రోడ్డుపైకి తేవద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు, ఇకపై విద్యార్థులను బయటకు తీసుకురామని రవికుమార్ తెలిపారు. పాతి సమస్యలకు సంబంధించి ప్రభుత్వంతో కూర్చొని మాట్లాడుకుంటామని రవికుమార్ వివరించారు.

ఈనెల మూడవ తేదీ నుంచి సమ్మెకు వెళ్లడం మూలంగా కొన్ని పరీక్షలను నిర్వహించలేకపోయాం, తరగతులు నిర్వహించలేకపోయినందుకు చింతిస్తున్నామని పాతి సంఘం అధ్యక్షుడు నిమ్మటూరి రమేష్ బాబు తెలిపారు. నిలిచిపోయిన పరీక్షలకు సంబంధించి యూనివర్సిటీలతో మాట్లాడి త్వరలోనే తిరిగి నిర్వహిస్తామని రమేష్ బాబు తెలిపారు. సమ్మెకు సంబంధించిన మీడియా సమావేశంలో సమయంలో మేము ఒక విధంగా మాట్లాడితే కొన్ని మీడియా సంస్థలు మా ప్రకటనలను వక్రీకరించాయని రమేష్ బాబు అన్నారు.

మేము విద్యాశాఖ కార్యదర్శి దేవసేనను గాని ఇతర ఏ ఐఏఎస్ అధికారిని గాని ఒక్క మాట అనలేదని తెలిపారు. ముఖ్యమంత్రి కార్యాలయం, ఉప ముఖ్యమంత్రి కార్యాలయం పైన ఒక్క ప్రకటన చేయలేదని తాము ఎవరి మనసు గాయపరిచే పని చేయలేదని రమేష్ బాబు తెలిపారు. దేవసేన గారి పై మా సంఘం చేసిన ప్రకటనకు స్పందిస్తూ ఐఏఎస్ అధికారుల సంఘం ఒక ప్రకటన విడుదల చేసిందని తెలిపారు. ఆ ప్రకటనకు సమానంగా ప్రైవేటు కళాశాలల యాజమాన్యాల తరపున ఐఏఎస్ అధికారుల సంఘానికి ఒక ఖండన ప్రకటనను ఇప్పటికే పంపించామని తెలిపారు. మా ప్రకటనలను వక్రీకరించి కొన్ని పత్రికలు ప్రచురించడం పట్ల చింతిస్తున్నామని రవికుమార్ తెలిపారు.

### ప్రైవేట్ విద్యాసంస్థల

# తాట తీస్తా..

(మొదటి పేజీ తరువాయి)

ప్రైవేటు విద్యాసంస్థలు బ్లాక్‌మెయిల్ చేస్తున్నాయని ధ్వజమెత్తారు. కాలేజీలను బంద్ చేయించిన వారితో చర్చలు ఎలా ఉంటాయని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఫీజురీయంబర్స్‌మెంట్‌పై ప్రైవేటు విద్యాసంస్థలు ఇటీవల బంద్‌కు పిలుపునిచ్చాయి. ప్రభుత్వం వెంటనే ఫీజురీయంబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశాయి. లేకపోతే నిరవధిక ఆందోళన చేపడతామని హెచ్చరించాయి. తెలంగాణ ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడంతో విద్యాసంస్థలను కొనసాగించడం చాలా కష్టంతో కూడుకున్నదని ప్రైవేటు విద్యాసంస్థలు వెల్లడించాయి. ఈ నేపథ్యంలోనే ప్రైవేటు విద్యాసంస్థలపై సీఎం రేవంత్‌రెడ్డి సీరియస్ అయినట్లు తెలుస్తోంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని కోరుతూ తెలంగాణలో ఉన్నత విద్యాసంస్థలు చేపట్టిన బంద్‌పై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారు. విడతల వారీగా బకాయిలు చెల్లిస్తామన్నారు. మా హయాంలోని బకాయిలు ముందు చెల్లిస్తాం గతంలో ఉన్న బకాయిలపై చర్చిస్తామని అన్నారు. అయితే బందులతో విద్యార్థుల జీవితాలతో ఆటలు ఆడొద్దన్నారు. ఇలా చేయడం విద్యార్థులపై ప్రభావం చూపదా అని అన్నారు. బకాయిలు ఇవాళ కాకపోతే రేపు వసూలవుతాయి. కాలేజీలు బంద్ పెడితే విద్యార్థులు కోల్పోయిన సమయం తిరిగి వస్తుందా అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం వద్ద నిధులకు ఇబ్బంది లేదు. అన్ని వర్గాలను సమన్వయం చేసుకుంటూ వెళ్లాలి. రాష్ట్రానికి నెలకు రూ.18వేల కోట్ల ఆదాయం వస్తోంది. జీతాలు, వడ్డీలు, ఇతర ఖర్చులు పోనూ మిగిలేది రూ.5వేల కోట్లే. ఈ ఆదాయంతో రాష్ట్రాన్ని ఎలా నడపాలో చెప్పండి. ప్రభుత్వాన్ని బ్లాక్ మెయిల్ చేస్తున్నారా? కాలేజీలను బంద్ చేయించినవారితో చర్చించేదేముంది? ఏ కాలేజీ ఎంత డొనేషన్ వసూలు చేస్తుందో నాకు తెలుసు. కాలేజీలో నిబంధనలు పాటించకపోతే ఎలా? ఇష్టానుసారం ఫీజులు పెంచుకుంటూ పోతే ఎలా? విద్య వ్యాపారం కాదు.. విద్యను సేవగా భావించాలి. రాజకీయ నేతలు అండగా ఉన్నారని విద్యార్థులతో ఆడుకోవద్దు. అడ్డగోలుగా ఫీజులు పెంచుకుని వచ్చి రీయింబర్స్‌మెంట్ అడుగుతున్నారు. కాలేజీలకు అనుమతుల విషయంలో ఎన్నో అక్రమాలు ఉన్నాయి. కాలేజీల యజమానులు ప్రభుత్వాన్నే బ్లాక్ మెయిల్ చేస్తారా? బీసీ నేత ఆర్.కృష్ణయ్య కూడా అమాయకంగా వాళ్ల ఉచ్చులో పడ్డారు. ఆర్.కృష్ణయ్య, మందకృష్ణ ముందుకొస్తే వాళ్ల చేతికే చిట్టా ఇస్తా. నాలుగు నెలలు ప్రభుత్వాన్ని మీరే నడపండని సీఎం అన్నారు.

# హైదరాబాద్ అభివృద్ధిని అడ్డుకుంటున్న 'బ్యాడ్ బ్రదర్స్'!

(మొదటి పేజీ తరువాయి)

విస్తరణకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. తెలంగాణ ప్రజలకు ఉపయోగంలేని ప్రగతి భవన్, కాళేశ్వరం, కమాండ్ కంట్రోల్, సచివాలయం చూపించి ఇంకా ఎన్నాళ్ళు కాలం గడుపుతారు. కాంట్రాక్టర్ల దగ్గర కమిషన్లు దండుకుని దోచుకున్నారు తప్ప ప్రజలకు ఉపయోగపడే పని చేశారా?

ఉద్యోగాల భర్తీ చేశాం. కేటీఆర్ తీసుకొచ్చింది కేవలం గంజాయి, డ్రగ్స్ మాత్రమే. మీ బావమరిది డ్రగ్స్ తీసుకుని దొరికింది నిజం కాదా? నిరుద్యోగులకు ఉపాధి కల్పించిన మీరు చేసిన ఏ ఒక్క ప్రాజెక్టునైనా చూపించండి. నగర అభివృద్ధిపై బ్యాడ్ బ్రదర్స్ ఇద్దరూ ఎక్కడ చర్చకు వచ్చినా మేం సిద్ధంగా ఉన్నాం. నగరాన్ని అభివృద్ధి చేయాలంటే ప్రజా ప్రతినిధుల సహకారం ఉండాలి. అందుకే జూబ్లీహిల్స్ గెలవాల్సిన అవసరం ఉంది. బీజేపీ, బీఆర్ఎస్ సహకరించి ఉంటే నగరాన్ని మరింత అభివృద్ధి చేసుకునే వాళ్లం. మెట్రో విస్తరణ చేసుకుందాం, గోదావరి జలాలు తెచ్చుకుందాం, మూసీ ప్రక్షాళన చేసుకుందాం. ఎందుకు మూసీ ప్రక్షాళన అడ్డుకుంటున్నావ్ కిషన్ రెడ్డి? ఎందుకు కేటీఆర్ కు లొంగిపోయావ్? నగరంలోని 695 చెరువులలో 44 చెరువులను బీఆర్ఎస్ కబ్జా చేసింది. మీరు ఆక్రమించుకున్న చెరువులను విధించినందున హైడ్రాపై విషం చిమ్ముతున్నారు.

బతుకమ్మ కుంటను ఆక్రమించుకున్న ఎడ్ల సుధాకర్ రెడ్డి ఎవరు? బీఆర్ఎస్ కాదా? సున్నం చెరువు, నల్ల చెరువును ఆక్రమించుకుంది నిజం కాదా..? వాటర్ హార్వెస్టింగ్ వెల్స్ నిర్మించి నగరంలో రోడ్లపై నీళ్లు నిలవకుండా చేసింది హైడ్రా కాదా? ఈగల్ ఫోర్స్, హైడ్రా పై కేటీఆర్ కక్ష పెట్టుకున్నాడు. హైడ్రా ఎక్కడ తప్పు చేసిందో చెప్పు నిజ నిర్ధారణ కమిటీ వేద్దాం. కేసీఆర్ కుటుంబంతో ఉండే వాళ్ళందరినీ హరీష్ బీఆర్ఎస్ నుంచి బయటకు పంపేశారు. బయట వాళ్ళందరికీ విజయవంతంగా బయటకు పంపాడు. ఇప్పుడు ఇంట్లో కవితను కూడా బయటికి పంపేలా చేశారు. వీళ్లా తెలంగాణ రాష్ట్రాన్ని కాపాడేది? కేటీఆర్, కిషన్ రెడ్డి మేమేమైనా మీ ఆస్తులు అడుగు తున్నామా? అభివృద్ధికి సహకరించాలని అడుగుతున్నాం. విజ్ఞత కలిగిన జూబ్లీహిల్స్ ప్రజలు ఆలోచనతో ఓటు వేయండి.. కాంగ్రెస్‌ను గెలిపించండి. హైదరాబాద్ నగరాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి చూపిస్తాం. గంజాయి, డ్రగ్స్ కనిపిస్తే తొక్కి నార తీస్తాం..

**అంతర్జాతీయ స్థాయిలో హైదరాబాద్‌ను అభివృద్ధి చేస్తాం.**

జూబ్లీహిల్స్‌లో ఒక్కసారి కాంగ్రెస్‌కు అవకాశం ఇవ్వండి. నవీన్ యాదవ్‌ను రౌడీ అని మాట్లాడుతున్నారు.. ఎవరు రౌడీ? దీపావళి పండుగ రోజున గంజాయి కొట్టే వాడు రౌడీ అవుతాడా.. పేదోళ్లకు అండగా నిలబడేవాడు రౌడీ అవుతాడా? అజారుద్దీన్ కు మంత్రి పదవి ఇస్తే మీ ఏడుపుఎందుకు? హరీష్ రావు నేను సచివాలయం రావట్లేదని మాట్లాడుతున్నాడు. సచివాలయంలో చేయాల్సిన పని సచివాలయంలో చేస్తున్నాం. కమాండ్ కంట్రోల్ మా తాతదా? క్యాంపు ఆఫీస్‌లా ఉపయోగిస్తున్నా.. రోజుకు 18 గంటలు పనిచేస్తున్నా... సర్వేలపై చర్చ అనవసరం కొన్ని పొలిటికల్ పార్టీలు వారికి అనుకూలంగా సర్వే ఫలితాలు ప్రకటించుకున్నాయి. నిజం నవంబర్ 14న అందరికీ తెలుస్తుంది. బీఆర్ఎస్‌ను ఓడించండి.. బీజేపీ డిపాజిట్ గల్లంతు చేయండి..

ఏ ఎన్నికలైనా నా ఎన్నిక అనుకునే పనిచేస్తా... ఈ ఎన్నికలో బీఆర్ఎస్ ఓటమి ఖాయం, బీజేపీ డిపాజిట్ పోవడం ఖాయం. మరి బండి సంజయ్ హిందువులు బీజేపీ తో లేరని దీన్ని రిఫరెండంగా భావిస్తారా? ఇందుకు బండి సంజయ్ ఒప్పుకుంటారా? కిషన్ రెడ్డికి లేని బాధ.. బండి సంజయ్ కు ఎందుకు?

# శబరిమలకు ప్రత్యేక రైళ్లు..

(మొదటి పేజీ తరువాయి)

1, 8, 15, 22, 29 తేదీల్లో, జనవరి 5, 12, 19 తేదీల్లో చర్లపల్లి నుంచి బయల్దేరుతాయి. ఇవి మరుసటి రోజు కొల్లాం చేరుకుంటాయి. మొత్తం 10 రైళ్లను అందుబాటులో ఉంచారు. ఇవి పగిడిపల్లి, గుంటూరు, గూడూరు, రేణిగుంటలో ఆగుతాయి. కొల్లాం నుంచి చర్లపల్లి (రైలు నంబర్ 07108)– నవంబర్ 19, 26 తేదీల్లో, డిసెంబర్ 3, 10, 17, 24, 31 తేదీల్లో, జనవరి 7, 14, 21 తేదీల్లో కొల్లా నుంచి బయల్దేరుతాయి. మరుసటి రోజు చర్లపల్లి చేరుకుంటాయి. ఈ రైళ్లు రేణిగుంట, గూడూరు, గుంటూరు, పగిడిపల్లి మీదుగా వస్తాయి.

# రేవంత్‌కి దమ్ముంటే 24 నెలల తన పాలన చూపించి ఓట్లు అడగాలి

(మొదటి పేజీ తరువాయి)

భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. తాను చేసింది ఏమీ లేకపోవడంతోనే రేవంత్ రెడ్డి అటెన్షన్ డైవర్షన్ ప్రయత్నాలకు పాల్పడుతున్నారని విమర్శించారు.

పోలింగ్ కంటే ముందే రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఓటమిని అంగీకరించారని అందుకే జూబ్లీహిల్స్ అనేక తన ప్రభుత్వానికి పరిపాలనకు తనకు రెఫరెండం కాదు అని చెప్పారని కేటీఆర్ అన్నారు. రేవంత్ రెడ్డి తన పరిపాలన పైన నమ్మకం లేకనే ప్రజల్లో నెలకొన్న తీవ్రమైన వ్యతిరేకతను దృష్టిలో ఉంచుకొని జూబ్లీహిల్స్ ఎన్నిక రెఫరెండం కాదు అని చెప్పారని కేటీఆర్ అన్నారు.

రేవంత్ రెడ్డి ఈరోజు చేసిన వ్యాఖ్యలతో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమి ఖాయం అన్నమాట స్పష్టమైనది అన్నారు. ఈరోజు జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా వెంగళరావు నగర్ లో రోడ్డు షో నిర్వహించిన కేటీఆర్ రేవంత్ రెడ్డి ఈరోజు మీడియా సమావేశంలో చేసిన అనేక వ్యాఖ్యల పైన గట్టిగా కౌంటర్ ఇచ్చారు.

రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత 24 నెలల కాలంలో చేసింది ఏమీ చెప్పుకోవడానికి లేకపోవడంతోనే పాత కాలం కథలు చెబుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. రేవంత్ రెడ్డికి దమ్ముంటే తన 24 నెలల పాలన కాలంలో చేసిన అభివృద్ధిని చూపించి సంక్షేమ పథకాల అమలు చూపించి ఓట్లు అడగాలని కేటీఆర్ సవాల్ విసిరారు. రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు సంవత్సరాల కాలంలో అన్ని రంగాల్లో ప్రజలకు కష్టాలు తప్పడం లేదు అని సబ్బండ వర్గాలను ఆరు గ్యారెంటీల పేరుతో మోసం చేశారన్నారు. రెండు సంవత్సరాల పరిపాలనలో మోసం చేసిన విద్యార్థులు యువకులు రైతన్నలు పారిశ్రామికవేత్తలకు చేసిన మోసాన్ని చూసినందుకు రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ కు ఓటు వేయాలా అని కేటీఆర్ ప్రశ్నించారు. రెండు సంవత్సరాల కాలంలో హైదరాబాదు నగరాన్ని అధఃపాతాళానికి తీసుకువెళ్లినందుకు నగర ప్రజలు కాంగ్రెస్‌కు ఓటు వేయాలా అని కేటీఆర్ ప్రశ్నించారు. జూబ్లీహిల్స్ లో గెలిస్తే అభివృద్ధి చేస్తామంటూ కాంగ్రెస్ చెబుతున్న అబద్ధాల పైన కేటీఆర్ మండి పడ్డారు గతంలో ఇవే మాటలు చెప్పి కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో గెలిచిన తర్వాత ఒక్క రూపాయి అభివృద్ధి పని కూడా చేయలేదని కేటీఆర్ గుర్తు చేశారు.

10 సంవత్సరాల కాలంలో జరిగిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలని మేము అడిగితే రేవంత్ రెడ్డి తనకు సంబంధంలేని గత ప్రభుత్వపు కాంగ్రెస్ పరిపాలన చూసి ఓటు వేయాలని అడగడం పైన కేటీఆర్ ఎద్దేవా చేశారు. గత పది సంవత్సరాల కాలంలో ఐటీ పరిశ్రమ నుంచి మొదలుకొని టిమ్స్ ప్రభుత్వ ఆసుపత్రుల నిర్మాణము ప్రజారోగ్యం, రోడ్లు, ఫ్లై ఓవర్లు, లక్ష డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం, 47 ఫ్లై ఓవర్లు రోడ్ల నిర్మాణం, రాష్ట్రాన్ని ముఖ్యంగా హైదరాబాద్ నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని,



రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను దేశంలోనే అగ్రస్థానంలో నిలపడం వంటి అన్ని రంగాల్లోనూ గత ప్రభుత్వం భారత రాష్ట్ర సమితి ప్రభుత్వ సర్కారు హైదరాబాద్ నగరాన్ని అగ్రస్థానంలో నిలిపింది అన్నారు.

కానీ రేవంత్ రెడ్డి గత రెండు సంవత్సరాలలో హైదరాబాద్ నగరాన్ని పూర్తిగా పతనావస్థకు చేర్చి రియల్ ఎస్టేట్ నుంచి మొదలుకొని ఆటో డ్రైవర్ల వరకు అందరి ఉపాధి అవకాశాల పైన దెబ్బకొట్టి అనేక వర్గాలు ఆత్మహత్యలకు పాల్పడేలా రేవంత్ రెడ్డి రెండు సంవత్సరాల పరిపాలన సాగిందన్నారు. హైడ్రా పేరుతో రేవంత్ రెడ్డి అరాచకం చేశారని వేలాదిమంది పేదల ఇళ్లు కూలగొట్టిన రేవంత్ రెడ్డి పెద్దవాళ్ళ అక్రమాల జోలికి వెళ్లలేదని కేటీఆర్ విమర్శించారు. కేవలం పేదలను లక్ష్యంగా చేసుకుంటూ వారి ఇళ్లను కూలగొడుతున్న హైడ్రా బుల్డోజర్ పేద వాళ్ళ ఇంటికి బస్తీల జోలికి రావద్దు అంటే 11వ తేదీన జరిగే ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ కు గట్టిగా బుద్ధి చెప్పాలన్నారు. ఈ సందర్భంగా మంత్రులు అక్రమంగా నిర్మాణం చేసుకున్న ఫామ్ హౌస్లను ఇళ్లను కేటీఆర్ తన రోడ్డు షోలో అందరికీ అర్థం అయ్యేలా ఎల్ఈడి స్క్రీన్ లపై చూపించారు.

హైడ్రా గురించి గొప్పగా చెప్పుకున్న రేవంత్ రెడ్డికి దమ్ముంటే సిగ్గు ఉంటే తన మంత్రుల అడ్డగోలుగా అక్రమంగా కట్టుకున్న ఈ నిర్మాణాలను తొలగించాలని కేటీఆర్ సవాలు చేశారు. హైడ్రా వలన ఒక్కరికి కూడా లాభం జరగలేదని కేటీఆర్ అన్నారు. రేవంత్ రెడ్డి నిజాయితీ లేని మాటలు మాట్లాడుతున్నారని.. నేతి బీరకాయలో నెయ్యి అంతా నిజాయితీ రేవంత్ రెడ్డి మాటల్లో ఉంటాయని ఎద్దేవా చేశారు.

ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే.. గ్యారంటీలు అమలు చేయకుండా తమకే ఓటు వేశారని కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి భావించి హామీలను అమలు చేయడాన్ని ప్రారంభించాలని కేటీఆర్ హెచ్చరించారు. జూబ్లీహిల్స్ ప్రజలు ఇచ్చే తీర్పుతో తెలంగాణ ప్రజలందరికీ హామీలు అమలు కావాలని ఆ దిశగా కాంగ్రెస్ ను ఓడించి ప్రభుత్వం పైన ఒత్తిడి తేవాలని ఓటర్లకు పిలుపునిచ్చారు. రెండేళ్లపాటు రాష్ట్రాన్ని రాష్ట్ర ప్రజలను పీల్చుకుతింటున్న అరాచకానికి అక్రమాలకు కేరాఫ్ అడ్రస్ కనిపించిన కాంగ్రెస్ ను తరమవలసిన అవసరం ఉందన్నారు.

కాంగ్రెస్ పార్టీకి స్వర్గీయ ఎన్టీ రామారావు పేరును ఎత్తే నైతిక అర్హత లేదని కేటీఆర్ అన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా భారీ మెజారిటీతో గెలిచిన ఎన్టీ రామారావుని పదవి నుంచి తొలగించిన దుర్మార్గపు చరిత్ర కాంగ్రెస్ పార్టీది అని కేటీఆర్ అన్నారు. శంషాబాద్ విమానాశ్రయానికి పెట్టిన ఎన్టీఆర్ పేరును తొలగించి కాంగ్రెస్ పార్టీ రాజీవ్ గాంధీ పేరు పెట్టిందన్నారు.

ఈ సందర్భంగా స్వర్గీయ ఎన్టీ రామారావుకు అహంకారం అంటూ ఎన్టీఆర్ ను తూలనాడుతూ రేవంత్ రెడ్డి గతంలో చేసిన వ్యాఖ్యలను కేటీఆర్ గుర్తు చేశారు. తన జీవితమంతా వ్యతిరేకంగా పోరాడిన కాంగ్రెస్ పార్టీ గనుక ఎన్టీ రామారావు విగ్రహాలు పెడితే ఆయన ఆత్మ చూపిస్తుందని కేటీఆర్ అన్నారు.

### డయబిటిస్, ఒబెసిటీ ఉన్నా

# వీసా తిరస్కరణ

(మొదటి పేజీ తరువాయి)

స్ర్కీనింగ్ చేస్తారు. ఈ నిబంధనలను తాజాగా సవరించారు. మరిన్ని వ్యాధులను ఈ జాబితాలో చేరుస్తూ మార్గదర్శకాలు రూపొందించారు. అంటే.. ఇకపై వీసా కోసం దరఖాస్తు చేసుకున్న వలసదారుల మెడికల్ హిస్టరీపై అధికారులు మరింత దృష్టి సారించనున్నారు. వారు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతుంటే తిరస్కరించాలన ఇనిర్ణయించారు. హృద్రోగ సమస్యలు, శ్వాస సంబంధిత వ్యాధులు, క్యాన్సర్, డయాబెటిస్, జీవక్రియ, నాడీ సంబంధిత వ్యాధులు, మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడేవారిని సంరక్షించాలంటే లక్షల డాలర్లు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఇక, ఒబెసిటీ కారణంగా ఆస్తమా, స్లీప్ అప్నియా, హై బీపీ వంటి సమస్యలు ఎదురవుతాయి. ఇలాంటి వ్యాధిగ్రస్తులకు సుదీర్ఘ వైద్య సంరక్షణ అవసరం. ఆర్థిక భారం కూడా ఎక్కువే. అందుకే వలసదారుల ఆరోగ్య పరిస్థితిని అంచనా వేసి వారు ప్రభుత్వ వనరులపై ఆధారపడుతారో లేదో గుర్తించాలి. ఒకవేళ అలాంటి వారైతే అమెరికాలోకి ప్రవేశాన్ని తిరస్కరించాలని ఆ మార్గదర్శకాల్లో వెల్లడించారు. అయితే, ఈ వార్తలపై అమెరికా విదేశాంగ శాఖ స్పందించలేదు. దీంతో ఈ రూల్స్ అమల్లోకి వచ్చాయా లేదా అన్న దానిపై స్పష్టత లేదు.

# వందేమాతరంతో ఆత్మవిశ్వాసం

(మొదటి పేజీ తరువాయి)

నవంబరు 7, 1875న బంకించంద్ర ఛటర్జీ రచించారు. ఈ గేయం.. తొలిసారి ఛటర్జీ రాసిన 'ఆనంద్ మఠ్' నవలలో ప్రచురితమైంది. వందేమాతరం గేయం ఒక స్వప్నం, ఒక సంకల్పం, ఒక మంత్రం అని ఈ సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. అది దేశమాత ఆరాధన, సాధన అని పేర్కొన్నారు. ఈ గేయం మనందరినీ పురాణ ఇతిహాసాల్లోకి తీసుకెళ్తుందని చెప్పారు. ఈ సామూహిక గేయాలాపన అద్భుత అనుభవం. ఒకే లయ, స్వరం, భావంతో గేయాలాపన హృదయాన్ని స్పందింపజేస్తుందని ప్రధాని అన్నారు. వందేమాతరం 150 ఏళ్ల స్మారకోత్సవాలు నిర్వహించుకుంటున్నామని, ఇవి దేశ ప్రజలకు ప్రేరణనిస్తాయని మోదీ అన్నారు. వందేమాతరం స్మారక స్టాంపు, నాణెం విడుదల చేశాం. ప్రతి గీతానికి ఒక మూలభావం, సందేశం ఉంటుంది. మన వందేమాతరం మూలభావం భారత్, మా భారతి అని పేర్కొన్నారు. ఇది దేశానికి ఒక ప్రార్థన లాంటిదన్నారు.. ఇది మనల్ని చరిత్రలోకి తీసుకెళుతుంది. ఇది మన భవిష్యత్తుకు ధైర్యాన్ని ఇస్తుంది. భారతీయులు సాధించలేని సంకల్పం లేదు. సాధించలేని లక్ష్యం లేదని మోడీ పేర్కొన్నారు. నవంబర్ 7 అనేది ఒక చారిత్రాత్మక రోజు అని.. వందేమాతరం ఆవిర్భవించి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఘనంగా వేడుకలు జరుపుకుంటున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమం కోట్లాది మంది భారతీయుల్లో కొత్త శక్తిని ఉత్పత్తి చేస్తుందని చెప్పారు. వందేమాతరం 150వ వార్షికోత్సవం సందర్భంగా ప్రతి పౌరుడికి శుభాకాంక్షలు తెలిపారు. ఇక 1950లో భారతదేశం గణతంత్ర దేశంగా ఆవిర్భవించిన సందర్భంగా ఈ వందేమాతరం గేయాన్ని జాతీయ గేయంగా గుర్తించారు. ఇదిలా ఉంటే కేంద్ర ప్రభుత్వం ఈ 2025 సంవత్సరాన్ని 150 ఏళ్ల 'వందే మాతరం'గా పరిగణించింది. ఈ రోజు నుంచి వచ్చే ఏడాది 2026, నవంబర్ 7 వరకు దేశవ్యాప్తంగా వందేమాతరం జాతీయ గేయం సంస్మరణోత్సవాలను జరపాలని నిర్ణయించింది.

తెలుగు దినపత్రిక https://aksharagalam.com

# అక్షరగళం

ప్రతి అక్షరం ప్రజల కోసం



## తెలంగాణ రౌండప్

## పోచారంలో పార్కు స్థలాన్ని కాపాడిన హైడ్రా

**మేడ్చెల్,నవంబర్7(అక్షర గళం):** కబ్జారాయుళ్ల నుంచి పార్క్ స్థలాన్ని హైడ్రా స్వాధీనం చేసుకుంది. మేడ్చల్ జిల్లా పోచారం మున్సిపాలిటీ పరిధి చౌదరిగూడలో ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానిక శ్రీనివాస కాలనీలో 400 గజాల పార్కు స్థలాన్ని కబ్జాదారుల నుంచి హైడ్రా అధికారులు రక్షించారు. లే అవుట్ చేసిన సమయంలో ఈ స్థలాన్ని పార్కు కోసం కేటాయించారు. దాన్ని అభివృద్ధి చేయకపోవడంతో కొందరు తప్పుడు పత్రాలతో కబ్జా చేశారు. కాలనీవాసులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా వారి నుంచి స్పందన రాలేదు. దీంతో హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో కమిషనర్ రంగనాథ్ ఆదేశాల మేరకు అధికారులు విచారణ చేపట్టారు. కబ్జాకు గురయినట్లు తేలడంతో శుక్రవారం అధికారులు పార్కులో ఉన్న పిచ్చి మొక్కలు తొలగించి, చుట్టూ ఇనుప కంచె ఏర్పాటు చేశారు. హైడ్రా చర్యల పట్ల కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.






## కలెక్టరేట్‌లో ఘనంగా సామూహికంగా వందేమాతరం గీతం ఆలాపన

**మేడ్చల్ ప్రతినిధి, నవంబర్ 07, (అక్షర గళం):**
వందే మాతరం" జాతీయ గీతాన్ని బంకిమ్ చంద్ర ఛటర్జీ రచించి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఘనంగా సామూహిక గానం చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియతో కలసి వందే మాతరం" గేయాన్ని సామూహికంగా ఆలపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, టిఎస్ఎస్ కళాకారులు, తదితరులు పాల్గొన్నారు.


## వందేమాతరం గేయం దేశభక్తికి శాశ్వత చిహ్నంగా నిలిచింది

**బాలానగర్ సీఐ నర్సింహా రాజు**

**కూకట్ పల్లి, నవంబర్ 07, (అక్షర గళం):** దేశ ఐక్యత, ఆత్మగౌరవ స్ఫూర్తికి కవితాత్మక వ్యక్తీకరణ అనతికాలంలోనే వందేమాతరం గేయం దేశభక్తికి శాశ్వత చిహ్నంగా





నిలిచిందని బాలానగర్ సీఐ నర్సింహా రాజు అన్నారు. జాతీయ గేయం 'వందేమాతరం' 150వ సంస్మరణ కార్యక్రమాన్ని బాలానగర్ పోలీస్ స్టేషన్ లో సీఐ నర్సింహా రాజు నేతృత్వంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ఆవరణలో సిబ్బందితో కలిసి సీఐ 'వందే మాతరం' పూర్తి గేయాన్ని సామూహికంగా ఆలపించారు. అనంతరం బంకించంద్ర ఛటర్జీ చిత్రపటానికి నివాళులు అర్పించారు. బాలానగర్ సీఐ నర్సింహా రాజు మాట్లాడుతూ 2025తో వందేమాతరం గేయానికి 150 ఏళ్లు పూర్తయ్యాయని, స్వాతంత్ర్యోద్యమానికి స్ఫూర్తినిచ్చి.. నేటికీ దేశ కీర్తిని, ఐక్యతను పెంపొందిస్తున్న చిరతరమైన ఈ గేయానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంస్మరణ కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మన జాతీయ గేయం 'వందే మాతరా'న్ని 1875 నవంబరు 7న అక్షయ నవమి శుభ వేళ బంకించంద్ర ఛటర్జీ రచించారని, బలానికి, శ్రేయస్సుకు, దైవత్వానికి స్వరూపంగా మాతృభూమిని కీర్తించే ఈ గేయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు సరితా రెడ్డి, హాజీ మియా, వినోద్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

## బస్సు ప్రమాద బాధితులకు కోటి పరిహారం!

**ప్రమాద బాధితులకు కవిత పరామర్శ**

**రంగారెడ్డి,నవంబర్7(అక్షర గళం):** చేవెళ్ల బస్సు ప్రమాద సంఘటనలో మరణించిన 19 మందికి ఒక్కో కుటుంబానికి కోటి రూపాయల పరిహారం ఇవ్వాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నవంబర్ 7న



వికారాబాద్ జిల్లా యాలాల మండలము ప్యార్కంపల్లి గ్రామంలో ఇటీవల మరణించిన ముగ్గురు అక్కచెల్లెళ్ల కుటుంబాన్ని ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ చేవెళ్ల బస్సు ప్రమాదం జరగడానికి ప్రధాన కారణం రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని విమర్శించారు. ప్రమాదం జరిగిన తర్వాత రోడ్డు మరమ్మత్తులు చేయడమేంటని ప్రశ్నించారు. ముందే ఈ రోడ్డు మరమ్మత్తు చేపట్టితే ఈ ప్రమాదం జరిగి ఉండేది కాదని, 19 మంది కుటుంబాలు రోడ్డున పడేవి కావన్నారు బాధితులను పట్టించుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తాను వారికి అండగా నిలుస్తానని చెప్పారు. నవంబర్ 3న చేవేళ్ల సమీపంలోని మీర్జాగూడ దగ్గర టిప్పర్ లారీ బస్సును ఢీ కొట్టడంతో 19 మంది చనిపోయిన సంగతి తెలిసిందే. మృతుల కుటుంబాలకు తెలంగాణ ప్రభుత్వం రూ. 5లక్షలు,ఆర్టీసీ నుంచి రూ.2లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం కూడా పీఎంఎన్ఆర్ నుంచి 2 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటించిన సంగతి తెలిసిందే.





## ప్రజాసేవకే అంకితమైన నవీన్ యాదవ్

**- టీపీసీసీ సభ్యులు అయిల్ల శ్రీనివాస్ గౌడ్**

**ఆమనగల్లు, నవంబర్ 07 (అక్షర గళం):**
ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజాసేవకే అంకితమైన కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలిపించాలని టీపీసీసీ సభ్యులు అయిల్ల శ్రీనివాస్ గౌడ్ కోరారు. శుక్రవారం యూసుఫ్ గూడా డివిజన్ లోని వెంకటగిరిలో ఆమనగల్లు, కడ్తాల్ మండలాల కాంగ్రెస్ నాయకులతో కలిసి కాంగ్రెస్ అభివృద్ధిని వివరిస్తూ కరపత్రాలను పంచుతూ ప్రచారం నిర్వహించారు. అనంతరం శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ అన్ని వర్గాల ప్రజల కోసం పని చేసిందని గుర్తు చేశారు. బీఆర్ఎస్ పార్టీ పదేళ్లు రాష్ట్రాన్ని పాలించి నాటి సీఎం కేసీఆర్ కుటుంబం, ఆయన మంత్రులు రాష్ట్రాన్ని యథేచ్ఛగా దోచుకున్నారన్నారు. మరోవైపు బీజేపీ కుల ప్రాతిపదికపైన పరిపాలించే పార్టీ అని ఆయన అన్నారు.

తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి రెండేళ్ల పాలనలో రాష్ట్రం ఎంతగానో అభివృద్ధి చెందిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రయత్నాల కారణంగా హైదరాబాద్ తో పాటు తెలంగాణ రాష్ట్రంలో విదేశీ పెట్టుబడులు వచ్చాయన్నారు. కాంగ్రెస్ తోనే అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరుగుతుం దన్నారు. కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీదే అంతిమ విజయమని, విపక్షాలను ప్రజలు విశ్వసించడం లేదన్నారు.

కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, మండల అధ్యక్షుడు తెల్గమల్ల జగన్, పట్టణ అధ్యక్షుడు వస్పుల మానయ్య, మాజీ మండల అధ్యక్షుడు మండ్లి రాములు, మాజీ వైస్ ఛైర్మన్ గుర్రం కేశవులు, జిల్లా నాయకులు కృష్ణ నాయక్, రవికాంత్ గౌడ్ ఐఎన్టియుసి జిల్లా అధ్యక్షుడు ఎంగలి ప్రసాద్, మాజీ సర్పంచ్లు ఎగిరిశెట్టి గోదాదేవి సత్యం, కడమోని శ్రీశైలం, డైరెక్టర్ చేగురి వెంకటేష్, వెంకట్ రెడ్డి, అంజన్ రెడ్డి, మహేందర్ గౌడ్, పర్వతాలు, శ్రీను నాయక్, గాజుల రమేష్, కాలే మల్లయ్య, విజయ్ నాయక్, హరిలాల్, పులి కంటి మైసయ్య, శేఖర్ గౌడ్, రామక్రిష్ణ, పత్య నాయక్, జైపాల్, బద్ది వెంకటేష్, రాజ్య నాయక్, పత్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ వందేమాతరం గీతాన్ని స్మరించుకోవాలి

**- గోరటి నర్సింహా**

**ఆమనగల్లు, నవంబర్ 07 (అక్షర గళం):**
వందేమాతరం కేవలం గీతం కాదని, భారతీయుల అస్మిత, గౌరవం, అభిమానం, ఏకత్వానికి ప్రతీక అని బీజేపీ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోరటి నర్సింహా అన్నారు. కేంద్ర ప్రభుత్వం పిలుపు మేరకు శుక్రవారం పట్టణ కేంద్రంలోని జాతీయ రహదారిపై వందేమాతరం 150 ఏళ్ల సంస్మరణోత్సవ సందర్భాన్ని పురస్కరించుకుని బిజెపి పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి వందేమాతరం గీతాలాపన నిర్వహించారు. ప్రతి ఒక్కరూ వందేమాతరం గీతాన్ని స్మరించుకోవాలని పిలుపు ఇచ్చారు. అనంతరం భారత మాత చిత్రపటానికి పూలమాల గురించి నివాళు



లర్పించి గోరటి నర్సింహా మాట్లాడుతూ.. వందేమాతరం' కేవలం ఒక పాట మాత్రమే కాదని, అది దేశమాత పట్ల భక్తికి, ఆరాధనకు ప్రతీక అని ప్రధాని ఉద్ఘాటించారు.

స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో కోట్లాది మంది భారతీ యులలో ఐకమత్యాన్ని, స్ఫూర్తిని నింపిన ఈ గీతం శక్తిని ఆయన కొనియాడారు. ఈ గీతం లోని ప్రతి శబ్దం ప్రజల్లో అపారమైన ఆత్మ విశ్వాసాన్ని, ప్రేరణను నింపుతుందని గోరటి నర్సింహా పేర్కొన్నారు. 'వందేమాతరం' అనేది ఒక పదం కాదు, అది ఒక మంత్రం, ఒక శక్తి, ఒక కల మరియు ఒక సంకల్పం అని ఆయన అభివర్ణించారు.

కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు చెక్కల లక్ష్మణ్, మాజీ కౌన్సిలర్ దివ్య శ్రీకాంత్ సింగ్, సంఘ్ పరివార్ చుక్క ఆనంద్, పాతకోట శ్రీశైలం, వరకుప్పల శ్రీనివాస్, ఎర్రవోలు మహేష్, పురుగుల శివ, టిల్లు యాదవ్, జజ్జేల ఆనంద్, నరేందర్, లండం మల్లేష్, గోజే ఆనంద్, నాగిళ్ళ సందీప్, శ్రీశైలం, బంటి యాదవ్, రాఘవేందర్, నరేష్ గౌడ్ తదితరులు ఉన్నారు.





## వందేమాతరం గీతం ప్రాధాన్యతను చాటి చెప్పేందుకే గీతాలాపన

**ఆమనగల్లు, నవంబర్ 07 (అక్షర గళం):**
వందేమాతరం గీతం ప్రాధాన్యతను చాటి చెప్పేందుకే సామూహిక గీతాలాపన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని ఆమనగల్లు ఎంపీడీఓ కుసుమ మాధురి అన్నారు.

మహాకవి శ్రీ బంకిమ్ చంద్ర ఛటర్జీ "వందే మాతరం" జాతీయ గీతాన్ని రచించి 150 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం పట్టణ కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో అదనపు ఎంఈఓ పాండు, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ఎంపీడీవో వందేమాతరం గీతాన్ని సామూహిక గానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి పౌరుడిలో దేశభక్తి భావాన్ని మరింతగా పెంపొందించేందుకు ఈ గీతం ఎంతగానో దోహదపడుతుందని, వందేమాతరం సామూహిక గీతాలాపన కార్యక్రమాన్ని మండల వ్యాప్తంగా చేపట్టడం జరిగిందని తెలిపారు.

కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ కుమార్, జూనియర్ అసిస్టెంట్ ప్రసన్న లత, ఝాన్సీ, ఏఈ పిఆర్ అభిషేక్, కంప్యూటర్ ఆపరేటర్ కవిత, ఉపాధ్యాయురాలు జయసుధ, అటెండర్స్ రమేష్, హాఫీజా, పార్వతమ్మ, మొగులయ్య మరియు విద్యార్థులు తదితరులు ఉన్నారు.

### మున్సిపల్ కార్యాలయంలో వందేమాతరం గీతాలాపన

వందేమాతర గేయం రచించి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆమనగల్లు మున్సిపల్ కార్యాలయంలో వందే మాతరం గీతాన్ని ఆలపించారు. దేశభక్తిని ప్రబోధించే విధంగా రచించిన ఈ వందేమాతరం గేయాన్ని మర్చిపోకుండా, స్ఫూర్తిని నింపే విధంగా ఉండడానికి దేశవ్యాప్తంగా వందేమాతరం గేయాన్ని ఆలపిస్తున్నారు. మున్సిపల్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్, విద్యార్థులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



## మంత్రి పొంగులేటిపై రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి బీఆర్ఎస్ ఫిర్యాదు

**హైదరాబాద్:** ఎన్నికల కోడ్ నిబంధనలకు విరుద్ధంగా ఉందని మంత్రి పైన ఎన్నికల పూర్తి అయ్యేవరకు జూబ్లీహిల్స్ ప్రచారం చేయకుండా నిషేధం విధించాలని బీ ఆర్ ఎస్ వి అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు.

బోరబండ డివిజన్‌లో వడ్డెర సంఘం సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల అనంతరం దరఖాస్తు చేసుకున్న వారందరికీ డబుల్ బెడ్రూమ్ ఇస్తాం అని ఓటర్లను ప్రలోభపెట్టి ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూశారన్నారు. మంత్రి పిఆర్ఓ రమేష్ డిప్యూటీ మేనేజర్ సివిల్ సప్లయ్ డిపోర్టమెంట్‌లో పనిచేస్తున్న అధికారి ఓటర్లకు వ్యక్తిగతంగా వాట్సాప్ మెసేజ్ లు చేసి ప్రభావితం చేస్తున్నారు. కాబట్టి చట్ట ప్రకారం చర్యలు తీసుకో గలరు అని కోరటం జరిగింది. ఈ బృందంలో ఎక్స్ కార్పొరేషన్ చైర్మెన్ పల్లె రవి,నాయకులు యూసుఫ్, న్యాయ వాదులు సిందం శ్రీకాంత్, సురినేని అభిలాష్, కిష్టగొని సదానందం, కిరణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఖైరతాబాద్ నుండే కాంగ్రెస్ డబ్బు తరలిస్తోంది

**- రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అధికార దుర్వినియోగం**

**- జూబ్లిహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ డబ్బులు విపరీతంగా పంచి గెలవాలని చూస్తోంది.**

**ఖైరతాబాద్ డివిజన్‌లోని ఒక లొకేషన్ నుండి డబ్బుల మూటలు తరలిస్తున్నారు**

**స్థానికుల నుండి సమాచారం వస్తుంది అంటూ ట్విట్టర్‌లో లొకేషన్ షేర్ చేసిన బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్.**

**హైదరాబాద్:** తెలంగాణ మంత్రులు బరితెగించి విచ్చలవిడిగా ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఈ క్రింది లోకేషన్ నుండే డబ్బుల మూటలను ప్రభుత్వ వాహనం అని స్టిక్కర్లు ఉన్న వాహనాల్లో, ఎమ్మెల్యేల కార్లలో, ఛైర్మన్ల కార్లలో జుబ్లీ హిల్స్ నియోజకవర్గానికి పెద్ద మొత్తంలో తరలిస్తున్నారని చుట్టుపక్కల ప్రజలందరు సమాచారం ఇస్తున్నారు. దీన్ని వెంటనే వెరిఫై చేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి.

కానీ అక్కడ ఒక్క పోలీసు, లేదా రెవెన్యూ అధికారి కూడా లేరు! ఈ ఎన్నికలో రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అధికార దుర్వినియోగం జరగబోతుందని ఇంతకన్నా సాక్ష్యం ఏం కావాలి? ఈ రోజు ప్రతిపక్ష నాయకుల ఇళ్లపై దాడి చేసిన పోలీసులకు ఇవి కనిపించడం లేదా?



# జూబ్లీహిల్స్‌లో ముమ్మర తనిఖీలు

### మద్యం, డబ్బు స్వాధీనం

**హైదరాబాద్,నవంబర్7(అక్షర గళం):** జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల కోడ్ నేపథ్యంలో అధికారులు తనిఖీలు ముమ్మరం చేశారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో భారీగా నగదు, మద్యం పట్టుబడుతోంది. నవంబర్ 7 ఉదయం వరకు రూ. 3.3 కోట్ల నగదు ..701 లీటర్ల మద్యం సీజ్ చేశారు అధికారులు. స్వాధీనం చేసుకున్న మద్యం విలువ రూ.4 లక్షల 74 వేల 322. 2 కిలోలకు పైగా గంజాయి . 0.11 గ్రాముల ఓఆఓంతో సహా మాదకద్రవ్యాలను కూడా ఏజెన్సీలు స్వాధీనం చేసుకున్నాయి. వీటి విలువ రూ.లక్షా 97 వేల 600 ఉంటుందని అధికారులు వెల్లడించారు నియోజకవర్గంలో ఎన్నికల కోడ్ ఉల్లంఘనలో భాగంగా 24 కేసులు నమోదయ్యాయి. వీటిలో 15 ఎన్నికల సంబంధిత హింసకు సంబంధించినవి, ఏడు అనుమతి లేకుండా సమావేశాలు , ప్రసంగాలకు సంబంధించినవి. రెండు ఓటర్లను ఆకర్షించే ఉద్దేశ్యంతో నగదు, సరకుల పంపిణీకి సంబంధించినవి. నియోజకవర్గంలో 45 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, 45 స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలను ఏర్పాటు చేశారు . ఈ బృందాల వాహనాలకు జీపీఎస్, పీటీజెడ్ కెమెరాలను అమర్చి, జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని కంట్రోల్ రూమ్ నుంచి 24గంటలు పర్యవేక్షిస్తున్నారు.జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్, బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత, బీజేపీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి మధ్యే ప్రధాన పోటీ ఉండనుంది. సిట్టింగ్ సీటు దక్కించుకోవాలని బీఆర్ఎస్, జూబ్లీహిల్స్ లో గెలవాలని అధికార పార్టీ, సత్తా చాటాలని బీజేపీ ప్రయత్నిస్తోంది. నవంబర్ 11న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు పోలింగ్ .. 14న కౌంటింగ్ జరగనుంది. జూబ్లీహిల్స్ లో మొత్తం 4,లక్షల 13వందల 65 ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుష ఓటర్లు - 2 లక్షల8 వేల 561.. లక్షా 92వేల779 మహిళల ఓట్లు,25 ఇతరుల ఓట్లు ఉన్నాయి .నియోజకవర్గంలోని మొత్తం 407 పోలింగ్ కేంద్రాలపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించారు. క్షేత్రస్థాయి నివేదికల ఆధారంగా, వీటిలో 54 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించారు. పోలింగ్ రోజున ఈ కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

# కాలిన గాయాలతో చిన్నారి మృతి

**హైదరాబాద్,నవంబర్7(అక్షర గళం):** దీపం అంటుకొని తీవ్ర గాయాలపాలైన ఏడేళ్ల చిన్నారి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ విషాద ఘటన కీసర పోలీస్ స్టేషన్ పరిధిలోని నాగారం మున్సిపాలిటీ ఆర్.ఎల్. నగర్ లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా, బీబీనగర్ గ్రామానికి చెందిన మధుసూదన్ రెడ్డి కుటుంబ సభ్యులతో నాగారం మున్సిపాలిటీలోని ఆర్.ఎల్. నగర్‌లో నివాసముంటు న్నారు. బుధవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా ఇంట్లో దీపాలు వెలిగించారు. అయితే మధుసూదన్ రెడ్డి కుమార్తె సాయి నేహా రెడ్డి(7)కి ఇంట్లో ప్రమాదవశాత్తు దుస్తులకు దీపం అంటుకోవడంతో కేకలు వేసింది. దీనిని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే సైనిక్ పురిలోని ప్రైవేట్ హాస్పిటల్ కి తీసుకెళ్లగా వైద్యుల సూచన మేరకు ఖార్కానాలోని రెయిన్ బో చిల్డన్స్ హాస్పిటల్ కి తరలించారు. అక్కడ చికిత్స పొందుతుండగా 90 శాతం శరీరం కాలిపోవడంతో పరిస్థితి విషమించి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు.

# ప్రైవేట్ కాలేజీల సమాఖ్యకు చుక్కెదురు

### అధ్యాపక సభకు అనుమతి ఇవ్వలేమన్న హైకోర్టు

**హైదరాబాద్,నవంబరు7(అక్షర గళం):** ఉన్నత విద్యా సంస్థల సమాఖ్యకు తెలంగాణ హైకోర్టులో చుక్కెదురైంది. హైదరాబాద్‌లో శనివారం నిర్వహించే అధ్యాపక సభకు అనుమతి నిరాకరించింది న్యాయస్థానం. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఉన్నందున సెక్యూరిటీ ఇవ్వలేమని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ క్రమంలో అధ్యాపక సభ అనుమతి కోసం హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ వేశారు. ఈ పిటీషన్‌పై జస్టీస్ శ్రవణ్ కుమార్ విచారణ జరిపారు. అధ్యాపక సభకు ఎల్బీ స్టేడియం లేదా మరోచోట అయినా ఫర్లేదని అనుమతి ఇవ్వాలని సమాఖ్య



లాయర్ కోరారు. అయితే, కాలేజీల బంద్‌ని రాష్ట్ర సర్కార్ ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించింది హైకోర్టు. ఈ సభకు అనుమతి ఇవ్వడానికి ఉన్న అభ్యంతరం ఏంటని న్యాయస్థానం ప్రశ్నించింది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రక్రియ ముగిసే వరకు హైదరాబాద్ సిటీలో భారీ సభకు అనుమతి ఇవ్వలేమని ప్రభుత్వ న్యాయవాది హైకోర్టుకు తెలిపారు. ఈ నేపథ్యంలో అధ్యాపక సభకు వారం రోజుల తర్వాత అనుమతిపై నిర్ణయం తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

# జూబ్లీహిల్స్‌లో అధికార దుర్వినయోగం

### కేంద్ర ఎన్నికల సంఘానికి బిఆర్ఎస్ ఫిర్యాదు

**న్యూఢిల్లీ,నవంబరు7(అక్షర గళం):** జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితోపాటు ఆయన కేబినెట్ సహచరులు కోడ్ ఉల్లంఘనకు పాల్పడుతున్నారని బీఆర్ఎస్ ఎంపీ కె.ఆర్.సురేష్ రెడ్డి విమర్శించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ.. అధికార దుర్వి నియోగానికి పాల్పడుతోందని ఆయన ఆరోపించారు. అధికార పార్టీకి అనుకూలంగా పోలీసులు వ్యవహరిస్తున్నారని.. ఈ నేపథ్యంలో కేంద్ర బలగాల ఆధ్వర్యంలో ఈ ఉపఎన్నికను నిర్వహించాలని ఈసీని కోరినట్లు ఆయన తెలిపారు. శుక్రవారం న్యూఢిల్లీలో కేంద్ర ఎన్నికల సంఘం ఉన్నతాధికారులతో బీఆర్ఎస్ ఎంపీలు కె.ఆర్.సురేష్ రెడ్డి, దామోదర్ రావు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఈ ఉప ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు



వ్యవహరిస్తున్న తీరును వారికి వివరించి.. ఫిర్యాదు చేశారు. అనంతరం విలేకర్లతో ఎంపీ కె.ఆర్.సురేష్ రెడ్డి మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారని.. దాంతో అక్కడ మహిళా అధికారులను నియమించాలని సీఈసీని కోరినట్లు తెలిపారు. అలా కాకుంటే దొంగ ఓట్లు వేసే అవకాశం ఉందని ఈ సందర్భంగా ఆందోళన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత మాగంటి గోపినాథ్ అనారోగ్యంతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక అనివార్యమైంది. నవంబర్ 11వ తేదీన ఈ ఉప ఎన్నిక జరగనుంది. బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు.. తమ తమ అభ్యర్థులను రంగంలోకి దింపాయి. ఈ ఉప ఎన్నికల్లో గెలుపు కోసం ఆయా పార్టీలు పక్కా వ్యూహాత్మకంగా ముందుకు వెళ్తున్నాయి. ఆ క్రమంలో అధికార పార్టీ హామీల వర్షం కురిపిస్తోంది. ఇక ప్రతిపక్షలు బీఆర్ఎస్, బీజేపీలు.. అధికార పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయలేదంటూ విమర్శలు గుప్పిస్తున్నాయి. దీంతో ఈ మూడు పార్టీలు ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకుంటున్నాయి. అయితే అధికార కాంగ్రెస్ పార్టీ ఈ ఉపఎన్నికల్లో గెలుపును ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. అందుకోసం మంత్రులు, అగ్రనేతలను ఈ నియోజకవర్గంలోని డివిజన్లకు ఇన్‌ఛార్జ్‌లుగా నియమించి.. గెలుపు కోసం కృషి చేయాలని పార్టీ అధిష్ఠానం ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది.


# వ్యోమగామి శిక్షణకు ఎంపికైన నిడదవోలు యువతి

### 2029లో అంతరిక్ష యాత్రకు సిద్ధమవుతున్న కైవల్య

### ఫ్లోరిడాలో నాలుగేళ్ల పాటు కొనసాగనున్న శిక్షణ

**అమరావతి,నవంబర్ 7(అక్షరగళం):** ఏపీకి చెందిన ఓ యువతి అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. అంతరిక్షంలోకి అడుగుపెట్టే తన కలను సాకారం చేసుకునే దిశగా కీలక మైలురాయిని దాటింది. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలుకు చెందిన కుంచల కైవల్య రెడ్డి, అమెరికాలో నిర్వహించే ప్రతిష్ఠాత్మక వ్యోమగామి శిక్షణకు ఎంపికైంది. ఫ్లోరిడాలోని 'టైటాన్స్ స్పేస్ ఇండస్ట్రీస్' ఆధ్వర్యంలో జరిగే ఈ శిక్షణ కోసం ప్రపంచవ్యాప్తంగా 36 దేశాల నుంచి వేలాది మంది పోటీ పడగా, కేవలం 150 మంది మాత్రమే అర్హత సాధించారు. వారిలో కైవల్య రెడ్డి ఒకరిగా నిలవడం విశేషం.

ఈ శిక్షణ నాలుగేళ్ల పాటు కొనసాగనుంది. దీనిని విజయవంతంగా పూర్తి చేసిన వారు 2029లో అంతరిక్ష యాత్రకు వెళ్లనున్నారు. ఈ యాత్రలో భాగంగా వ్యోమగాములు భూమి నుంచి 300 కిలోమీటర్ల ఎత్తులో కక్ష్యలో పరిభ్రమించనున్నారు. మొత్తం 5 గంటల పాటు సాగే ఈ మిషన్‌లో సుమారు 3 గంటల పాటు జీరో గ్రావిటీలో గడుపుతారు. కైవల్యకు నాసా మాజీ వ్యోమగామి, 224 రోజులు అంతరిక్షంలో గడిపిన విలియం మెక్‌ఆర్థర్, బ్రెజిల్ తొలి వ్యోమగామి మార్కోస్ పోంటెస్ వంటి ప్రముఖ నిపుణులు శిక్షణ ఇవ్వనున్నారు. కైవల్య రెడ్డి తండ్రి కుంచాల శ్రీనివాసరెడ్డి, నిడదవోలు మండలం సమిశ్రగూడెంలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ఆమె తల్లి విజయలక్ష్మి గృహిణి. తనకు చిన్నప్పటి



నుంచే అంతరిక్షం, ఖగోళ శాస్త్రంపై ఆసక్తి ఉండేదని కైవల్య తెలిపింది. భవిష్యత్తులో జర్మనీలో ఆస్ట్రోఫిజిక్స్ చదివి ఖగోళ శాస్త్రవేత్త కావాలన్నదే తన లక్ష్యమని పేర్కొంది. 17 ఏళ్లకే ఈ ఘనత సాధించిన కైవల్య, గతంలోనూ తన ప్రతిభను చాటుకుంది. 2023లో నాసా ఆధ్వర్యంలో జరిగిన 'అంతర్జాతీయ





ఎయిర్ అండ్ స్పేస్ ప్రోగ్రాం' కు కూడా ఎంపికైంది. ఆ కార్యక్రమంలో భాగంగా ఆమె అమెరికాలోని అలబామాలో 15 రోజుల పాటు శిక్షణ పొందింది. సైన్స్ పట్ల ఆమెకున్న ఆసక్తి, పట్టుదలే ఈ అరుదైన అవకాశాలను అందిస్తున్నాయని పలువురు అభినందిస్తున్నారు.

# మినిట్‌మ్యాన్-3 క్షిపణి ప్రయోగం

### శక్తిమంతమైన క్షిపణిని పరీక్షించిన అమెరికా

**కాలిఫోర్నియా, నవంబర్7(అక్షరగళం):** అంతర్జాతీయంగా ఉద్రిక్తతలు పెరుగుతున్న వేళ, అమెరికా తన అణు సామర్థ్యాన్ని మరోసారి ప్రపంచానికి చాటిచెప్పింది. కాలిఫోర్నియాలోని వాండెన్‌బర్గ్ స్పేస్ ఫోర్స్ బేస్ నుంచి నవంబర్ 5న 'మినిట్‌మ్యాన్-3' అనే ఖండాంతర బాలిస్టిక్ క్షిపణిని విజయవంతంగా పరీక్షించింది. ఇది కేవలం ఆయుధ వ్యవస్థల విశ్వసనీయతను అంచనా వేయడానికి చేపట్టిన రొటీన్ పరీక్ష అని అధికారులు ప్రకటించినప్పటికీ, దీని వెనుక బలమైన వ్యూహాత్మక కారణాలు ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. యూఎస్ ఎయిర్ ఫోర్స్ గ్లోబల్ స్ట్రైక్ కమాండ్ ఈ ప్రయోగాన్ని ధ్రువీకరించింది. ఈ క్షిపణి సుమారు 7,500 కిలోమీటర్లు ప్రయాణించి, పసిఫిక్ మహాసముద్రంలోని మార్షల్ దీవుల సమీపంలో ఉన్న రోనాల్డ్ రీగన్ బాలిస్టిక్ మిస్సైల్ డిఫెన్స్ టెస్ట్ సైట్‌లోని లక్ష్యాన్ని కచ్చితత్వంతో ఛేదించిందని అధికారులు తెలిపారు. ఇది కేవలం వ్యవస్థల పనితీరు, వేగం, కచ్చితత్వాన్ని అంచనా వేయడానికి చేపట్టిన రొటీన్ పరీక్ష అని, ఇందులో ఎలాంటి అణు వార్‌హెడ్‌లు ఉపయోగించలేదని పెంటగాన్ స్పష్టం చేసింది. రష్యా, చైనా, పాకిస్థాన్ వంటి దేశాలు అణు పరీక్షలు నిర్వహిస్తున్నాయని, ఈ పోటీలో అమెరికా వెనుకబడకూడదన్న ఉద్దేశంతో అధ్యక్షుడు ట్రంప్ ఈ పరీక్షలకు ఆదేశించినట్లు తెలుస్తోంది. ఎలాంటి పేలుడు పదార్థాలతో కూడిన అణు పరీక్షలు నిర్వహించబోమని అమెరికా ఇంధన శాఖ స్పష్టం చేసినప్పటికీ, ఈ ప్రయోగం ప్రచ్ఛన్నయుద్ధ కాలం నాటి అణు పోటీని గుర్తుచేస్తోందని నిపుణులు అంటున్నారు. మినిట్‌మ్యాన్-3 అమెరికా అమ్ములపొదిలో అత్యంత పురాతనమైన, భూమి నుంచి ప్రయోగించే ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి. 1970ల నుంచి ఇది సేవలో ఉంది. నిమిషం వ్యవధిలోనే ప్రయోగించగలదు కాబట్టే దీనికి ఆ పేరు వచ్చింది. ఇది సుమారు 13,000 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను కూడా ఛేదించగలదు. ప్రస్తుతం అమెరికా వద్ద ఇలాంటివి 400 క్షిపణులు ఉన్నాయి. 2030 నాటికి వీటి స్థానంలో కొత్త క్షిపణులను ప్రవేశపెట్టాలని అమెరికా యోచిస్తోంది.ఈ ప్రయోగం అణ్వాయుధాల భయానక విధ్వంసాన్ని మరోసారి గుర్తుచేస్తోంది. ప్రస్తుతం అమెరికా వద్ద ఉన్న అత్యంత శక్తిమంతమైన %దీ%83 అణు బాంబు సామర్థ్యం 1.2 మెగాటన్నులు. అంటే హిరోషిమా బాంబు కంటే 80 రెట్లు ఎక్కువ. ఇది ఒక నగరంపై పడితే 10-15 కిలోమీటర్ల పరిధిలోని ప్రతిదీ బూడిదైపోతుంది. ఇటీవల, ప్రపంచాన్ని 150 సార్లు నాశనం చేయగల అణ్వాయుధాలు తమ వద్ద ఉన్నాయని అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి. నిపుణుల అంచనా ప్రకారం, నాగరికతను నాశనం చేయడానికి 100-400 అణు వార్‌హెడ్‌లు చాలు. ఈ




నేపథ్యంలో, మినిట్‌మ్యాన్-3 వంటి పరీక్షలు ఒకవైపు అమెరికా సైనిక సన్నద్ధతను చాటుకోవడానికే కాకుండా, ప్రత్యర్థి దేశాలకు ఒక హెచ్చరికగా కూడా ఉపయోగపడతాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

# విమానయాన రంగంపై షట్‌డౌన్ తీవ్ర ప్రభావం

### సిబ్బంది కొరతతో వందలాది విమానాల రద్దు

### గంటల తరబడి విమానాల రాకపోకలకు ఆలస్యం

**చికాగో, నవంబర్7(అక్షరగళం):** అమెరికాలో ప్రభుత్వ షట్‌డౌన్ ప్రభావం విమానయాన రంగంపై తీవ్రంగా పడింది. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ) వ్యవస్థపై తీవ్ర ఒత్తిడి పెరగడంతో దేశవ్యాప్తంగా వందలాది విమానాలు రద్దయ్యాయి. దీంతో ప్రయాణికులు తమ ప్రయాణాలను రీ షెడ్యూల్ చేసుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన విమానాశ్రయాల్లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. భద్రతా కారణాల దృష్ట్యా దేశంలోని రద్దీ ఎక్కువగా ఉండే 40 ప్రాంతాల్లో విమాన సర్వీసులను 10 శాతం వరకు తగ్గించాలని ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ విమానయాన సంస్థలను ఆదేశించింది. ఈ నేపథ్యంలో శుక్రవారం నాటికి 750కి పైగా విమాన సర్వీసులను ముందుగానే రద్దు చేసినట్లు ఫ్లైట్ ట్రాకింగ్ వెబ్‌సైట్ ఫ్లైట్‌అవేర్ వెల్లడించింది. ప్రముఖ విమానయాన సంస్థ అమెరికన్ ఎయిర్‌లైన్స్ రోజుకు 220 విమానాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించగా, డెల్టా ఎయిర్‌లైన్స్ శుక్రవారం 170



సర్వీసులను, సౌత్‌వెస్ట్ ఎయిర్‌లైన్స్ 100 సర్వీసులను నిలిపివేసినట్లు తెలిపాయి. ప్రభుత్వ షట్‌డౌన్ కారణంగా ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్లు, విమానాశ్రయ భద్రతా సిబ్బంది సహా వేలాది మంది కీలక ఉద్యోగులకు జీతాలు అందడం లేదు. దీంతో సిబ్బంది కొరత ఏర్పడింది. చాలామంది అనారోగ్య కారణాలతో సెలవులు పెడుతుండటంతో ఏటీసీ సేవలకు అంతరాయం కలుగుతోంది. ఇప్పటికే గురువారం 6,400కు పైగా విమానాలు ఆలస్యంగా నడవగా, 200 సర్వీసులు రద్దయ్యాయి. బోస్టన్, నెవార్క్ విమానాశ్రయాల్లో ప్రయాణికులు రెండు గంటలకు పైగా, షికాగో, వాషింగ్టన్ ఎయిర్‌పోర్టుల్లో గంటకు పైగా వేచి చూడాల్సి వచ్చింది. "ఏదైనా ప్రమాదం జరిగిన తర్వాత చర్యలు తీసు కోవడం కంటే, ముందే మేల్కోవడం మంచిదని భావిస్తున్నాం. పరిస్థితులు దిగజారకముందే ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నాం" అని ఎఫ్ఏఏ అడ్మినిస్ట్రేటర్ బ్రయాన్ బెడ్‌ఫోర్డ్ తెలిపారు. కొన్ని వారాల్లో థ్యాంక్స్‌గివింగ్ సెలవులు రానున్న నేపథ్యంలో ప్రయాణాల రద్దీ మరింత పెరగనుంది. ఈ సమయంలో విమానాల రద్దు ప్రయాణికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేయనుంది. అట్లాంటా, డెన్వర్, చికాగో, హ్యూస్టన్, లాస్ ఏంజిల్స్ వంటి ప్రధాన విమానాశ్రయాలపై ఈ ప్రభావం ఎక్కువగా ఉండనుంది. అయితే, విమాన ప్రయాణాలు సురక్షితమేనని, ప్రయాణికులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రవాణా శాఖ కార్యదర్శి సీన్ డఫీ భరోసా ఇచ్చారు. కాగా, తన 35 ఏళ్ల సర్వీసులో ఇలాంటి పరిస్థితులను ఎప్పుడూ చూడలేదని, ప్రభుత్వ షట్‌డౌన్‌ల విషయంలో ఇది ఒక కొత్త అనుభవమని బెడ్‌ఫోర్డ్ వ్యాఖ్యానించారు.

# దిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో సాంకేతిక సమస్య


### విమానాల రాకపోకలకు అంతరాయం

**న్యూఢిల్లీ,నవంబర్7(అక్షరగళం):** దేశ రాజధాని దిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయంలో శుక్రవారం ఉదయం సాంకేతిక సమస్య తలెత్తింది. ఎయిర్‌పోర్టులోని ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ వ్యవస్థలో సాంకేతికలోపం తలెత్తడంతో విమానాల రాకపోకలకు అంతరాయం కలిగింది. దీని కారణంగా దాదాపు 100కు పైగా విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. ఈ సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నట్లు అధికారులు తెలిపారు. దేశంలోనే అత్యంత రద్దీ విమానాశ్రయాల్లో ఒకటైన దిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి రోజుకు 1500లకు పైగా విమానాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఎయిర్ ఇండియా విమానంలో ప్రయాణిస్తున్న ఒకరు ఈ విషయాన్ని వెల్లడించారు. తాము ప్రయాణిస్తున్న విమానం రన్‌వేపై అరగంటకు పైగా నిలిచిపోయిందని, ఏటీసీ సిస్టమ్‌లో సమస్య వల్లే ఈ జాప్యం జరిగిందని సిబ్బంది తెలియజేశారని ఆయన పేర్కొన్నారు. ఈ గ్లిచ్ కారణంగా విమానాల రాకపోకలు రెండింటికీ కొంతసేపు అంతరాయం ఏర్పడింది.

దీంతో బోర్డింగ్ గేట్ల వద్ద ప్రయాణికుల రద్దీ పెరిగిపోయింది. సాంకేతిక బృందాలు సమస్యను పరిష్క రించేందుకు ప్రయత్నిస్తున్నాయని, త్వరలోనే కార్యకలాపాలు సాధారణ స్థితికి వస్తాయని ఎయిర్ ఇండియా సిబ్బంది ప్రయా ణికులకు



సర్దిచెప్పారు. ఆశ్చర్యకరంగా ఇదే విమానాశ్రయంలో ఇలాంటి సాంకేతిక సమస్య తలెత్తడం ఈ వారంలో ఇది రెండోసారి. కేవలం రెండు రోజుల క్రితం, బుధవారం నాడు కూడా ఇదే తరహాలో సమస్య తలెత్తగా, దాన్ని పరిష్కరించినట్లు, కార్యకలాపాలు సాధారణ స్థితికి వచ్చాయని విమానాశ్రయ



అధికారులు ప్రకటించారు. ప్రయాణికులు తమ ప్రయాణ ప్రణాళికలతో ముందుకు సాగవచ్చని కూడా సూచించారు. బుధవారం నాటి సమస్యపై ఎయిర్ ఇండియా స్పందిస్తూ.. థర్డ్-పార్టీ కనెక్టివిటీ నెట్‌వర్క్‌లో సమస్య కారణంగా కొన్ని ఎయిర్‌లైన్స్‌తో పాటు తమ చెక్-ఇన్ సిస్టమ్‌లు కూడా ప్రభావితమయ్యాయని, అందుకే విమానాలు ఆలస్యమయ్యాయని 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా తెలిపింది. సిస్టమ్‌ను పునరుద్ధరించామని, అయితే పరిస్థితి చక్కబడే వరకు కొన్ని విమానాలు ఆలస్యంగా నడవొచ్చని వివరించింది. అయితే, అంతా సర్దుకుందని ప్రకటించిన రెండు రోజులకే అదే తరహా సమస్య పునరావృతం కావడంతో ప్రయాణికులు తీవ్ర అసహనానికి గురయ్యారు. తాజా ఘటనపై ఎయిర్‌లైన్స్ నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

# దొంగచాటు అణు కార్యక్రమం పాక్‌కు అలవాటే

### ట్రంప్ వ్యాఖ్యలకు విదేశాంగశాఖ స్పందన

**న్యూఢిల్లీ,నవంబరు7(అక్షర గళం):** రహస్యంగా, చట్టవిరుద్ధంగా అణు కార్యకలాపాలు కొనసాగించడంలో పాకిస్థాన్‌కు దశాబ్దాల చరిత్ర ఉందని భారత విదేశాంగశాఖ స్పష్టం చేసింది. స్మగ్లింగ్, ఎగుమతి నియంత్రణ ఉల్లంఘనలు, రహస్య భాగస్వామ్యాలు దశాబ్దాలుగా పాకిస్థాన్‌కు అలవాటేనని తెలిపింది. ఏకే ఖాన్ నెట్‌వర్క్ విస్తరణ చుట్టూ ఇది కేంద్రీకృతమైందని భారత విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ పేర్కొన్నారు. ప్రపంచంలో అణ్వాయుధాలను పరీక్షిస్తున్న దేశాల్లో పాకిస్థాన్ కూడా ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల చేసిన వ్యాఖ్యలపై భారత్ స్పందించింది. ఆ వ్యాఖ్యలను నిశితంగా పరిశీలిస్తున్నామని తెలిపింది.ఈ అంశాలను అంతర్జాతీయ సమాజం దృష్టికి భారత్ ఎల్లప్పుడూ తీసుకెళ్తూనే ఉంటుందని జైశ్వాల్ అన్నారు. వచ్చే ఏడాది భారత్‌లో పర్యటిస్తానని ట్రంప్ చేసిన ప్రకటన గురించి అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ.. దీనిపై ప్రస్తుతానికి తమకు ఎటువంటి సమాచారం లేదన్నారు. ప్రపంచంలో చాలా దేశాలు చురుగ్గా అణ్వాయుధాలను పరీక్షిస్తున్నాయని, ఆ జాబితాలో పాకిస్థాన్ ఉందని అమెరికా అధ్యక్షుడు ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. రష్యా, చైనా, ఉత్తరకొరియా, పాకిస్థాన్ వంటి దేశాలు అణు పరీక్షలను నిర్వహిస్తున్నాయని, వాళ్లెవ్వరూ ప్రశ్నించరని అన్నారు. తాము మాత్రం బహిరంగంగానే చెబుతామన్నారు. ఇన్నాళ్లూ ఎన్ని దేశాలు అణు పరీక్షలు చేపట్టినా వాటి జోలికి వెళ్లలేదని.. ఇకపై అలా మిగిలిపోవాలనుకోవట్లేదన్నారు. ఇతర దేశాల మాదిరిగానే తామూ అణు పరీక్షలు నిర్వహిస్తామని ట్రంప్ స్పష్టం చేసిన విషయం తెలిసిందే.

# హిందూ అయిన ముస్లిం అయిన కేసీఆర్‌కు ఒక్కటే

**మీ కాంగ్రెస్ వాళ్ళు చనిపోతే భార్యలు ఏడుస్తారా? లేదా?**

**- ఈ ఎన్నికలు రెఫరెండం అని చెప్పే ధైర్యం లేదు**

**- పటాన్‌చెరు నియోజకవర్గంలోని కొల్లూరు కెసిఆర్ నగర్ డబుల్ బెడ్‌రూమ్ కాలనీవాసుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు**

హైదరాబాద్, నవంబరు 7 (అక్షర గళం): పటాన్‌చెరు నిన్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇక్కడికి వస్తే కుర్చీలు ఖాళీ ఉన్నాయి. మన మీటింగ్‌కు మూడుసార్లు కుర్చీలు తెప్పించిన సరిపోవడం లేదు. కొల్లూరు డబుల్ బెడ్ రూమ్స్‌కు పేరు కేసీఆర్ నగర్ అనే పేరు పెట్టుకున్నాం. ఇన్ని ఇళ్లు చూసి అబ్బ కేసీఆర్ ఇంత పెద్ద ఇల్లు కట్టాడా? అని ఆశ్చర్య పోయారట. ఇన్ని రోజులు మంత్రులు వచ్చారా?

మాగంటి గోపీనాథ్ భార్య కన్నీళ్లు పెట్టుకుంటే కాంగ్రెస్ నాయకులు దాన్ని కూడా రాజకీయం చేస్తున్నారు.మీ కాంగ్రెస్ వాళ్ళు చనిపోతే భార్యలు



ఏడుస్తారా లేదా?ఆ తల్లిని పట్టుకుని దుర్మార్గంగా మాట్లాడారు. ఆలోచన చేయండి.. సిగ్గు లేకుండా ఓట్లు అడుగుతున్నారు. అది ఇస్తాం, ఇది ఇస్తాం అని ప్రలోభాలు చేస్తున్నారు

అన్నం పెట్టిన కేసీఆర్‌ను మర్చిపోతమా? కలలో కూడా కలగనని ఇళ్లలో ఉంటామని అనుకోలేదు. మీ ఓట్లు ఖాయంగా కేసీఆర్‌కే అని అర్థ అయ్యింది. మీ బంధువులకు కూడా చెప్పి కేసీఆర్‌కు కారుకు ఓటేయమ్మని చెప్పండి.. ఈ ఎన్నికలు రెఫరెండం అని చెప్పే ధైర్యం లేదు. మంత్రులు జూపల్లి కృష్ణారావుకు, పొన్నం ప్రభాకర్‌కు జూబ్లీహిల్స్ ఓటర్లు చుక్కలు చూపించారు. ఓటుకు రూ.3వేలు ఇస్తామని కాంగ్రెస్ చెబుతున్నది. తీసుకుని మిగతా రెండేళ్లలో ఇస్తామన్న డబ్బులు కూడా అడగండి.

2,500 లేదు, మహాలక్ష్మి స్కీమ్ లేదు, తులం బంగారం లేదు, స్కూటీ లేదు.. సిగ్గు లేకుండా మళ్ళీ ఏదో చేస్తా అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెబుతున్నాడు. తులం బంగారం అడిగితే ఓ మంత్రి లక్ష దాటింది ఎక్కడ ఇస్తాం అని మాట్లాడుతున్నాడు. మరి అలాంటప్పుడు హామీ ఎందుకు ఇచ్చారు బిడ్డా? కల్యాణ లక్ష్మి, కేసీఆర్ కిట్ ఇచ్చాము..

రేవంత్ రెడ్డికి కేసీఆర్ చేసిన అభివృద్ధి కనపడటం లేదంటే.. ఆయన అంధుడు అయిన ఉండాలే.. లేదంటే పిచ్చోడు అయిన ఉండాలి.. పిచ్చోడు అయితే జూబ్లీహిల్స్ ప్రజలు ఎర్రగడ్డలో చేర్చాలి. రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లో ఒక్క ఇల్లు కూడా కట్టలేదు. గతంలో కిరాయి ఇళ్లలో ఏ



పనులు కూడా చేసుకోలేని దుస్థితి ఉండేది. ఆత్మగౌరవంతో కేసీఆర్ పెద్ద ఎత్తున ఇల్లు కట్టించాడు..

రేవంత్ రెడ్డి ఇల్లు కట్టకపోగా ఉన్న ఇండ్లను కూల్చాడు.కేసీఆర్ ముస్లింలను మోసం చేయలేదు.. సహాయం చేశాడు. ముస్లింలు సహాయం చేసిన వారిని జీవితంలో మర్చిపోరు..హిందూ అయిన ముస్లిం అయిన కేసీఆర్‌కు ఒక్కటే.. బతుకమ్మ చీరలు మాత్రం ఇవ్వలేదు కానీ రేవంత్ వచ్చాక అన్ని ధరలు పెంచాడు. సీఎం రేవంత్ రెడ్డి ధరలు పెంచి, కమీషన్లు దండుకున్నాడు.

కాంగ్రెస్ లేకపోతే ముస్లిం లేరు అని రేవంత్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలపై యావత్ తెలంగాణ ముస్లింలకు క్షమాపణ చెప్పాలి. జహీరాబాద్ మైనార్టీ విద్యార్థుల్లో ఆటో డ్రైవర్ బిడ్డ ఉంది.. మీ అందరికీ ఇండ్లు ఇచ్చిన కేసీఆర్‌ను మర్చిపోవద్దు.. 11వ తేదీన జరిగే జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటు గుద్దితే.. కాంగ్రెస్ వాళ్లు కనుమరుగు కావాలే..

# ఎంపీ అసదుద్దీన్ ఒవైసీకి... భారతమాత పేరు చెప్పాలంటే నచ్చదు!

**- కానీ, పార్లమెంటులో 'జై పాలస్తీన్' అన్నారు**

**- రజాకార్ల వ్యతిరేక పోరాటంలో కీలకమైన 'వందేమాతరం'**

**- ఏడాదిపాటు ఈ సంబరాలు జరుపుకొందాం**

**- కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి**

హైదరాబాద్, నవంబరు 7 (అక్షర గళం): వందేమాతరం గీతం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కోఠి, హనుమాన్ వ్యాయామశాల వద్ద ఘనంగా ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి పాల్గొని, మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా ఈ రోజు ఉత్సవాలు జరుగుతున్నాయి. ఈ చారిత్రక సమయంలో, మనందరం మన ఆత్మగౌరవం, దేశ గౌరవం, సమగ్రత కోసం పునరంకితం కావాల్సిన అవసరం ఉందన్నారు. ఇంకా, ఆయన ఏమన్నారంటే...

స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను పణంగా పెట్టిన ఎందరో మహానుభావులు 'వందేమాతరం' రణ నినాదంతో పోరాడారు. బానిస సంకెళ్లను తెంచడంలో ఈ గేయం స్వతంత్ర పోరాటంలో అద్భుతమైన స్ఫూర్తిని నింపింది. అందుకే, నేటి యువతరం ఈ స్ఫూర్తిని భవితరానికి అందించాలి. ఇది ఒక్క మతానికి సంబంధించిన నినాదం కాదు... ఇది అన్ని వర్గాలలో స్ఫూర్తిని నింపింది. భారతదేశానికి స్వాతంత్ర్యం అందించడంలో కీలక పాత్ర పోషించిన నినాదం ఇదే.

బ్రిటిషర్లపై పోరాటంలోనే కాదు, నిజాం, రజాకార్ల వ్యతిరేక పోరాటంలో కూడా వందేమాతరం నినాదం కీలక పాత్ర పోషించింది. ఈ పోరాటంలో నారాయణరావు పవర్, వందేమాతరం రామచందర్, రామ్ నాథ్ తీర్థ కావచ్చు... ఎందరో మహానుభావులు నిజాం నిరంకుశత్వాన్ని ఎదిరించి పోరాటం చేశారు. వారి త్యాగాల ఫలితంగానే ఈ గడ్డపై మూడు రంగుల జెండా ఎగిరేలా చేశాం.

దేశమంతా 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం జరుపుకుంటే, హైదరాబాద్ సంస్థానం మాత్రం నిజాం నిరంకుశత్వంలో మగ్గింది. 13 నెలల ఆలస్యంగా 1948 సెప్టెంబర్ 17న మనకు స్వాతంత్ర్యం వచ్చింది. వందేమాతరం నినాదం ఇస్తుంటే రజాకార్లు హత్యలు, అత్యాచారాలు చేశారు. ఉస్మానియా యూనివర్సిటీలో రామ్ చందర్ అనే విద్యార్థి నిజాం వ్యతిరేకంగా నినాదం ఇస్తే, అతన్ని కాలేజీ నుండి బహిష్కరించి అనేక ఇబ్బందులు పెట్టారు. మన తెలుగు బిడ్డ అల్లూరి సీతారామరాజు బ్రిటిష్



వారికి వ్యతిరేకంగా పోరాడి, వారు కాల్చినప్పుడు కూడా చివరి క్షణంలో 'వందేమాతరం' నినాదం ఇచ్చారు.

బంకించంద్ర ఛటర్జీ వందేమాతరం గేయాన్ని రూపొందిస్తున్నప్పుడు, ఈ దేశంలోని మాతల పేర్లు, నదుల పేర్లు, ప్రాంతాల పేర్లు ఉండేలా చూసుకున్నారు. కానీ, దురదృష్టవశాత్తూ కొందరు దీనిని విమర్శిస్తున్నారు. ఇక్కడ ఉన్న అసదుద్దీన్ ఒవైసీ హైదరాబాద్ ఎంపీ అయినప్పటికీ, 'భారతమాతా కీ జై' అనే నినాదం ఇవ్వరు. కానీ, పార్లమెంటులో 'జై పాలస్తీన్' అన్నారు. అతనికి భారతమాత పేరు చెప్పాలంటే నచ్చదు. భారత మాత సంకెళ్లను తెంచడంలో కీలక పాత్ర పోషించిన ఈ వందేమాతరం ఉత్సవాలను మనం ఏడాది పాటు ఘనంగా జరుపుకుందాం. ప్రతి ఒక్కరూ ఇందులో భాగస్వాములు కావాలి. బంకించంద్ర ఛటర్జీ మన దేశం సుసంపన్న దేశంగా, విశ్వగురువుగా ఉండేలా ఆశించారు. అదే విధంగా మనమందరం కృషి చేస్తూ ఈ ఉత్సవాలలో పాల్గొనాలని కోరుకుంటున్నాను.

# హిందువులు ఎక్కడికి పోవాలి?

**- కాంగ్రెస్ అంటే ముస్లిం, ముస్లిం అంటే కాంగ్రెస్ అని అంటున్నారు**

**- బీఆర్ఎస్- కాంగ్రెస్ భ్రష్టాచారానికి అన్నదమ్ములే**

**- సోమాజిగూడ, కత్రియ హెూటల్‌లో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన ఇతర రాష్ట్రాలకు చెందిన ప్రముఖులు మరియు స్థానిక ఓటర్ల ఆత్మీయ సమ్మేళనంలో బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు**

హైదరాబాద్, నవంబరు 7 (అక్షర గళం): 1876లో రచించిన వందేమాతర గీతం మనదేశ స్వాతంత్ర్య పోరాటాన్ని ఉగ్రూతలూగించింది. వందేమాతరం అన్న నినాదం అండగా పెద్ద పోరాటం జరిగింది. ఈ గీతం అందించిన ప్రేరణతో ఈ రోజు మనం స్వతంత్ర భారతాన్ని ఇక్కడ చూస్తున్నాం. అందుకే వందేమాతరం గీతం మన ఆత్మ..

"అయితే, దురదృష్టకర విషయం ఏమిటంటే, స్వాతంత్ర్యానికి పూర్వం ఆ కాలపు సమావేశంలో కాంగ్రెస్ ఈ గీతం పాడినప్పుడు.. ఆచరణాల్లోని దేవీ దేవతల పేర్లు విని కాంగ్రెస్‌లోని కొంతమంది నాయకులు దీనిపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆసమయంలో జవహర్‌లాల్ నెహ్రూ దేవీదేవతలను ప్రస్తావించే అన్ని చరణాలను తొలగించి, మొదటి చరణాన్ని మాత్రమే ఉంచారు. ఎందుకంటే ఆ చరణంలో ఏ దేవీ దేవత పేరు లేదు.

దేవీదేవతలు ప్రస్తుతించే చరణాలను తొలిగించినా ఈ రోజు కూడా కాంగ్రెస్ నాయకులు వందేమాతరాన్ని వ్యతిరేకిస్తున్నారు. ఎందుకంటే ఇందులో ఈ దేశంలోని దేవీ దేవతల గురించి,..ఈ దేశం గురించి వర్ణించబడింది. స్వాతంత్ర్య పోరాటం ఈ దేశంలో వ్యాప్తి చెందడానికి కారణమైన ఆ ప్రేరణ వందేమాతరం గీతమే.

కానీ కాంగ్రెస్ దాన్ని తిరస్కరించింది. కాంగ్రెస్ పార్టీ ఈ రోజూ వందే మాతరం పాడాలని కోరుకోవడం లేదు. ఈ రోజు దేశమంతా, కాంగ్రెస్ పాలిత ప్రభుత్వాలు మినహా, అన్ని ప్రభుత్వాలు వందేమాతరం గీతాన్ని పాడుతున్నాయి. ఇది అధికారికంగా ప్రభుత్వ కార్యక్రమంగా జరుపు కుంటున్నారు. కానీ తెలంగాణలో మాత్రం వందేమాతరం పాడడం లేదు.

"తెలంగాణలో వందేమాతరం గీతాన్ని అధికారికంగా పాడకపోవ డానికి కారణం మజ్లిస్ పార్టీ దానిని వ్యతిరేకించడమే. వందేమాతరం నినాదాన్ని పాడడాన్ని మజ్లిస్ పార్టీ వ్యతిరేకిస్తోంది. మజ్లిస్ పార్టీ వందేమాతరం నినాదాన్ని, భారత్ మాతా కీ జై నినాదాన్ని ఇవ్వడానికి ఇష్టపడడు. కానీ, పార్లమెంటులో, ఇక్కడి ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఖలిస్తాన్ జిందాబాద్ నినాదం చేయగలరు.

ఇంకా సిగ్గుచేటైన విషయం ఏమిటంటే, ఈ రోజుకూ కాంగ్రెస్ పార్టీ దీనిని ఎప్పుడూ ఖండించలేదు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ దీనిని వ్యతిరేకించలేదు. ఈ రోజు ఎన్నికలలో భుజం భుజం కలిపి కాంగ్రెస్, మజ్లిస్ పార్టీలు మనల్ని తప్పుదోవ పట్టిస్తున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూబ్లిహిల్స్ ప్రచారంలో భాగంగా ఓటు మాకే వేయమని విజ్ఞప్తి చేస్తున్నారు. కానీ ఎవరికి విజ్ఞప్తి చేస్తున్నారు? ఇక్కడి హిందువులకు కాదు. కేవలం ముస్లింలను ఉద్దేశించి మాత్రమే.కాంగ్రెస్ అంటే ముస్లిం, ముస్లిం అంటే కాంగ్రెస్ అని అంటున్నారు. మరి హిందువులు ఎక్కడికి పోవాలి? ఈ కాంగ్రెస్ పార్టీ సంతుష్టీకరణ విధానాన్ని మనం తప్పకుండా వ్యతిరేకించాలి. భారతదేశం ఒక పూలతోట లాంటిది, ఇక్కడ రంగు రంగుల పువ్వుల వలె మనకు అనేక భాషలు, అనేక జాతులు, అనేక మతాలు, అనేక ప్రాంతాలు ఉన్నాయి.

ఇవన్నీ భారతదేశానికి ఏకత రూపంలో, అఖండ భారతానికి ఒక స్వరూపాన్ని ఇస్తున్నాయి. మనం ఏ మతానికి వ్యతిరేకం కాదు.ముస్లిం, క్రైస్తవ, సిక్కు, హిందూ-మనం అందరినీ ఒకేలా చూస్తాం. కానీ కాంగ్రెస్ మతం పేరు మీద, జాతి పేరు మీద, ప్రాంతం పేరు మీద, భాష పేరు మీద దేశాన్ని ముక్కలు చేయడానికి ప్రయత్నించింది..

మీరందరూ మేధావులు. చదువుకున్న వారు. మీరంతా మీ వ్యాపారం చేసుకుంటున్నారు. కొందరు ప్రభుత్వ ఉద్యోగాలు, మరికొందరు ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తున్నారు. దేశం నలుమూలల నుండి వచ్చి ఇక్కడ స్థిరపడిన మీరు, ఈ రోజు హైదరాబాద్‌లో ఏం జరుగుతుందో చూస్తున్నారు. ఇక్కడ జరుగుతున్నదే దేశంలో కూడా జరుగుతోంది. ఇలాంటి సంతుష్టీకరణ రాజకీయాలను కాంగ్రెస్ పార్టీ దేశమంతా ముందుకు తీసుకువస్తోంది.

నరేంద్ర మోదీ ప్రధానమంత్రి అయినప్పటి నుండి 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్, సబ్ కా ప్రయాస్, ఔర్ సబ్ కా విశ్వాస్' (అందరి సహకారం, అందరి అభివృద్ధి, అందరి కృషి, అందరి విశ్వాసం) స్ఫూర్తిగా ముందుకు సాగుతున్నారు.



తెలంగాణలోనూ డబుల్ ఇంజిన్ సర్కార్ రావాలి. తెలంగాణలో కూడా భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం అంటే మోదీ ప్రభుత్వం ఏర్పాటు కావాలి. ఈ రోజున మన ప్రజల ఆకాంక్ష, కోరిక ఇదే.దీని కోసం మొదటి యుద్ధం జూబ్లీ హిల్స్‌లో జరుగుతోంది. భారతీయ జనతా పార్టీ అభివృద్ధి మార్గంలో ముందుకు సాగాలని కోరుకుంటుంది. అందుకే జూబ్లీ హిల్స్ ఎన్నికలలో, మీరు భారతీయ జనతా పార్టీకి ఓటు వేయమని నేను మీ అందరినీ అభ్యర్థిస్తున్నాను.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో కొనసాగిన సమయంలో మనం చాలా రకాల అవినీతిని చూశాం. హెలికాప్టర్ల కొనుగోలు, నేవీ సబ్‌మెరైన్ కొనుగోలులో, కామన్వెల్త్ క్రీడల్లో, 2జీ స్కాం, బోఫోర్స్ స్కాం చూశాం. కానీ, మోదీ వచ్చిన తర్వాత ఈ 12 సంవత్సరాలలో ఒక్క స్కాం కూడా జరగలేదు. ఇదే మోదీ ప్రభుత్వ పనితీరుకు తార్కాణం. మోదీ ప్రభుత్వం అవినీతి రహిత ప్రభుత్వం. అందుకే స్నేహితులారా, సోదర సోదరీమణులారా ఒక్కసారి ఆలోచించండి. దేశం కోసం ఆలోచించండి, ఈ సమాజం కోసం ఆలోచించండి. కేవలం రెండు రోజుల కోసం ఈ రాజకీయ నాయకుల మాటలు విని, మన సమాజంలో వారు సృష్టించడానికి ప్రయత్నిస్తున్న విభజన భావనను, జాతి పేరు మీద, మతం పేరు మీద, మతం పేరు మీద, ధర్మం పేరు మీద మనల్ని విభజించాలనుకుంటున్న అలాంటి పార్టీలను ఓడించాల్సిన అవసరం చాలా ఉంది.

బీఆర్ఎస్‌ను చూశాం, కాంగ్రెస్‌ను చూస్తున్నాం. ఈసారికి బీజేపీకి అవకాశం ఇవ్వండి. ఇదే మన నినాదం.బీఆర్ఎస్ ప్రభుత్వం ఏ విధంగా ఈ రాష్ట్రాన్ని దోచుకుందో మనం చూశాం. వాళ్ళు ఎంత దోచుకున్నారంటే నీకు ఎక్కువ దొరికింది. నాకు తక్కువ దొరికింది అని ఈ రోజు వారి కుటుంబ సభ్యులు రోజూ పోట్లాడుకుంటున్నారు.

కాంగ్రెస్ మంత్రులు కూడా ఒకరినొకరు ఎలా కొట్లాడుకుంటున్నారో కూడా మనం చూస్తున్నాం. ఒకరు వచ్చి పారిశ్రామికవేత్తల తలపై తుపాకీ పెట్టి దోచుకోవాలని చూస్తే, మరొక మంత్రి లేదు లేదు, నేను దోచు కుంటాను, నువ్వు ఎలా దోచుకుంటావు, ఇది నా హక్కు అని కాంగ్రెస్ మంత్రులు కీచులాడు కుంటున్నారు. ఈ రెండు పార్టీలకూడా కూడా అన్నదమ్ముల వంటి వారు. ఈ రెండు పార్టీలు అవినీతికి, భ్రష్టాచారానికి అన్నదమ్ములే. ఈ రెండు పార్టీలు తెలంగాణను దోచుకోవాలనుకునే దొంగలు. ఈసారి భారతీయ జనతా పార్టీకి అవకాశం ఇవ్వండి. కమలం గుర్తుపై ఓటు వేయండి. మన అభ్యర్థి దీపక్ రెడ్డిని గెలిపించండి. ఓటు వేసే రోజు తప్పకుండా రావాలి. మీ ఓటు వేయకుండా పారిపోవద్దు. పెద్ద క్యూలు ఉన్నాయని చూడకండి. మన భవిష్యత్తు ఏమి కాబోతోందో చూడండి.ఒకటి, రెండు గంటలు క్యూలలో నిలబడైనా సరే ఈ దేశాన్ని, తెలంగాణను, మన సమాజాన్ని మనం రక్షించుకోవాలంటే మీరందరూ బయటకు వచ్చి ఓటు వేయండి.

# రేవంత్ రెడ్డి ఒక బ్లాక్ మెయిలర్!

**- సమాచార హక్కు చట్టం ఉపయోగించి రియల్ ఎస్టేట్, వ్యాపారవేత్తలను బ్లాక్ మెయిల్ చేశాడు**

**- నలుగురు రేవంత్ బ్రదర్స్ మాత్రమే హ్యాపీగా ఉన్నారు**

**- మీట్ ద ప్రెస్‌లో మాజీ మంత్రి హరీష్ రావు**

హైదరాబాద్, నవంబరు 7 (అక్షర గళం): జూబ్లీహిల్స్ ఎన్నిక నాలుగు లక్షల మంది ప్రజల భవిష్యత్తు కాదు, నాలుగు కోట్ల మంది తెలంగాణ ప్రజల భవిష్యత్తు. ఈ అరాచక ప్రభుత్వానికి జూబ్లీహిల్స్ ప్రజలు బుద్ధి చెప్పాలి. ఈ తీర్పు రాష్ట్ర ప్రజలకు మేలు చేకూర్చాలని ప్రజలంతా ఎదురుచూస్తున్నారు.

రేవంత్ పాలనలో ఏ వర్గం కూడా సంతోషంగా లేదు. రాష్ట్రంలో నలుగురు రేవంత్ బ్రదర్స్ మాత్రమే హ్యాపీగా ఉన్నారు. రెండేళ్ల రేవంత్ పాలన అరాచకాలకు జూబ్లీహిల్స్ ప్రజలు చరమగీతం పాడనున్నారు. కేసిఆర్ పాలనలో వికాసం, రేవంత్ పాలనలో విధ్వంసం. ప్రజలు వికాసం కావాలా, వికాసం కావాలా ఆలోచించాలి.

**రేవంత్ రెడ్డి ఒక బ్లాక్ మెయిలర్!**

సమాచార హక్కు చట్టం ఉపయోగించి రియల్ ఎస్టేట్, వ్యాపారవేత్తలను బ్లాక్ మెయిల్ చేశాడు. ఫీజు రియంబర్స్మెంట్ రాలేదు అంటే, కాలేజీల మీద విజిలెన్స్ దాడులు, పోలీసుల దాడులు. బి ఆర్ ఎస్ ప్రభుత్వం 19,500 కోట్లు ఫీజు రీయింబర్స్మెంట్ చెల్లించింది. రెండేళ్లలో రేవంత్ రెండు రూపాయలు కూడా ఇవ్వలేదు. ఫీజు రియంబర్స్మెంట్ కాక కాలేజీలు బందు పెట్టారు. ఆ పిల్లలు జూబ్లీహిల్స్ లో కూడా ఉన్నారు.

ఆరోగ్య శ్రీ వై ఎస్ తెచ్చిన పథకం అని గొప్పలు చెప్పడం కాదు, పథకం అమలు చేయడం లేదు, ఆసుపత్రులను బెదిరిస్తున్నారు. 1900 కోట్ల ఆరోగ్య శ్రీ బకాయిలు ఇవ్వలేదు. బకాయిలు అడిగితే అధికారులు, విజిలెన్స్ దాడులు, పోలీసు దాడులు. రాష్ట్రంలో 11 పెద్ద ప్రాజెక్టులు, 13 వేల కోట్ల విలువైనవి చెరువుల్లో కడుతున్నారు, ఆపాలి అని భట్టి అన్నారు. భట్టి ప్రెస్ మీట్, సీఎం సెటిల్మెంట్.

ఉద్యోగ సంఘాలపై ఏసీబీ దాడులు.. దేశంలో అత్యధిక డీఏలు పెండింగ్ లో ఉన్న రాష్ట్రం మన తెలంగాణ. చివరకు జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ప్రజలను కూడా బ్లాక్ మెయిల్ చేస్తున్నాడు. చేసింది చెప్పుకునేది లేక జూబ్లీహిల్స్ నాయకులు, ప్రజలను బ్లాక్ మెయిల్ చేస్తున్నాడు.. చివరకు ప్రజలను బెదిరిస్తున్నారు. పథకాలు ఆగిపోతాయి అని. బ్లాక్ మెయిలర్ రేవంత్ రెడ్డికి బుద్ధి చెప్పాలి.

నేను సవాల్ విసిరుతున్నా కంటోన్మెంట్ లో ఏం చేశారో చూపెట్టాలని. రెండేళ్లలో ఎందుకు మైనార్టీ మంత్రి పదవి ఇవ్వలేదు? ఎందుకు డబుల్ బెడ్ రూమ్ లు ఇవ్వలేదు? ఎన్నికలు రాగానే ఎన్టీఆర్, పీజేఆర్ గుర్తు వస్తాడు. కొల్లూరు డబుల్ బెడ్ రూమ్ ఏనాడైనా వెళ్లారా? ఇప్పుడు మంత్రులు అందరూ లైన్ పడుతున్నారు. ప్రశ్నించే గొంతును గెలిపించాలి. మూసి, హైడ్రా పేరిట ఇల్లు కూల్చితే నిలబడ్డది బి ఆర్ ఎస్

శాంతిభద్రతల నిర్వహణ లేకుండా పోయింది. నడి రోడ్డుపై మర్డర్లు జరుగుతున్నాయి. మొన్న జగద్గిరిగుట్ట లో నడిరోడ్డుపై మిట్ట మధ్యాహ్నం దారుణంగా కత్తితో దాడి చేస్తే ఒక యువకుడు చనిపోయిండు. రాష్ట్రమంతా ఆ దృశ్యాలను చూసింది. రక్తపు మరకలు ఇంకా పోలేదు. పోలీసులకు జీతాలు, బెన్ఫిట్స్ ఇవ్వకుండా వారికి నరకం చూపిస్తున్నడు. రేవంత్ రెడ్డి పాలనలో అన్ని రంగాల్లో తిరోగమనం, ఒక్క క్రైంలో మాత్రమే పురోగమనం.

ఏ రంగం నమోదు చేయలేని వృద్ధి పోలీసు శాఖ నమోదు చేసింది. 2025 జనవరి నుంచి సెప్టెంబర్ వరకు రాష్ట్రంలో నమోదైన క్రైం రేటు చూస్తే రేవంత్ ఘనత ఏపాటిదో అర్థమైతది. మొత్తం 189 మర్డర్లు జరిగితే, అందులో 88 నడిరోడ్డుపై, అందరూ చూస్తుండగా జరిగిన హత్యలు. 1700 కిడ్నాప్లు, 123 రేప్ కేసులు, 1051 దొంగతనాలు, 6411 ఇండ్లలో దొంగతనాలు, మహిళల పట్ల జరుగుతున్న నేరాల శాతం 12.3 % పెరిగాయి.. గడిచిన ఏడాదితో పోల్చితే అత్యాచారాలు



28శాతం, కిడ్నాపులు 26శాతం. ఇప్పుడు సైబరాబాద్‌లో 41 శాతం, హైదరాబాద్‌లో 60 శాతం క్రైమ్ రేటు పెరిగింది. తెలంగాణలో 22శాతం క్రైం రేటు పెరిగినట్లు పోలీసు యాన్యువల్ రిపోర్టే స్పష్టం చేసింది..

మహారాష్ట్రలోని ముంబై పోలీసులు.. హైదరాబాద్‌లోని చర్లపల్లిలో వేల కోట్ల విలువైన డ్రగ్స్ పట్టుకున్నారంటే అంతకంటే అవమానం ఉంటుందా? రేవంత్ రెడ్డి... మున్సిపల్ మంత్రిగా ఫెయిల్. విద్యా మంత్రిగా ఫెయిల్. హెూం మంత్రిగా ఫెయిల్.. టోటల్ గా రేవంత్ రెడ్డి సీఎం గా అట్టర్ ఫెయిల్. మంత్రులకు నమ్మకం లేదు రేవంత్ రెడ్డి మీద, ప్రభుత్వం మీద. ఒక ఎమ్మెల్యే ప్రపంచ బ్యాంకుకు నిధుల కోసం లేఖ రాసిండు. బిజెపి ఎట్లా ఏం చేసేది లేదు.


కాంగ్రెస్ అభ్యర్థి సోదరుడు వెంకట్ యాదవ్ కు మూడు ఓట్లు ఉన్నాయి అని ఎన్నికల కమిషన్ కు ఇస్తే యాక్షన్ లేదు. ఓట్ చోరీ అనే రాహుల్ గాంధీ ఎందుకు ఇక్కడ ఓటు చోరీ గురించి మాట్లాడడు? కాంగ్రెస్ నాయకులే షబ్బీర్ అలీ బీహార్ లో బిజెపి బి టీమ్ ఏం ఐ ఎం అంటాడు. ఇక్కడ కాంగ్రెస్ బి టీమ్ ఎవర్ని మోసం చేస్తున్నారు? జమాత్ ఉల్మా హింద్ అజాద్ కోసం లొల్లి చేసింది. అప్పుడు కాంగ్రెస్ ఎక్కడ ఉంది? తప్పుడు వ్యాఖ్యలు చేసిన రేవంత్ రెడ్డి ముస్లింలకు వెంటనే క్షమాపణ చెప్పాలి. 4000 కోట్ల బడ్జెట్ ఏమైంది. ఇమాం మౌజం గౌరవ వేతనాల పెంపు ఏమైంది

రాంరెడ్డి వెంకట్ రెడ్డి చనిపోతే అక్కడ వారి భార్యను నిలబెడితే రండ రాజకీయం అన్నడు రేవంత్ రెడ్డి. ఈరోజు జూబ్లీహిల్స్ లో సునీత ని నిలబెడితే దారుణంగా మాట్లాడుతున్నావు. పిల్లల మీద కేసులు పెడుతున్నావు. తులం బంగారం ఉత్తదే అని మొన్న మంత్రి మాట్లాడాడు. ఢిల్లీకి మూటలు మోయడం తప్ప, నువ్వు చేసింది ఏముంది రేవంత్

అన్ని సర్వేలు బి ఆర్ ఎస్ గెలుస్తుంది అని స్పష్టం చేస్తున్నాయి. సైలెంట్ వేవ్ రాబోతున్నది జూబ్లీహిల్స్ ఎన్నికల్లో. నిశ్శబ్ద విప్లవం రాబోతున్నది. బిఆర్ఎస్ గెలిపించాలని జూబ్లీహిల్స్ ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాం.

# హిందువులంతా తమ సత్తా కాంగ్రెస్‌కు రుచి చూపాలి

**- బండి సంజయ్ కుమార్**



హైదరాబాద్, నవంబరు 7 (అక్షర గళం): ఎన్నికల కమిషన్, పోలీసు అధికారులు నిష్పక్ష పాతంగా వ్యవహరించడం లేదు. కాంగ్రెస్, బీఆర్ఎస్ లకు కొమ్ముకాస్తున్నారు...సిగ్గు చేటు. తెలంగాణలో అధికార, ప్రతిపక్ష పార్టీలు కలిసి పనిచేస్తున్నాయని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆరోపిం చారు. ఈ మేరకు ఆయన శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ మల్క కొమరయ్య, బీజేఎల్పీ ఉప నాయకుడు పాయల శంకర్, గంగిడి మనోహర్ రెడ్డి, బీజేపీ ఎస్సీ మోర్చా కార్యదర్శి ఎస్.కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు వేముల అశోక్, అధికార ప్రతినిధులు జె.సంగప్ప, సోలంకి శ్రీనివాస్, రితేష్ రాథోడ్ లతో కలిసి మాట్లాడారు. కూడబలుక్కునే ఒకరికొకరు తిట్టుకుంటున్నారు. మేం ప్రచార సభలకు అనుమతి కోసం దరఖాస్తు చేస్తే జాప్యం చేస్తూ చివరి నిమిషంలో రద్దు చేస్తున్నారు. ఈరోజు మీనాక్షిపురం(రహమత్ నగర్)లో సాయంత్రం సభకు పర్మిషన్ ఇవ్వాలని ఈనెల 4న దరఖాస్తు చేసుకున్నాం. గురువారం వరకు స్పందించలేదని దుమ్మెత్తిపోశారు. పొద్దున ఫోన్ చేసి అనుమతి ఇవ్వడం లేదని, వేరేచోట పెట్టుకోవాలని చెబుతున్నారు. మేం ఎక్కడ సభ పెట్టుకోవాలో కూడా వాళ్లే మాకు చెబుతున్నరంటే ఏమనాలి? కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు మాత్రం ఎక్కడ అడిగితే అక్కడ మీటింగ్‌కు అనుమతి ఇస్తున్నారన్నారు. ఆయన ఇంకా ఏమన్నారంటే... చివరి నిమిషంలో ఎక్కడైనా అనుమతి ఇచ్చినా కండీషన్లు పెడుతున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు డీజేలు పెట్టుకోవడానికి, హంగామా చేయడానికి మాత్రం అనుమతి ఇస్తారు. ఇదేం ద్వంద్వ వైఖరి? బీజేపీ సభలకు అనుమతిస్తే... ఒక వర్గం ఓట్లు రావనే భయం కాంగ్రెస్, బీఆర్ఎస్ లకు పట్టుకుంది. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండు సీట్లను బీజేపీ గెలుచుకుంది. జూబ్లీహిల్స్ లో బీజేపీ గెలవకూడదనే కుట్రతోనే మా సభలకు అనుమతి ఇవ్వడం లేదు. దొంగ సర్వేల పేరుతో బీజేపీ పోటీలో లేదంటూ తప్పుడు ప్రచారం చేయిస్తున్నారు.

ప్రజల ఆలోచన మాత్రం కాంగ్రెస్, బీఆర్ఎస్ లకు గుణపాఠం చెప్పాలని ఎదురు చూస్తున్నాయి. ఈ విషయం తెలిసే కాంగ్రెస్ పార్టీ ముస్లింల మెప్పు పొందేందుకు యత్నిస్తోంది. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో బీజేపీ వర్సెస్ ఐఎంసీ(ఇండియన్ ముస్లిం కాంగ్రెస్) మధ్యే పోటీ ఉంది. కాంగ్రెస్ ముస్లిం ఓట్లు కోసం మాత్రమే యత్నిస్తోంది.

హిందువులంతా తమ సత్తా ఏమిటో కాంగ్రెస్ కు రుచి చెప్పాలని కోరుతున్నా. బీఆర్ఎస్ పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ ముందే చేతులెత్తేసింది. జూబ్లిహిల్స్ ప్రజలారా... అభివృద్ధి కావాలా? అరాచక కావాలా? తేల్చుకోండి. కాంగ్రెస్ గెలిస్తే మజ్లిస్ గెలిచినట్లే...అరాచకాలు, అక్రమాలకు తావిచ్చినట్లే. సీఎం రేవంత్ రెడ్డి ఓట్ల కోసం దిగజారి మాట్లాడుతున్నరు. కాంగ్రెస్ అంటేనే ముస్లింలు అని చెబుతున్నారు. దేశ జవాన్లను అవమానించేలా, హేళన చేసేలా మాట్లాడారు.

# వందేమాతరం...భారతీయుల జీవన జ్యోతి

**- 150 వార్షికోత్సవాల్లో రామ్ చందర్ రావు**

హైదరాబాద్, నవంబరు 7 (అక్షర గళం): వందేమాతరం గేయం 150 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా, దేశవ్యాప్తంగా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల ఏడోతేదీ నుండి 25 వరకు 'వందేమాతరంఏ150' పేరుతో పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిల్లో ఘనంగా ఉత్సవాలు జరుగుతున్నాయి. హనుమాన్ వ్యాయామశాల వద్ద నిర్వహించిన "వందేమాతరంఏ150"




కార్యక్రమానికి బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామ్ చందర్ రావు, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్, ఎంపీ డీకే అరుణ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామ్ చందర్ రావు మాట్లాడారు.

వందేమాతరం గేయం 150వ వార్షికోత్సవం సందర్భంగా దేశ ప్రజలందరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు.

వందేమాతరమ్ అంటే భరతమాతకు వందనం. మన రాష్ట్ర యువత, విద్యార్థులు వందేమాతరం గీతం అసలైన మహత్తును అర్థం చేసుకోవాలి. వందేమాతరం కేవలం ఒక గేయం మాత్రమే కాదు.. అది భారతీయుల జీవన జ్యోతి. మన దేశ స్వాతంత్ర్య సమరానికి ప్రేరణనిచ్చిన శక్తిగా వందేమాతరం గేయం నిలిచింది. ఆ జ్వాల, ఆ ప్రేరణ మనలో ప్రతి రోజూ సజీవంగా ఉండాలి. ప్రధాని నరంద్ర మోదీ పిలుపునిచ్చిన విధంగా.. స్వాతంత్ర్య పోరాటం జరిగిన రోజుల్లో ప్రజలు ఒకరినొకరు ఐక్యతను చాటిచెప్పేలా 'వందేమాతరం' అని అభివాదం చేసేవారు. అదే ఉత్సాహం, ఆ భావం ప్రతి భారతీయుడిని, ప్రతి తరానికి స్ఫూర్తిగా నిలవాలి.

# సంపాదకీయం..

## స్వాతంత్రోద్యమంలో ప్రేరణ మంత్రం వందేమాతరం!


ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాల్లో వందేమాతరం తరవాత భారతదేశం నా మాతృభూమి..అంటూ ప్రతిజ్ఞ చేయించేవారు. వందేమాతరం చదివిన తరవాతనే పాఠశాల తరగతి గదులు ప్రారంభం అయ్యేవి. ఆనాటి నిబద్ధత ఇప్పుడు ప్రైవేట్ స్కూళ్లు వచ్చాక కనుమరుగయ్యింది. జగనమన కూడా మనదేశ ఆత్మగా నిలిచింది. ఈ రెండు గీతాలకు భారతదేశంలో విడదీయరాని సంబంధం ఏర్పడింది. దేశాన్ని ఏకతాటిపై నడిపించిన వందేమాతరం గీతానికి 150 వత్సరాలు. నిత్యనూతనంగా ఇప్పటికీ వందేమాతరం మార్మోగు తోంది. దేశాన్ని కట్టిపడేసే ప్రార్థనాగీతంగా ఇది ఎంతో ప్రాముఖ్యం కలిగించింది. స్వాతంత్య్ర ఉద్యమ శ్లోకంగా నిలిచి నేటికీ జాతీయ గీతంగా



భాసిల్లుతోంది. వందేమాతర గీతం తరవాతనే దేశవ్యాప్తంగా ఉత్తేజిత మొదలయ్యింది. బ్రిటిష్ వారిని పారదోలేందుకు ఇది ఎంతగానో తోడ్పడింది. ప్రజలను ఏకం చేయడంలో వందేమాతర గీతం నిష్కళంకితంగా మండింది. ఎక్కడిక్కడ వందేమాతరం గీతాలాపనతో ప్రజలు ఉద్యమంలో దుమికారు. అందుకే ఆనాటి బ్రిటిష్ పాలకులు వందేమాతర గీతం పాడిన వారిపై దమనకాండకు తెగించారు. 1875లో కార్తిక శుక్ల నవమి, జగద్ధాత్రి పూజనాడు బంకించంద్ర ఛటర్జీ కలం నుంచి జాలువారిన వందేమాతర గీతం... సాతంత్య్ర ఉద్యమానికి ప్రేరణగా నిలిచింది. భారతదేశ పురాతన సాంస్కృతిక మూలాలు ఈ గీతరచనకు ప్రేరణనిచ్చాయి. సర్వ మంగళ మాంగళ్యే శివే... అంటూ సాగే దేవీమాత స్తోత్రం వందేమాతరం గీతానికి ప్రేరణగా భావిస్తారు. అందుకే కొందరు దీనిని పాడటానికి ఇప్పటికీ ఇష్టపడరు. ఇది మనదేశ దౌర్భాగ్యంగా చూడాలి. మతం ముసుగులో కొందరు దీనిని తృణీకరించినా అది ప్రజ నరనరాల్లో జీర్ణించుకుపోయిన ఉత్తేజిత గీతంగా నిలిచింది. భారతదేశ చరిత్రలో మహోద్యమాలకు కలాల పాటలూ అంతర్భాగాగా నిలిచిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. అంతెందుకు తెలంగాణ ఉద్యమంలో పాటే పరుగుల్లు తొక్కపోతే ఉద్యమమే లేదు. జాతి భావోద్వేగాలను వెన్నుతట్టి స్వాతంత్య్ర కాంక్ష అనే సమిష్టి కార్యాచరణ కు పురిగొల్పడంలో వందేమాతరం గీతం కీలకభూమిక పోషించింది. అందుకే భారత స్వాతంత్య్ర పోరాటంలో అత్యంత ప్రత్యేకమైనదిగా వందేమాతరం గీతం నిలిచింది. ఈ అమర గీతం వెలువడి 150 సంవత్సరాలైనసందున ఏడాదిపాటు దేశమంతట ఉత్సవాలు నిర్వహించాలని కేంద్రం నిశ్చయించింది. స్వాతంత్య్ర ఉద్యమానికి జవజీవాలు అందించడమే కాదు, సాంస్కృతిక జాతీయవాదానికి బీజం వేసింది. భారతదేశమంటే మట్టి కాదని... కర్తవ్యం, అంకితభావాలతో పునీతమైన పుణ్యక్షేత్రమని ప్రబోధించింది. మహర్షి అరవిందుడు వర్ణించినట్లు– బంకించంద్రుడు ఆధునిక భారత రుషి. ఆయన పదాలు జాతి ఆత్మను మళ్లీ మేల్కొలిపాయి. నిదురిస్తున్న జాతి తన ఆత్మబలాన్ని కనుగొనేలా జాగృతం చేయడంలో వందేమాతరం గీతం ప్రముఖ భూమిక పోషించడనడంలో సందేహం లేదు. బ్రిటిష్ పాలకుల ఇనుప ఉక్కు సంకెళ్ల కింద నలిగిపోతున్న తరుణంలో బంకించంద్ర ఛటర్జీ రచించిన వందేమాతరం జాతికి ప్రభాత గీతమైంది. మన సంస్కృతి, నాగరికతల పట్ల గర్వాభిమానాలను రేకెత్తించే గానమైంది. అణువణువునా మాతృభూమిపై భక్తి, అనురక్తి ఉట్టిపడేలా మేల్కొలిపే రణనినాద గీతమైంది. వందేమాతరం భాషా ప్రాంతీయ భేదాలకు అతీతంగా కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు జాతిని జాగృతం చేసింది. బ్రిటిష్ వలస పాలకులపై ధిక్కార ప్రకటనగా ప్రజలు యావద్దేశంలో వందేమాతరం అంటూ నినదించారు. 1905లో బెంగాల్ విభజనపై నిరసన వెల్లువెత్తినప్పుడు వందేమాతరం అంటూ మార్మోగింది. దాంతో బ్రిటిష్ పాలకులు ఆ పాటను నిషేధించారు. కానీ, 1906 ఏప్రిల్ 14న బారిసాల్‌లో వేలాది ఉద్యమకారులు ఆ నిషేధాన్ని ధిక్కరించి వందేమాతరం అంటూ ఘోషించారు. లాఠీ దెబ్బలకు రక్తమోడుతున్నా లెక్కచేయకుండా స్త్రీపురుషులు అలా ఘోషిస్తూనే ఉన్నారు. 1946లో తిరుగుబాటు చేసిన రాయల్ ఇండియన్ నేవీలోని భారతీయ నావికులు వందేమాతరం అంటూ నినదిస్తూ బ్రిటిష్ యుద్ధనౌకలపై జాతీయ పతాకను ఆవిష్కరించారు. ముద్దునిద్రలో ఉన్నవారినైనా మేల్కొలిపే మంత్రశక్తి వందేమాతరానికి ఉందని మహాత్మాగాంధీ పేర్కొన్నారు. ఇన్నేళ్లయినా వన్నె తగ్గకుండా మనజీవితాల్లో అది పెనవేసుకుపోయింది. భారతజాతిని కలిపి ఉంచే గీతంగా నిలిచింది. స్వాతంత్య్ర ఉద్యమంలో వెలిగిన ఈగీతజ్యోతి ఇంకా జాజ్వల్యమానంగా వెలుగుతోంది. ఇప్పుడు ఏడాది ఉత్సవాల్లో భాగంగా వందేమాతరం పూర్తిరూపంలో ప్రతిధ్వనిస్తూ యువత మనసుల్లో సాంస్కృతిక జాతీయవాదాన్ని నింపుతుందనడంలో సందేహం లేదు. వందేమాతరం కేవలం గత వైభవ స్మరణం కాదు. మనజాతిని మేల్కొలిపే ఉజ్వల భవిష్యత్తుకు ప్రేరణగానూ తీసుకోవాలి. భారత ఆత్మను ఆవిష్కరించుకునే గీతంగా చూడాలి. ఘనమైన భారతదేశ సంస్కృతీ నాగరికతలపై మనకున్న అభిమానాలకు నిదర్శనమైన ఆ గీతస్ఫూర్తిని ఆచరణలోకి తీసుకురావడం మనందరి బాధ్యత. వందేమాతరం పారతంత్ర భారతదేశానికి తొలి మేల్కొలుపు. మొక్కవోని దీక్షను చాటిన స్వేచ్ఛా గీతమది. భారతదేశపు ఆత్మ నుంచి జనించిన ఈ గీతం అజరామరంగా నిలుస్తుంది. తరతరాలకు ఉత్తేజమిస్తుంది. భారతీయత అనే కోణం నుంచి మన చరిత్ర, సంస్కృతి, విలువలు, సంప్రదాయాలను వీక్షించి... నిరంతరం స్ఫూర్తి పొంది... సదా కార్యాచరణలో నిమగ్నం కావాలని ప్రబోధించే దివ్య గానంగా వందేమాతరం నిరంతర స్మరణ కావాలి. పాలకులు దీన్ని ప్రేరణగా తీసుకుని భారత పునరుజ్జీవానికి అంకితం కావాలి. కేవలం గీతాలాపనతో సరిపుచ్చక భారత ఉజ్వల భవిష్యత్‌కు ప్రేరణగా తీసుకోవాలి. దేశంముందు వందనం చేయడంతో పాటు, సంకల్ప సిద్ధి కోసం వందేమాతరం గీతాన్ని ఆలపించాలి. దేశీయంగా స్వయం సమృద్ధి సాధించేందుకు నేటికీ ఇది ప్రేరణ మంత్రంగా నిలవాలని ఆశిద్దాం.

## తొలి ట్రిలియనీర్‌గా టెస్లా సీఈవో మస్క్!

ప్రపంచంలో అత్యంత సంపన్నుల జాబితిలో ఎలాన్ మస్క్ తొలి స్థానంలో ఉన్నారు. ఆయన అపర కుబేరుడిగా నిలిచారు. ఈ క్రమంలో ఎలాన్ మస్క్ మరో ఘనత సాధించేందుకు సిద్ధమవుతున్నారు. టెస్లా సీఈవోకు ట్రిలియన్ డాలర్ల వేతన ప్యాకేజీ ఇచ్చేందుకు కంపెనీ వాటాదారులు అంగీకరించారు. దీంతో త్వరలోనే ప్రపంచంలో తొలి ట్రిలియనీర్‌గా మస్క్ చరిత్ర సృష్టించే అవకాశాలు కన్పిస్తున్నాయి. టెస్లా ఇప్పటికే భారత్‌లోనూ అడుగిడింది. టెస్లా కార్లకు ఇక్కడా గిరాకీ ఏర్పడింది. దీనికితోడు ఎగిరే కార్లను ప్రవేశ పెడతానని అన్నారు. గురువారం టెస్లా (కంపెనీ వార్షిక సమావేశం జరిగింది. ఈ క్రమంలో మస్క్‌కు భారీ ప్యాకేజీ ఇచ్చేందుకు 75 శాతం మందికి పైగా షేర్ హోల్డర్స్ అంగీకరించినట్లు తెలుస్తోంది. ప్యాకేజీ ప్రకటన వెలువడిన అనంతరం మస్క్ ఆనందంలో మునిగిపోయారు. ఈ క్రమంలో రోబోతో కలిసి వేదికపై డ్యాన్స్ చేశారు. దీనికి సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ అవుతుంది. ఈ క్రమంలో మస్క్ మాట్లాడుతూ.. తనకు మద్దతుగా ఓట్లు వేసిన వాటాదారులకు హృదయ పూర్వక కృతజ్ఞతలు



తెలిపారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు. ఈ ప్రకటన నేపథ్యంలో టెస్లా షేర్లు పెరిగినట్లు రాయిటర్స్ పేర్కొంది. మస్క్ కనీసం ఏడున్నర సంవత్సరాలు టెస్లాలో ఉండేలా చూసుకోవడమే లక్ష్యంగా తాజా ప్యాకేజీని ప్రకటించినట్లు తెలుస్తోంది. సెప్టెంబరులో దీన్ని ప్రవేశపెట్టినప్పుడు టెస్లాలో మస్క్ వాటా 12 శాతంగా ఉంది. అది ఇప్పుడు 25 శాతానికి పెరిగే అవకాశాలు కన్పిస్తున్నాయి. అలా అయితే ఆయన వేతనం రోజుకు 237 మిలియన్ డాలర్లకు చేరుతుంది. ప్రపంచంలో ఇప్పటివరకు జరిగిన అతిపెద్ద వేతన డీల్‌గా ఇది రికార్డు సృష్టించనుంది. మస్క్ ప్యాకేజీని పెంచే విషయంపై టెస్లా బోర్డు వాటాదారులకు కీలక హెచ్చరికలు చేసినట్లు తెలుస్తోంది. దీనికి మద్దతిచ్చేందుకు తిరస్కరిస్తే.. ఆయన కంపెనీ నుంచి వైదొలగవచ్చని పేర్కొంది.

# అన్నదాతకు అండగా ఉండటానికి ఎన్జీరంగానే స్ఫూర్తి

- రైతు బాంధవుడిగా ఎన్జీరంగా అందరికీ ఆదర్శం
- గత పాలకులు రైతుల్ని రోడ్డున పడేశారు- పంటల బీమా ఎగ్గొట్టారు
- రాష్ట్రంలో ఏ ఒక్క రైతూ అధైర్య పడొద్దు
- ధాన్యం కొన్న 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నాం
- ఎన్జీ రంగా 125వ జయంతి ఉత్సవాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు
- ఆధునిక రాజ్యాంగ సంస్థలు పుస్తకాన్ని ఆవిష్కరించిన సీఎం




రైతు సంక్షేమానికి ఎన్డీఏ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఏపీ సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. వ్యవసాయ రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గుంటూరులో ఆచార్య ఎన్జీ రంగా 125వ జయంతి ఉత్సవాలకు ముఖ్య అతిథిగా సీఎం హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..."వందేమాతర గేయానికి 150 ఏళ్లు పూర్తయిన రోజునే ఆచార్య ఎన్జీ రంగా 125వ జయంతి జరుపుకోవడం ఆనందంగా ఉంది. రంగా జీవితం మనందరికీ ఆదర్శం. స్వాతంత్ర్య పోరాటంలో వెనకబడిపోతామనే కారణంతో పిల్లలనే వద్దనుకున్నారు రంగా దంపతులు. ఆక్స్ ఫర్డ్ యూనివర్సిటీలో చదువుకున్నప్పటికీ ఆయన జీవితమంతా స్వాతంత్ర్య సాధనకు, రైతు సంక్షేమానికి కృషి చేశారు'అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.

### ఎన్జీ రంగాతో నాది ప్రత్యేక అనుబంధం

'ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నేను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు హైదరాబాద్ వ్యవసాయ యూనివర్సిటీకి ఎన్జీ రంగా పేరు పెట్టాం. విభజన తర్వాత నవ్యాంధ్రలో వ్యవసాయ వర్సిటీకీ ఆయన పేరు పెట్టాం. రూరల్ డెవలప్ మెంట్‌పై నేను పీహెచ్‌డీ చేయాలనుకున్నప్పుడు రంగా రచనలు, అధ్యయనాలే నాలో స్ఫూర్తిని నింపాయి. 33 ఏళ్ల వయసులోనే ఆయన ఆంధ్ర రైతాంగ ఉద్యమాన్ని ముందుండి నడిపించారు. వెంకటగిరి జమీందారీ అణచివేతకు వ్యతిరేకంగా రైతుల పక్షాన నిలిచారు. 1964లో 17వ రాజ్యాంగ సవరణకు వ్యతిరేకంగా పార్లమెంటులో ప్రసంగించి రైతు భూమిని కట్టడి చేసే చట్టాన్ని ఆయన ఆపారు. ఎన్జీ రంగా 50 ఏళ్ల పాటు పార్లమెంటెరియన్ గా చేసిన సేవలకు గాను గిన్నిస్ వరల్డ్ రికార్డులకు ఎక్కడం అరుదైన గౌరవం'అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.

### రైతు సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

'తెలుగుదేశం ప్రభుత్వం ఎప్పుడు అధికారంలో ఉన్నా రైతు సంక్షేమం కోసమే పనిచేస్తుంది. ఇప్పుడు ఎన్డీఏ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తోంది. రైతుకు ఆదాయం పెరగాలంటే ఖర్చు తగ్గి ఉత్పత్తి పెరగాలి. 2014-2019 మధ్య కాలంలో వ్యవసాయ రంగం జీఎస్ డీపీలో 16.6 శాతం వృద్ధి రేటు సాధించింది. గత ఐదేళ్ల పాలనలో 10 శాతానికి తగ్గిపోయింది. 2024-25లో 15.45 శాతానికి పెంచాం. గత ప్రభుత్వ అసమర్థ పాలనతో రైతులు రోడ్డున పడ్డారు. రబీలో 48 లక్షల ధాన్యం కొనుగోలుకు రూ. 6 వేల కోట్లు మాత్రమే చెల్లించి రూ. 1,674 కోట్లు బకాయిలు పెట్టారు. ఎన్డీఏ ప్రభుత్వం వచ్చాక ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ బకాయిలు క్లియర్ చేశాం. 2024 -25లో 55 లక్షల 79 వేల టన్నుల ధాన్యాన్ని రూ. 12,857 కోట్లకు కొనుగోలు చేశాం. 8 లక్షల రైతులకు 24 గంటల్లోనే వారి అకౌంట్లకు నగదు జమ చేశాం. అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.7 వేలు జమ చేశామని ముఖ్యమంత్రి తెలిపారు.

### 95 శాతం పంట బీమా చెల్లించాం

' ప్రభుత్వ యంత్రాంగం సహకారంతో టెక్నాలజీ వినియోగించి ఇటీవల తుఫాను నష్టాన్ని గణనీయంగా తగ్గించాం. విపత్తుల్లో నష్టపోయిన రైతులకు 2014-19లో హెక్టారుకు రూ. 20 వేలు అందిస్తే గత ప్రభుత్వం దాన్ని రూ. 17 వేలకు తగ్గించింది. ఎన్డీఏ ప్రభుత్వం రాగానే రూ. 25 వేలకు పెంచాం. మూడేళ్లు పంటల బీమా సొమ్ము ఎగ్గొట్టినవారు విమర్శలు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి రాగానే 95 శాతం పంట బీమా చెల్లించాం. మామిడికి రూ. 240 కోట్లు అదనంగా గిట్టుబాటు ధర ఇచ్చాం.

పొగాకుకు రూ.273 కోట్లు ఖర్చు చేశాం. కోకో రైతుకు రూ. 14 కోట్లు ఇచ్చాం. కాఫీకి 50 కేజీల చొప్పున ఎకరాకు రూ. 5 వేలు ఇచ్చాం. మిర్చికి రూ. 130 కోట్లు, టమాటాకు రూ. 12 కోట్లు, ఉల్లి దెబ్బ తిన్న చోట హెక్టారుకు రూ. 50 వేల చొప్పున రూ. 100 కోట్లు వ్యయం చేశామని ముఖ్యమంత్రి వివరించారు.


### సమర్థ నిర్వహణతోనే నీటి భద్రత

సమర్థ నీటి నిర్వహణ, ముందస్తు చర్యల వల్ల రిజర్వాయర్లు 95 శాతం నిండాయి. గత ప్రభుత్వంలో రిజర్వాయర్ల గేట్లను కూడా నిర్వహించలేకపోయారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో జలాశయాలను పూర్తిచేశాం. రాయలసీమలో కరువును జయించాం. రైతులు పండించిన పంటకు గిట్టుబాట ధర కల్పిస్తున్నాం. డ్రిప్ ఇరిగేషన్ సబ్సిడీ ఇస్తున్నాం. ఎస్సీ, ఎస్టీ రైతులకు వందశాతం సబ్సిడీ,మిగిలిన వారికి 50 నుంచి 90 శాతం సబ్సిడీ ఇస్తున్నాం. కౌలు రైతులు అధైర్యపడొద్దు. ఆత్మహత్యలు చేసుకోవద్దు. అన్ని విధాలా ఆదుకుంటాం. మారిన ఆహారపు అలవాట్లకు అనుగుణంగా పంటల మార్పిడి చేసుకోవాల్సిన అవసరం ఉంది.

మనం పండించిన పంటలను కొన్ని దేశాలు దిగుమతి చేసుకోవడానికి ఇష్టపడటం లేదు. అందుకు కారణం రసాయన ఎరువుల వాడకమే. సేంద్రీయ వ్యవసాయంపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో పాటు, పంటలకు సేంద్రీయ ఎరువులను మాత్రమే వినియోగించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు రైతులకు సూచించారు. అనంతరం ఆధునిక రాజ్యాంగ వ్యవస్థలు అనే పుస్తకాన్ని సీఎం చంద్రబాబు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి మంత్రి కె.అచ్చెన్నాయుడు, ఎంపీ లావు కృష్ణ దేవరాయలు, వ్యవసాయ విశ్వవిద్యాలయ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు, వ్యవసాయ రంగ నిపుణులు, తదితరులు హాజరయ్యారు.

# హైడ్రోజన్ బాంబ్' పేలిందా?

హర్యానా శాసనసభ ఎన్నికలు ముగిసిన తర్వాత భారత రాజకీయాల్లో తీవ్ర కలకలం. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ 'హైడ్రోజన్ బాంబ్' పేరుతో బిజెపిపై ఓటు చోరీ ఆరోపణలు చేశారు. ఈ ఆరోపణలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ప్రఖ్యాత మీడియా ఛానెల్స్ ఈ విషయంపై తీవ్రంగా స్పందించాయి. దేశీయ, విదేశీ మీడియా కవరేజ్ ఈ ఆరోపణల




లోతును తెలియజేస్తోంది. ఎన్నికల కమిషన్‌పైనా ప్రశ్నలు లేవనెత్తారు. రాహుల్ గాంధీ ఆరోపణలు తీవ్రమైనవి. హర్యానాలో 25 లక్షల నకిలీ ఓట్లతో బిజెపి గెలిచిందని చెప్పారు. ఓటరు జాబితాల్లో డూప్లికేట్‌లు, తప్పు చిరునామాలు, నకిలీ ఫోటోలు ఉన్నాయని పేర్కొన్నారు. ఒకే ఫోటోతో 22 ఎంట్రీలు, బ్రెజీలియన్ మోడల్ ఫోటోను ఉపయోగించి స్వీటీ, సీమ, సరస్వతి వంటి పేర్లు పెట్టారని ఆరోపించారు. ఈ మహిళ ఫోటో 10 పోలింగ్ బూత్‌ల్లో కనిపించిందని, అక్కడ కాంగ్రెస్ ఓడిపోయిందని చెప్పారు. ఒకే నియోజకవర్గంలో 100 ఓటర్ కార్డులు ఒకే ఫోటోతో ఉన్నాయని హైలైట్ చేశారు. మరో మహిళ ఫోటో 223 సార్లు కనిపించిందని తెలిపారు.

ఒక ఇంట్లో 501 మంది ఓటర్లు, ఉత్తరప్రదేశ్ నుంచి వచ్చినవారికి ఓటు హక్కు కల్పించారని ఆరోపణ. ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, ప్రధాని మోడీ, అమిత్ షా మధ్య సంప్రదింపులు జరిగాయని కూడా చెప్పారు. ఎగ్జిట్ పోల్స్‌లో కాంగ్రెస్ గెలుపు అంచనా వచ్చినా, ఫలితాలు బిజెపికి ఎక్కువని గుర్తు చేశారు. హర్యానా సిఎం నాయబ్ సింగ్ సైనీ ఏర్పాట్ల వార్తలు, బిజెపి గెలవబోతుంది అన్న వీడియోను రుజువుగా చూపించారు. పోస్టల్ ఓటింగ్‌లో అసాధారణ తేడాలు, 8 నియోజకవర్గాల్లో స్వల్ప తేడాతో ఓడిపోవడం, మొత్తం 22,779 ఓట్ల తేడాతో పరాజయం – ఇవన్నీ 'ఆపరేషన్ సర్కార్ చోరీ'లో భాగమని ఆరోపించారు. దేశీయ మీడియా ఈ ఆరోపణలపై తీవ్రంగా స్పందించింది. ఎన్‌డిటివి ఎడిటర్ రవిష్ కుమార్ రాహుల్ గాంధీ ఆరోపణలు భారత ప్రజాస్వామ్యానికి ముప్పు. 25 లక్షల నకిలీ ఓట్లు అంటే ప్రతి 8 మందిలో ఒకరు నకిలీ. ఎన్నికల కమిషన్ ఈ ఆరోపణలకు సమాధానం చెప్పాలి అని కామెంట్ చేశారు.

ఇండియా టుడే చానెల్‌లో రజత్ శర్మ 'హైడ్రోజన్ బాంబ్' పేరు భయపెట్టేలా ఉంది. కానీ ఆధారాలు రుజువైతే, ఇది ఎన్నికల వ్యవస్థపై పెద్ద ప్రశ్న. బిజెపి ఖండన తప్పుడు మాత్రమే కాదు, విచారణ కావాలి అని మండిపడ్డారు. టైమ్స్ నౌ డిబేట్‌లో అర్నబ్ గోస్వామీ రాహుల్ ఓటు చోరీ ఆరోపణలు ఎక్కువ, ఆధారాలు తక్కువ అని అన్నారు. కానీ బ్రెజిల్ మోడల్ ఫోటో విషయం ఆసక్తికరం. ఎక్స్‌పోజ్ చేయాలి అని ప్రశ్నించారు. ఎబిపి న్యూస్‌లో ప్రణబ్ రాయ్ 'కాంగ్రెస్ ఘన విజయాన్ని ఓటమిగా మార్చారు. ఎన్నికల కమిషన్ బిజెపి సాథీభావం చూపిందా? 35 లక్షల ఓట్లు తొలగించారని ఆరోపణ తీవ్రమైంది' అని అన్నారు. రిపబ్లిక్ టివిలో అర్ణబ్ మళ్లీ 'రాహుల్ వైఫల్యాలను కవర్ చేసుకోవడానికి ఎన్నికల కమిషన్‌ను టార్గెట్ చేస్తున్నారు. కానీ నకిలీ ఓట్ల ఆధారాలు వెరిఫై అవుతే, దేశానికి షాక్' అని హెచ్చరించారు. సిఎన్‌ఎన్ –న్యూస్18 లో రాఘవ్ బాపట్ల 'పోస్టల్ ఓటింగ్ అసాధారణత్వం, ఒక ఇంట్లో 501 ఓటర్లు ఇవి రిగ్గింగ్ సంకేతాలు. సుప్రీం కోర్టు జోక్యం చేసుకోవాలి అని సూచించారు.


విదేశీ మీడియా కూడా ఈ ఆరోపణలను పట్టుకుని చర్చించింది. బిబిసి న్యూస్‌లో సౌమ్యా గుప్తా రాహుల్ గాంధీ చేసిన హైడ్రోజన్ బాంబ్ వ్యాఖ్యలు భారత ఎన్నికల సమగ్రతలో ఉన్న పగుళ్లను బహిర్గతం చేశాయి. హర్యానాలో 25 లక్షల నకిలీ ఓట్లు బయటపడటంతో, ఎన్నికల కమిషన్ (ఇసిఐ) తటస్థతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇది మోడీ ప్రజాస్వామ్య ప్రతిఛాయను ప్రపంచవ్యాప్తంగా దెబ్బతీయవచ్చు అని కామెంట్ చేసింది. అల్ జజీరాలో మెహ్దీ హసన్ 'హర్యానాలో బిజెపి నకిలీ ఓటర్ల ద్వారా విజయాన్ని దొంగిలించిందని కాంగ్రెస్ ఆరోపించింది. రాహుల్ బ్రెజిలియన్ మోడల్ ఫోటోలతో నకిలీ ఐడిల ఆధారాలను చూపించారు. అంతర్జాతీయ పరిశీలన అవసరమయ్యే కుంభకోణం. భారత ఎన్నికల కమిషన్ కాదా అని ప్రశ్నించారు. రాయటర్స్ రిపోర్ట్‌లో 'ఆపరేషన్ సర్కార్ చోరి'లో ప్రధాని మోడీ, సిఇసి కుట్రపూరితంగా వ్యవహరించారని గాంధీ ఆరోపించారు. ఎగ్జిట్ పోల్స్ కాంగ్రెస్ గెలుస్తుందని అంచనా వేసింది. కానీ బిజెపి స్వల్ప ఓట్ల తేడాతో విజయం సాధించింది. నకిలీల ద్వారా 125% ఓటర్ల ద్రవ్యోల్బణం ప్రజాస్వామ్యంపై ఎర్ర జెండాలు ఎగురవేస్తోంది' అని పేర్కొన్నారు. న్యూస్ వీక్ మ్యాగజైన్‌లో 'హర్యానాలో బిజెపి విజయంపై రాహుల్ గాంధీ హెచ్–బాంబ్' పేల్చారు. 25 లక్షల బోగస్ ఓట్లను ఆరోపిస్తున్నారు.

యుపి వలసదారుల నుండి జీరో అడ్రస్ ఇళ్ల వరకు, ఆరోపణలు వ్యవస్థాగత మోసాన్ని చిత్రీకరిస్తున్నాయి. ఇసిఐ పారదర్శకంగా స్పందించాలి' అని విశ్లేషించారు. గార్డియన్ పేపర్‌లో భారత ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ హర్యానా ఎన్నికల్లో ఓట్ల రిగ్గింగ్ జరిగిందని పేలుడు ఆరోపణలు చేస్తున్నారు. 100 కార్డులలో ఒక ఫోటో ఆధారాలతో, ఈ 'హైడ్రోజన్ బాంబు' ఎన్నికల సంస్కరణల కోసం పిలుపులను రేకెత్తించవచ్చు' అని రాశారు. సిఎన్‌ఎన్ ఇంటర్నేషనల్‌లో క్రిస్టియన్ అమపోర్ 'హర్యానా ఎన్నికల వివాదం భారతదేశ ఓటింగ్ వ్యవస్థలోని దుర్బలత్వాలను హైలైట్ చేస్తుంది. వీడియోలు, డేటా మద్దతుతో గాంధీ వాదనలు మోడీ పాలనలో న్యాయాన్ని సవాలు చేస్తున్నాయి. గ్లోబల్ వాచ్‌డాగ్‌లు దర్యాప్తు చేయాలి' అని అన్నారు. ఫారిన్ పాలసీ మ్యాగజైన్‌లో 'నకిలీ ఓటర్లపై రాహుల్ బహిర్గతం 5.2 లక్షల నకిలీలు, 98 వేల తప్పుడు చిరునామాలు బిజెపి 2024 హర్యానా విజయాన్ని ప్రశ్నిస్తుంది. నిరూపిస్తే, అది ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యంపై విశ్వాసాన్ని తగ్గిస్తుంది' అని విశ్లేషణ చేశారు. ఈ మీడియా కామెంట్స్ ఆరోపణల లోతును తెలియజేస్తున్నాయి. దేశీయ ఛానెల్స్ రాజకీయ డిబేట్‌లకు దారి తీశాయి. విదేశీ మీడియా భారత ప్రజాస్వామ్యాన్ని అంతర్జాతీయ స్థాయిలో ప్రశ్నిస్తోంది. బిజెపి ఈ ఆరోపణలను 'తప్పుడు, ఆధారరహితం' అని ఖండించింది.

కేంద్రమంత్రి కిరణ్ రిజిజు రాహుల్ తన వైఫల్యాలను దాచుకోవడానికి ఎన్నికల వ్యవస్థను అసత్యాలతో ఆరోపిస్తున్నారు' అని చెప్పారు.కానీ మీడియా ఆధారాలపై దృష్టి పెట్టింది. రాహుల్ చూపిన వీడియోలు, డేటా రిపోర్టులు విశ్వసనీయమని చాలా చానెల్స్ అభిప్రాయపడ్డాయి. ఎన్నికల కమిషన్ ఇప్పటివరకు సమాధానం చెప్పలేదు. ఇది వివాదాన్ని మరింత పెంచుతోంది. ఈ ఘటన భారత ఎన్నికల వ్యవస్థపై పెద్ద ప్రశ్నలు లేవనెత్తుతోంది. నకిలీ ఓట్లు, డూప్లికేట్ ఐడిలు ఎలా జరిగాయి? ఎన్నికల కమిషన్ స్వతంత్రమా? ఎగ్జిట్ పోల్స్‌తో ఫలితాల మధ్య తేడా ఎందుకు ఈ ప్రశ్నలకు సమాధానాలు రావాలి. రాహుల్ ఆరోపణలు నిజమైతే, ఎన్నికల సంస్కరణలు అవసరం. తప్పితే, కాంగ్రెస్ విశ్వసనీయతపై ప్రశ్నలు. ఇది రాజకీయాల్లో కొత్త అధ్యాయానికి దారి తీస్తుంది. ప్రజాస్వామ్యం బలపడాలంటే, పారదర్శకత ముఖ్యం. ఈ 'హైడ్రోజన్ బాంబ్' పేలుడు దేశాన్ని మేల్కొల్పాలి.

# సైబర్ క్రైమ్ పోలీసుల భారీ ఆపరేషన్

సైబర్ నేరగాళ్ల ఆగడాలను అరికట్టేందుకు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు భారీ ఆపరేషన్ చేపట్టారు. అక్టోబర్ నెలలో 196 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి.. 55 మందిని అరెస్టు చేశారు. బాధితులకు రూ.62.34 లక్షలు అప్పగించారు. సైబర్ నేరగాళ్ల బ్యాంకు ఖాతాల్లో రూ.107 కోట్ల లావాదేవీలు గుర్తించారు. వివిధ కేసుల్లో 8 రాష్ట్రాలకు చెందిన 55 మంది సైబర్ మోసగాళ్లను అరెస్టు చేసినట్లు శుక్రవారం పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించారు. చైనా పౌరుల ద్వారా డిజిటల్ అరెస్టు స్కామ్ చేస్తున్నట్లు గుర్తించారు.62 ఏళ్ల వృద్ధుడి నుంచి రూ.1.07 కోట్లు దోచుకున్న ముఠాను సైబర్ క్రైమ్ పోలీసులు గత నెలలో అరెస్టు చేశారు. అదృశ్యమైన ఫోన్ ద్వారా ముగ్గురు నిందితులు రూ.1.95 లక్షలు దోచుకోగా వారిని కూడా అరెస్టు చేశారు. ఏపీలో ఫేక్ ట్రేడింగ్ యాప్‌తో రూ.24.17 లక్షలు మోసం చేసిన వ్యక్తిని అరెస్టు చేశారు. ఇన్వెస్ట్‌మెంట్, డిజిటల్ అరెస్టు, సోషల్ మీడియా ఫ్రాడ్‌ల ద్వారా 33 సైబర్ మోసాలు జరిగినట్లు పోలీసులు వెల్లడించారు. నిందితుల నుంచి 31





సెల్‌ఫోన్లు, 14 చెక్‌బుక్‌లు, 9 డెబిట్ కార్డులు స్వాధీనం చేసుకున్నారు.

# మహిళా క్రికెటర్ శ్రీ చరణికి రూ.2.5 కోట్లు నజరానా!



- ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రోత్సాహకం!
- ఇంటి నిర్మాణం కోసం 1000 చ.గ. స్థలం
- గ్రూప్ -1 ఉద్యోగం
- మర్యాదపూర్వకంగా క్యాంపు కార్యాలయంలో సీఎంను కలిసిన శ్రీచరణి
- మహిళా క్రికెటర్ కు పుష్ప గుచ్చం ఇచ్చి స్వాగతం పలికిన మంత్రి నారా లోకేశ్








మహిళా క్రికెట్ వరల్డ్ కప్ విజేత, టీమిండియా సభ్యురాలైన తెలుగమ్మాయి శ్రీ చరణికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భారీ నజరానా ప్రకటించారు. శ్రీ చరణికి రూ. 2.5 కోట్ల నగదు బహుమతి ఇవ్వాలని సీఎం నిర్ణయించారు. దీంతో పాటు ఇల్లు నిర్మించుకునేందుకు




కడపలో 1000 చ.గ. స్థలం కేటాయిస్తున్నట్టు తెలిపారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం లో గ్రూప్ 1 అధికారిగా ఉద్యోగం కూడా కల్పిస్తామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. శుక్రవారం సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును, మంత్రి నారా లోకేష్‌ను క్రికెటర్ శ్రీ చరణి మర్యాద పూర్వకంగా కలిశారు.

ఉమెన్ వరల్డ్ కప్ గెలుచుకున్న ఆనందక్షణాలను సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌తో శ్రీ చరణి పంచుకున్నారు. తనకు మద్దతుగా నిలిచినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ శ్రీ చరణిని అభినందించారు. ఉమెన్ వరల్డ్ కప్ గెలుచుకోవడం ద్వారా భారత దేశ మహిళల సత్తా చాటారని, మహిళా క్రీడాకారులకు ఆదర్శంగా నిలిచారని సీఎం అన్నారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు భారత జట్టుకు అందించాలని అభిలషించారు.

ఈ సందర్భంగా శ్రీ చరణి మహిళా క్రికెటర్లు సంతకాలు చేసిన టీ షర్ట్ ను ముఖ్యమంత్రికి అందించారు. దానిని ఆప్యాయంగా స్వీకరించిన ముఖ్యమంత్రి శ్రీచరణి బృందం భవిష్యత్ లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. శ్రీ చరణితో పాటు ముఖ్యమంత్రిని కలిసిన వారిలో మహిళా క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్ కూడా ఉన్నారు.

అంతకుముందు గన్నవరం ఎయిర్ పోర్టులో శ్రీ చరణికి ఘన స్వాగతం పలికిన మంత్రులు అనిత, సవిత, సంధ్యా రాణి, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కేశినేని చిన్ని, కార్యదర్శి సానా సతీష్, శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు.. ఆమెతో పాటు సీఎం క్యాంప్ కార్యాలయానికి వచ్చారు. క్యాంపు కార్యాలయంలో మంత్రి నారా లోకేష్ శ్రీ చరణికి స్వాగతం పలికారు.






# శుభ్‌మన్ గిల్‌పై వేటు పడేనా?

**ఆస్ట్రేలియాతో ఆఖరి పోరుకు భారత్ సిద్ధం**

**బ్రిస్బేన్ వేదికగా ఆస్ట్రేలియాతో నాలుగో టీ20**

**సంజూను తుది జట్టులోకి తీసుకునే ఛాన్స్**

**ఐదు టీ20ల సిరీస్‌లో 2-1తో ఆధిక్యం**

ఆస్ట్రేలియాతో ఐదు టీ20ల సిరీస్‌లో 2-1తో ఆధిక్యంలో నిలిచిన భారత జట్టు ఆఖరి పోరుకు సిద్ధమైంది. శనివారం బ్రిస్బేన్ వేదికగా జరిగే మ్యాచ్‌లో ఆతిథ్య ఆసీస్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. నాలుగో టీ20లో అద్భుత విజయాన్ని అందుకున్న టీమిండియా ఆఖరి




మ్యాచ్‌లోనూ అదే జోరు కొనసాగించి సిరీస్ కైవసం చేసుకోవాలనుకుంటుంది. మరోవైపు యాషెస్ సిరీస్ నేపథ్యంలో సీనియర్లు దూరమైన వేళ యువ ప్లేయర్లతో ఆడుతున్న ఆసీస్.. సిరీస్ సమం చేయడంపై కన్నేసింది. టీ20 ప్రపంచకప్ 2026 సన్నాహకంలో భాగంగా ఆఖరి మ్యాచ్‌లోనూ మార్పులు చేసే అవకాశం ఉంది. బ్యాటింగ్ ఆల్‌రౌండర్ నితీష్ కుమార్ రెడ్డితో పాటు సంజూ శాంసన్‌ను తుది జట్టులోకి తీసుకునే ఛాన్స్ ఉంది. ఈ ఇద్దరి కోసం వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో పాటు శివమ్ దూబేకు విశ్రాంతి ఇవ్వవచ్చు.టీ20 ప్రపంచకప్ 2026 సన్నాహాల్లో భాగంగా ఈ సిరీస్‌ను టీమిండియా ప్రయోగాలకు ఉపయోగించుకుంది. హర్షిత్ రాణా, సంజూ శాంసన్, కుల్దీప్ యాదవ్‌లను తొలి రెండు టీ20ల్లో ఆడించగా.. జట్టు అంచనాలను అందుకోలేకపోయారు. దాంతో మూడో టీ20లో ఈ ముగ్గురిపై వేటు వేసిన గంభీర్.. జితేశ్ శర్మ, వాషింగ్టన్ సుందర్, అర్ష్‌దీప్ సింగ్‌లకు అవకాశాలు కల్పించింది. ఈ ముగ్గురు అద్భుతమైన ప్రదర్శన కనబర్చారు. నాలుగో టీ20లో జితేశ్, సుందర్ విఫలమైనా.. ఆఖరి మ్యాచ్‌లో కొనసాగించనున్నారు. రెండు మినహా తుది జట్టులో భారీగా మార్పులు జరిగే అవకాశం లేదు. బ్యాటింగ్‌లో సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ సత్తా చాటాల్సి ఉంది. ముఖ్యంగా సూర్య వైఫల్యం విమర్శలకు దారి తీస్తోంది. బౌలింగ్ బాధ్యతలను జస్‌ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్‌లతో పాటు స్పిన్నర్లు వరుణ్ చక్రవర్తీ,వాషింగ్టన్ సుందర్‌లు పంచుకోనున్నారు. నితీష్ కుమార్ రెడ్డి కూడా అండగా నిలవనున్నాడు.

**ఆస్ట్రేలియాతో నాలుగో టీ20 ఆడే భారత తుది జట్టు(అంచనా)**

శుభ్‌మన్ గిల్/సంజూ శాంసన్, అభిషేక్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, శివమ్ దూబే/నితీష్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, జితేష్ శర్మ(కీపర్), అర్ష్‌దీప్ సింగ్, జస్‌ప్రీత్ బుమ్రా, వరుణ్ చక్రవర్తీ.




# ఎమ్మెస్కే ప్రసాద్‌కు అవమానం!

టీమిండియా మాజీ చీఫ్ సెలెక్టర్, తెలుగు తేజం ఎమ్మెస్కే ప్రసాద్‌కు ఘోర అవమానం ఎదురైంది. ప్రపంచకప్ విన్నర్, తెలుగు తేజం శ్రీచరణికి ఘన స్వాగతం పలికేందుకు గన్నవరం విమానాశ్రయానికి వచ్చిన ఎమ్మెస్కే ప్రసాద్‌ను సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకుంది. ఈ వ్యవహారంతో తీవ్ర ఆగ్రహానికి గురైన ఎమ్మెస్కే ప్రసాద్ ఎస్పీకి ఫిర్యాదు చేశారు. మాజీ క్రికెటర్, చీఫ్ సెలెక్టర్‌గా తనకు ప్రోటోకాల్ ఇవ్వకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన ఎమ్మెస్కే ప్రసాద్.. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్(ఏసీఏ) ప్రతినిధులపై కూడా బీసీసీఐకి ఫిర్యాదు చేసే యోచనలో ఉన్నారు.ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆపరేషన్స్ డైరెక్టర్‌గా ఎమ్మెస్కే ప్రసాద్ అద్భుత పనితీరు కనబర్చాడు. 2009 నుంచి 2014 వరకు ఈ బాధ్యతలు నిర్వర్తించిన ఎమ్మెస్కే ప్రసాద్.. క్రికెటర్లకు అనేక మౌళిక వసతులు కల్పించాడు. ఏసీ క్రికెట్ అకాడమీలతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఏసీఏ మైదానాల అభివృద్ధికి కృషి చేశారు. ఈ పని తీరుకు రివార్డ్‌గానే అతనికి చీఫ్ సెలెక్టర్ పదవి దక్కింది. అలాంటి ఆటగాడిని సెక్యూరిటీ అడ్డుకోవడంపై క్రికెట్ అభిమానులు కూడా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.వికెట్ కీపర్ కమ్ బ్యాటర్ అయిన ఎమ్మెస్కే ప్రసాద్.. 1999-2000 మధ్య భారత్ తరఫున ఆరు టెస్టు మ్యాచ్‌లు మరియు 17 వన్డేలు ఆడాడు. 2016 నుంచి 2019 వరకు భారత చీఫ్ సెలెక్టర్‌గా పని చేశారు.

# చరిత్ర సృష్టించిన ఆర్చర్ శీతల్ దేవీ

ఒలింపిక్ మెడల్ విన్నర్, భారత స్టార్ పారా ఆర్చర్ శీతల్ దేవి కెరీర్‌లో మరో మైలురాయిని సాధించింది. ఇటీవల జాతీయ ట్రయల్స్‌లో అద్భుతమైన ప్రదర్శన తర్వాత, జెడ్డాలో జరగనున్న ఆసియా కప్ స్టేజ్- 3 పోటీలకు శీతల్ ఎంపి కైంది. అయితే ఈ పోటీలో ఆమె, శారీరకంగా ఫిట్‌గా ఉన్న అథ్లెట్లను ఎదుర్కోనుండడం విశేషం. సౌదీ అరేబియా జెడ్డా వేదికగా వచ్చే నెలలో వివిధ ఈవెంట్లలో స్టేజ్- 3 పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలకు శీతల్ దేవి, శారీరక సామర్థ్యం ఉన్న జూనియర్ జట్టుకు ఎంపికైంది. ఈ జట్టులో పారా అథ్లెట్ అయిన శీతల్ చోటు దక్కించుకోవడం చరిత్రాత్మకం. శారీరక సామర్థ్యం ఉన్న జూనియర్ జట్టుకు ఎంపికైన మొదటి భారతీయ పారా ఆర్చర్‌గా కూడా ఆమె ఘనత సాధించింది. ఈ మేరకు శీతల్ సోషల్ మీడియాలో ఆనందం వ్యక్తం చేసింది. "నేను విలు విద్య ప్రారంభించినప్పుడు, నాకు ఒక కల వచ్చింది. ఏదో ఒక రోజు నేను ఉత్తమ ఆర్చర్లతో పోటీ పడాలనుకున్నాను. నేను నా శాయశక్తులా ప్రయత్నించాను. కానీ, నేను నా కలను ఎప్పుడూ వదులుకోలేదు. ప్రతి ఓటమి నుంచి నేను పాఠాలు నేర్చుకున్నాను. ఫలితంగా ఈ రోజు నా కల నిజమైంది" అని శీతల్ దేవీ పోస్టులో రాసుకొచ్చింది. హరియాణాలోని సోనిపట్‌లో రీసెంట్‌గా జరిగిన జాతీయ ఎంపిక ట్రయల్స్‌లో



18ఏళ్ల శీతల్ పోటీ పడింది. దాదాపు 60 మందికి పైగా ఉత్తమ ఆర్చర్లతో పోటీపడిన ఆమె మూడో స్థానం దక్కించుకుంది. అర్హత రౌండ్‌లో ఆమె మొత్తం 703 పాయింట్లు (352 ం 351) సాధించింది.

15.75 అదనపు పాయింట్లతో తేజల్ మొదటి స్థానం, వైదేహి జాదవ్ 15 పాయింట్లతో రెండవ స్థానంలో నిలిచింది. 11.75 పాయింట్లతో శీతల్ మూడో స్థానంలో దక్కించుకుంది. మహారాష్ట్రకు చెందిన జ్ఞానేశ్వరి గాధే (11.5) నాలుగో స్థానంలో నిలిచింది.

# ఆస్ట్రేలియాపై అత్యధిక వికెట్లు తీసిన బౌలర్

**జస్‌ప్రీత్ బుమ్రాకు అరుదైన ఘనత**




టీమిండియా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా అరుదైన ఘనత సాధించాడు. టీ20ల్లో ఆస్ట్రేలియాపై అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా చరిత్ర సృష్టించాడు. నవంబర్ 6న క్వీన్స్‌లాండ్ వేదికగా ఆసీస్‌తో జరిగిన నాలుగో టీ20 మ్యాచ్‌లో ఓ వికెట్ పడగొట్టడం ద్వారా బుమ్రా ఈ ఘనత అందుకున్నాడు. ఈ క్రమంలో అతడు పాకిస్తాన్ మాజీ స్పిన్నర్ సయీద్ అజ్మల్ ను అధిగమించాడు. ఆసీస్‌తో జరిగిన టీ20 మ్యాచ్‌ల్లో అజ్మల్ 11 ఇన్నింగ్స్‌ల్లో 19 వికెట్లు తీశాడు. ఇక బుమ్రా 17 ఇన్నింగ్స్‌ల్లో 20 వికెట్లు సాదించాడు. ఈ జాబితాలో వీరిద్దరి తరువాతి స్థానాల్లో పాక్ ఆటగాడు మహ్మద్ అమీర్, న్యూజిలాండ్ స్పిన్నర్ మిచెల్ సాంట్నర్ ఉన్నారు.ఇక మ్యాచ్ విషయానికి వస్తే.. మొదట బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 167 పరుగులు చేసింది.

భారత బ్యాటర్లలో శుభ్‌మన్ గిల్ (46), అభిషేక్ శర్మ (28), శివమ్ దూబె (22), అక్షర్ పటేల్ (21 నాటౌట్) రాణించారు. ఆసీస్ బౌలర్లలో ఆడమ్ జంపా, నాథన్ ఎల్లిస్‌లు చెరో మూడు వికెట్లు తీశారు. జేవియర్ బార్ట్‌లెట్, మార్కస్ స్టోయినిస్ తలా ఓ వికెట్ సాధించారు.అనంతరం 168 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆసీస్ 18.2 ఓవర్లలో 119 పరుగులకు ఆలౌటైంది. ఆసీస్ బ్యాటర్లలో మిచెల్ మార్ష్ (30), మాథ్యూ షార్ట్ (25) లు పర్వాలేనిపించగా.. జోష్ ఇంగ్లిష్ (12), టిమ్ డేవిడ్ (14), జోష్ ఫిలిప్ (10), గ్లెన్ మాక్స్‌వెల్ (2)లు విఫలం అయ్యారు. టీమ్ఇండియా బౌలర్లలో వాషింగ్టన్ సుందర్ మూడు వికెట్లు, అక్షర్ పటేల్, శివమ్ దూబెలు చెరో రెండు వికెట్లు తీశారు. వరుణ్ చక్రవర్తి, అర్ష్‌దీప్ సింగ్, జస్‌ప్రీత్ బుమ్రాలు తలా ఓ వికెట్ పడగొట్టారు.

**టీ20ల్లో ఆసీస్ పై అత్యధిక వికెట్లు తీసిన బౌలర్లు వీరే..**

1. జస్‌ప్రీత్ బుమ్రా (భారత్) - 20 వికెట్లు (17 ఇన్నింగ్స్‌ల్లో)
2. సయీద్ అజ్మల్ (పాకిస్తాన్) - 19 వికెట్లు (11 ఇన్నింగ్స్‌ల్లో)
3. మహ్మద్ అమీర్ (పాకిస్తాన్) - 17 వికెట్లు (10 ఇన్నింగ్స్‌ల్లో)
4. మిచెల్ సాంట్నర్ (న్యూజిలాండ్) -17 వికెట్లు (12 ఇన్నింగ్స్‌ల్లో )

## తారక్‌లో మార్పు సినిమా కోసమేనా?



గతకొన్ని రోజులుగా టాలీవుడ్ స్టార్ హీరో ఎన్టీఆర్ అభిమానులు సోషల్ మీడియాలో చర్చల్లో మునిగిపోయారు. దానికి ప్రధాన కారణం ఆయన కొత్త లుక్! ఇటీవల తారక్ హాజరైన కొన్ని ఈవెంట్లలో ఆయన లుక్స్ వైరల్ అయ్యాయి. అందులో ఆయన చాలా సన్నగా కనిపించారు. దీనిని చూసి ఫ్యాన్స్? ఆశ్చర్యపోతూనే కొంత ఆందోళన కూడా వ్యక్తం చేశారు. చాలామంది సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో "ఎందుకు తారక్ ఇంత లీన్‌గా కనిపిస్తున్నారు?" "ఈ మార్పు సినిమా కోసమేనా?" అంటూ కామెంట్లు చేస్తున్నారు.ప్రస్తుతం తారక్ ప్రశాంత్?నీల్?తో ఓ సినిమా చేస్తున్నారు. ఈ సినిమా కోసం లుక్ మార్చుకుంటున్నారు. ఇందులో తారక్ లుక్‌పై ప్రశాంత్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. తాజాగా అదిరే అప్డేట్ ఇచ్చారు. తారక్ లుక్‌ను దగ్గరుండి డిజైన్ చేయించు కుంటున్నారు. దీనికి సంబంధించిన ఓ ఫొటోను సోషల్ మీడియాలో రిలీజ్ చేశారు. ఇందులో ప్రశాంత్ పర్యవేక్షనలో డిజైనర్ తారక్ లుక్‌ను ట్రిమ్ చేస్తున్నారు. అలాగే త్వరలోనే ఇంకో షెడ్యూల్ షురూ కానున్నట్లు చెప్పారు.

ఎన్టీఆర్ ఈ సినిమాలో మునుపెన్నడూ చూడని కొత్త పాత్రలో కనిపించనున్నారని సమాచారం.

## పవన్ కళ్యాణ్‌తో 'బ్రో 2'..

### పవన్ కళ్యాణ్ గ్రీన్ సిగ్నలే తరువాయి



పవన్ కళ్యాణ్, సాయి దుర్గ తేజ్ నటించిన 'బ్రో' సినిమా బాక్సాఫీస్ వద్ద ఆశించిన విజయం సాధించలేదు. అయినప్పటికీ, దర్శకుడు సముద్రఖని 'బ్రో 2' తీయడానికి సిద్ధంగా ఉన్నానని, పవన్ కళ్యాణ్ గ్రీన్ సిగ్నల్ ఇస్తే సినిమా పట్టాలెక్కుతుందని ప్రకటించారు. ఈ వార్త పవన్ అభిమానులను ఆశ్చర్యానికి గురిచేసింది. 'ఓజీ 2' వంటి భారీ ప్రాజెక్టులున్న నేపథ్యంలో 'బ్రో 2' అవసరమా అని చర్చలు మొదలయ్యాయి.పవన్ కళ్యాణ్, సాయి దుర్గ తేజ్ కాంబినేషన్‌లో వచ్చిన ఫాంటసీ కామెడీ సినిమా 'బ్రో'. ఇది మామా అల్లుళ్లు కలిసి నటించిన ఫస్ట్ మూవీ. 'వినోదయ సితం' అనే తమిళ సినిమాకి ఇది రీమేక్. మాతృకను డైరెక్ట్ చేసిన సముద్రఖని.. కొన్ని మార్పుల చేర్పులతో తెలుగులో తెరకెక్కించారు. త్రివిక్రమ్ శ్రీనివాస్ దీనికి స్క్రీన్ ప్లే అందించారు. 2023 జులై నెలాఖరున రిలీజైన ఈ సినిమా.. బాక్సాఫీస్ దగ్గర నిరాశ పరిచింది. పవర్ స్టార్ అభిమానులకు కూడా ఈ సినిమా నచ్చలేదు. అందుకే కలెక్షన్స్ రాలేదు. అయితే అలాంటి చిత్రానికి సీక్వెల్ చేయడానికి స్క్రిప్ట్ రెడీ అయింది.అవును.. మీరు విన్నది నిజమే. 'బ్రో 2' సినిమా చేయడానికి డైరెక్టర్ కమ్ యాక్టర్ సముద్రఖని సిద్ధంగా ఉన్నారు. తమిళంలో తీస్తారో లేదో తెలియదు కానీ.. తెలుగులో మాత్రం పవన్ కళ్యాణ్ తోనే ఈ సీక్వెల్ తీయాలని ఫిక్స్ అయిపోయారు. దీనికి కథ కూడా సిద్ధంగానే ఉంది. పవన్ ఎప్పుడు గ్రీన్ సిగ్నల్ ఇస్తే, అప్పుడు సినిమాని పట్టాలెక్కించాలని చూస్తున్నారు. ఈ విషయాన్ని సముద్రఖని స్వయంగా మీడియా ముఖంగా వెల్లడించారు. 'బ్రో' మూవీకి సీక్వెల్ ఉంటుందని కన్ఫామ్ చేశారు. దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే, సముద్రఖని, రానా దగ్గుబాటి ప్రధాన పాత్రలు పోషించిన 'కాంత' సినిమా విడుదలకు సిద్ధంగా ఉంది. ప్రమోషన్స్‌లో భాగంగా గురువారం హైదరాబాద్ లో ట్రైలర్ లాంచ్ ఈవెంట్ నిర్వహించారు. దీనికి దుల్కర్, రానా, భాగ్యశ్రీ లతో పాటు సముద్రఖని కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా 'బ్రో 2' మూవీ ప్రస్తావన వచ్చింది. దీనిపై సముద్రఖని స్పందిస్తూ.. "బ్రో 2' స్క్రిప్టు రెడీగా ఉంది. అన్నగారు సిగ్నల్ ఇస్తే టేకాఫ్ అవుతుంది" అని అన్నారు.బ్రో 2' సినిమా స్క్రిప్ట్ రెడీ అని సముద్రఖని ప్రకటించడంతో పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ అంతా ఒక్కసారిగా సర్‌ప్రైజ్ అయ్యారు. ఒకింత షాక్ అయ్యారని చెప్పాలి. ఎందుకంటే ఇది వారు ఊహించని అప్డేట్. 'బ్రో' కమర్షియల్ గా పెద్దగా వర్కౌట్ కాలేదన్నది ఓపెన్ సీక్రెట్. ఏదో పవర్ స్టార్ ఇమేజ్, స్టార్ డమ్ కారణంగా మంచి ఓపెనింగ్స్ వచ్చాయి. కానీ కంటెంట్ పరంగా చూసుకుంటే మాత్రం సాధారణ ప్రేక్షకులతో పాటుగా అభిమానులని కూడా అంతగా మెప్పించలేకపోయింది. అసలు ఆల్రెడీ ఓటీటీలో తెలుగులో అందుబాటులో ఉన్న ఈ రీమేక్ సినిమా పవన్ చేయడంపై అప్పట్లోనే చాలామంది ఫ్యాన్స్ పెదవి విరిచారు.

పవన్ కళ్యాణ్ ఈ మధ్యనే 'ఓజీ' సినిమాతో తన కెరీర్ లోనే బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ అందుకున్నారు. 'ఉస్తాద్ భగత్ సింగ్' మూవీ రిలీజుకు రెడీ అవుతోంది.

## అనసూయ రొమాంటిక్ సాంగ్!?



ఒక్కసారిగా అనసూయ మళ్ళీ హాట్ టాపిక్ అయింది. అందుకు ప్రధాన కారణం ఓ వీడియో సాంగ్. ప్రభుదేవా, రాయ్ లక్ష్మీ, అనసూయ భరద్వాజ్ ముఖ్య పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'వోల్ఫ్' మళ్లీ వార్తల్లో నిలిచింది. 2023 ఆగస్టులో టీజర్‌ను విడుదల చేసిన ఈ చిత్ర బృందం, ఇన్నాళ్ల విరామం తర్వాత తాజాగా ఓ కొత్త అప్డేట్ ఇచ్చింది. తాజాగా విడుదలైన "సాసా సాసా" అనే తమిళ లిరికల్ వీడియో సాంగ్ ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది.ఈ పాటలో ప్రభుదేవా తన సొగసైన డ్యాన్స్ మూవ్స్‌తో ఆకట్టుకుంటూ కనిపిస్తారు. ఓ ఇంట్లో ఒంటరిగా ఉన్న హీరో జీవితంలో ముగ్గురు అందమైన యువతులు ఒక్కొక్కరిగా ప్రవేశించడం, వారంతా చాటుగా మొబైల్‌లో వీడియోలు తీయడం, హీరోను ఆటపట్టించడం వంటి రొమాంటిక్ సన్నివేశాల మధ్య ఈ పాట సాగుతుంది. మెలోడీకి తోడు స్టైలిష్ విజువల్స్, ప్రభుదేవా ఎనర్జిటిక్ డ్యాన్స్ ఫ్యాన్స్‌కి స్పెషల్ ట్రీట్‌గా మారాయి. ఇప్పటికే ఈ త్రీసమ్ రొమాంటిక్ సాంగ్ యువతలో విపరీతంగా వైరల్ అవుతోంది. ప్రెజెంటేషన్‌లో ఉన్న క్లాస్ టచ్, సంగీతంలో ఉన్న మోడర్న్ బీట్‌లు ప్రేక్షకులను ఆకర్షిస్తున్నాయి. అయితే అనసూయ భరద్వాజ్ ఇలాంటి సాంగ్‌లో నటించడం కొంతమందిని ఆశ్చర్యపరిచింది. ఆమె ఓ తాంత్రికురాలి పాత్రలో కనిపించబోతున్నారని, ఆ రోల్ హర్రర్-రోమాన్స్ మిక్స్‌గా ఉంటుందని సమాచారం. అయినా, నెటిజన్లు "ఇలాంటి పాత్రలో అనసూయ ఎందుకు నటించింది?" అంటూ సోషల్ మీడియాలో విభిన్న కామెంట్లు చేస్తున్నారు. కొంతమంది ఆమెపై వ్యంగ్యంగా ట్వీట్లు చేస్తుండగా, మరికొందరు మాత్రం ఆమె కొత్త ప్రయోగాన్ని మెచ్చుకుంటున్నారు. ఏదేమైనా, "సాసా సాసా" పాటతో ఈ సినిమా మీద మళ్లీ చర్చ మొదలైంది.వినూ వెంకటేష్ దర్శకత్వంలో రూపొందిన 'వోల్ఫ్' చిత్రం ప్రభుదేవా కెరీర్‌లో 60వ సినిమాగా నిలవబోతోంది. సందేశ్ నాగరాజు, సందేశ్ ఎన్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రం త్వరలోనే తమిళంతో పాటు తెలుగు మరియు ఇతర భాషల్లో విడుదల కానుంది.

## వింటేజ్ స్టైల్లో ప్రభాస్?



పాన్ ఇండియా హీరో ప్రభాస్ నటిస్తున్న 'రాజాసాబ్' సినిమా కోసం రెబల్ స్టార్ అభిమానులు ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్నారు. దర్శకుడు మారుతి రూపొందిస్తున్న ఈ హార్రర్ ఎంటర్టైనర్‌లో ప్రభాస్ వింటేజ్ స్టైల్లో కనిపించనున్నాడని ఇప్పటికే ఊహాగానాలు ఉన్నాయి. ఈ సినిమాను వచ్చే సంక్రాంతి కానుకగా జనవరి 9న విడుదల చేయాలని బృందం భావిస్తోంది. అయితే కొంతకాలంగా చిత్రానికి సంబంధించిన అప్డేట్స్ రాకపోవడంతో సినిమా మళ్లీ వాయిదా పడుతుందా అనే వార్తలు చక్కర్లు కొట్టాయి. కానీ మేకర్స్ వాటిని ఖండిస్తూ స్పష్టత ఇచ్చారు. సినిమా ఫస్ట్ కాపీ డిసెంబర్ 25 నాటికి రెడీ అవుతుందని, అలాగే అమెరికాలో గ్రాండ్ ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుపుతున్నట్టు తెలిపారు. ఇప్పుడు అయితే వరుసగా అదిరిపోయే అప్డేట్స్ ఇవ్వడానికి టీమ్ సిద్ధంగా ఉన్నట్లు సమాచారం.

మొదటగా,రాజాసాబ్ ఫస్ట్ సింగిల్ విడుదల కానుంది. తమన్ ఇప్పటికే ఒక మాస్ అండ్ మెలోడియస్ ట్రాక్‌ను కంపోజ్ చేసినట్టు తెలుస్తోంది. ఈ పాటను ఈ నెల మూడో వారంలో విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నారు. ఆ తరువాత ప్రతి పది రోజులకు ఒక్కో సాంగ్ విడుదల చేస్తూ ప్రమోషన్స్ ను వేగంగా ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించారు. అలాగే,న్యూ ఇయర్ స్పెషల్ గిఫ్టా సినిమా ట్రైలర్ విడుదల చేయాలనే ఆలోచనలో మారుతి ఉన్నాడట. ఇందుకోసం ప్రత్యేకంగా ఇంపాక్ట్ కలిగించే పవర్‌ఫుల్ ట్రైలర్ కట్ సిద్ధం చేస్తున్నారు. ఈ ట్రైలర్‌తోనే సినిమా పై అంచనాలను మరింత ఉద్ధృతం చేయాలని టీమ్ భావిస్తోంది.క్రిస్మస్ సందర్భంగా అమెరికాలో ప్రీ రిలీజ్ ఈవెంట్, ఆపై జనవరి మొదటి వారంలో తెలుగురాష్ట్రాలలో భారీ స్థాయి ప్రీ రిలీజ్ కార్యక్రమం ప్లాన్ చేస్తుండగా, సినిమా మాత్రం చెప్పినట్టే జనవరి 9న వరల్డ్ వైడ్గా థియేటర్లలో సందడి చేయడానికి సిద్ధంగా ఉంది.

## ఏకే 64లో లారెన్స్, విజయ్ సేతుపతి?








తమిళ స్టార్ హీరో అజిత్ కుమార్ నటిస్తున్న తాజా యాక్షన్ చిత్రం 'ఏకే 64' గురించి మరో కీలక అప్డేట్ బయటకు వచ్చింది. ఆదిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో రూపొందుతున్నఈ పాన్ ఇండియా భారీ ప్రాజెక్ట్ కోసం గణనీయమైన బడ్జెట్‌ను కేటాయించినట్టు తెలిసింది. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమాలో అజిత్‌తో పాటు మరో ఇద్దరు స్టార్ హీరోలు కూడా కీలక పాత్రల్లో నటించబోతున్నారు.వారు విజయ్ సేతుపతి,రాఘవ లారెన్స్. అయితే వీరిద్దరూ ప్రతినాయకులుగా నటిస్తున్నారా? లేక అజిత్‌కు అండగా నిలిచే శక్తివంతమైన పాత్రల్లో వస్తారా?అన్నది చిత్రయూనిట్ ఇంకా వెల్లడించలేదు. కానీ ఇండస్ట్రీ వర్గాల మాటల ప్రకారం, వీరి రోల్స్ మల్టీ-డైమెన్షనల్‌గా ఉండనున్నాయని,కేవలం ప్రతినాయక పాత్రలుగా మాత్రమే కాకుండా కథలో ప్రధాన మలుపులకు కారణమవుతారని సమాచారం. ఇటీవల 'వాలిమై', 'వీర్‌మా', 'తునివు', 'గుడ్ బ్యాడ్ అగ్లీ' వంటి సినిమాలతో వరుస హిట్లు అందుకున్న అజిత్ ఈసారి మరింత స్టైలిష్, మాస్, అలాగే ఎమోషన్ కలగలిపిన పవర్‌ఫుల్ యాక్షన్ డ్రామాను ఎంచుకున్నారని తెలుస్తోంది. జనవరిలో ఈ సినిమా సంబంధించిన పూర్తి వివరాలను అధికారికంగా ప్రకటిస్తామని అజిత్ ఇప్పటికే స్పష్టం చేశారు. ఈ సినిమాకి దేశంలోనే అగ్రశ్రేణి టెక్నీషియన్లు, యాక్షన్ మాస్టర్లు, డీఓపీ లు కలిసి పనిచేస్తున్నట్టు సమాచారం. అలాగే ఈ ప్రాజెక్ట్ కోసం అజిత్ తన కెరీర్‌లోనే అత్యధిక పారితోషికం తీసుకుంటున్నారని కోలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. ఇక రాఘవ లారెన్స్ ప్రస్తుతం 'కాంచన 4' షూటింగ్‌లో బిజీగా ఉన్నాడు. పూజా హెగ్డే, నోరా ఫతేహి కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ ప్రాజెక్ట్ ఇప్పటికే పాజిటివ్ టాక్‌ను సంపాదించుకుంది. మరోవైపు విజయ్ సేతుపతి బాలీవుడ్, కోలీవుడ్, టాలీవుడ్ ఇండస్ట్రీలలో వరుస సినిమాలతో శరవేగంగా దూసుకెళ్తున్నారు. 'ఏకే 64' లో అజిత్, విజయ్ సేతుపతి, రాఘవ లారెన్స్ ఒకే తెరపై కనిపిస్తే.. అది కేవలం కోలీవుడ్‌కే కాదు, పాన్ ఇండియా స్థాయిలోనే అత్యంత భారీ, క్రేజీ కాంబినేషన్‌గా నిలుస్తుందని సినీ విశ్లేషకుల అభిప్రాయం.

## క్లైమాక్స్ సినిమాకి గుండెకాయ



యూనిక్ కాన్సెప్ట్‌లు చేస్తాడని విష్ణు విశాల్‌కి పేరుంది. రాక్షసన్, ఎఫ్.ఐ.ఆర్., మట్టికుస్తీ సినిమాలు ఆయనకు మంచి పేరు తీసుకొచ్చాయి. తన సినిమాలను తెలుగు ప్రేక్షకులకు కూడా చేరవేయడానికి ఎప్పుడూ చొరవ చూపిస్తుంటారు. ఇప్పుడు ఆయన నుంచి ఆర్యన్ సినిమా రాబోతోంది. ఇది ఒక థ్రిల్లర్. సెల్వ రాఘవన్, శ్రద్ధా శ్రీనాథ్, మానస చౌదరి వంటి స్టార్ కాస్ట్ ఇందులో ఉన్నారు. గత వారం ఈ సినిమా రిలీజ్ కావాల్సింది. అయితే మాస్ జాతర, బాహుబలి ఎపిక్ రావడంతో వాయిదా వేశారు. కానీ ఈ సినిమా తమిళంలో ఇప్పటికే విడుదలైంది. సినిమాకు మిశ్రమ స్పందన వచ్చింది. ముఖ్యంగా క్లైమాక్స్ విషయంలో తమిళ ప్రేక్షకులు పెదవి విరిచారు. ఈ సినిమాకి రెండు క్లైమాక్స్‌లు షూట్ చేశారట. పబ్లిక్ టాక్‌ను బట్టి ఇప్పుడు మార్పులు చేశారు. తెలుగు వెర్షన్‌లో క్లైమాక్స్‌ని మార్చేశారు. కొత్త క్లైమాక్స్‌తో సినిమా విడుదల కానుంది. అలాగే తమిళ క్రిటిక్స్ చెప్పిన కొన్ని సూచనలను పాటిస్తూ ఎడిటింగ్‌లో కూడా మార్పులు చేశారు. క్లైమాక్స్ సినిమాకి గుండెకాయ. సినిమా ఎలా ఉన్నా, క్లైమాక్స్ బావుంటే ఆడియన్స్ పాజిటివ్ ఫీలింగ్‌తో బయటకు వస్తారు. మరి ఈ క్లైమాక్స్ మార్పు తెలుగు వెర్షన్‌కి ఎంత మేలు చేస్తుందో చూడాలి.

PUBLISHED BY G.KALPANA AND PRINTED AT YAGNA PRINTERS AND PUBLICATIONS, H.NO 18-105/4, OPP HANUMANPET, MALKAJGIRI(M)MEDCHAL- 500047, MEDCHAL MALKAJGIRI DISTRICT,TELANGANA PUBLISHED FROM H.NO02-66/254,MALLAREDDY NAGAR PHASE 1, GAJULARAMARAM, QUTHBULLAPUR, MEDCHAL-500055, DISTRICT MALKAJGIRI ,TELANGANA, EDITOR : G.DAYAKAR REDDY , RNI :TELTEL/2022/83927, PHONE NUMBER 9908293393,040- 45046154